# అక్షయ ఆహారము

## (Incorruptible Food)

కబిత గూటం



# అక్షయ ఆహారము
# Incorruptible Food

కబిత గూటం

KABITA GOOTAM

**Satyavani - Church of Christ**
**P.O.Box. 80, Kakinada**
**A.P - India 533 001**
**0884-2363722**

# పరిచయము

అక్షయ ఆహారము అను ఈ గ్రంథమును మీచేతిలో నుంచుటకు నేను చాల సంతోషించుచున్నాను. సోదరి కబితగూటం నా జీవిత భాగస్వామి, నా ముగ్గురు కుమారుల తల్లి. అత్యంత ప్రార్ధనాపరురాలు, ప్రేమమూర్తి, నిస్వార్థపరురాలు. దేవుని వాక్యమును అమితముగా ప్రేమించే వ్యక్తి. కుటుంబరీత్యా, సంఘరీత్యా అనేక పనులున్నను ప్రార్థన కొరకు, వాక్యపఠనము కొరకు తన దైనందిన జీవితంలో కేటాయించిన సమయాన్ని మాత్రం ఆమె ఎన్నడు త్యాగం చేయలేదు. ఆమె భక్తి విశ్వాసపూరిత జీవితం వలన నేను, నా బిడ్డలు, కుటుంబమంతయు ఆశీర్వదించబడ్డాము.

కబిత గారి మాతృభాష ఒరియా. అయినను తెలుగు మాట్లాడడం నేర్చుకొని తెలుగులో స్త్రీల కూటములలో వాక్యపరిచర్య చేయువరకు ఆమె తెలుగులో ప్రావీణ్యత సంపాదించిరి. ఈ గ్రంథంలోని వ్యాసములన్నియు ఇంగ్లీషులో వ్రాయబడగా మా సోదరీలు జెస్సీ సలోమి, హెప్సీ ప్రభాకర్‌గార్లు తెలుగున కనువదించిరి. ఈ వ్యాసములన్నియు తెలుగులో సత్యవాక్కులోను, హైదరాబాద్‌నుండి వెలువడి వచ్చు ప్రేమసాక్షి పత్రికలోను, ఒరియాలో **సత్యబాణి** పత్రికలోను ప్రచురించబడెను. వీటన్నిటిని సేకరించి ఒక సంపుటిగా సమకూర్చి సమర్పించుట యుక్తమని భావించి ఈ గ్రంథమును ముద్రించుట జరిగినది. దీనిలోని వ్యాసములను చదువుట ద్వారా మీరు ఆత్మీయంగా బలపడి ప్రభువు పనిలో వాడబడుదురనే నిరీక్షణతో దీనిని పుస్తక రూపములో సమర్పించుట జరిగినది. దేవుడు కబితా గారి కృషిని మెండుగా దీవించునుగాక.

సత్యవాణి, **జాషువా గూటం.**
ఆగష్టు, 2017.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | యెహోవా మనకు గొప్ప కార్యములు చేసియున్నారు | 5 |
| 2. | నీ పరిశుద్ధ పర్వతము మీద నివసింపదగినవాడెవడు? | 8 |
| 3. | నీవేమి ధరించుకొన్నావు? | 13 |
| 4. | మన దేవుడు దహించు అగ్ని | 17 |
| 5. | యెహోవాకు అసహ్యములైనవి | 20 |
| 6. | దేవునికి ప్రీతికరమైన సేవచేయుడి | 25 |
| 7. | హేబెలు మృతినొందియు మాటలాడుచున్నాడు | 29 |
| 8. | నా తమ్మునికి నేను కావలివాడనా? | 34 |
| 9. | దేవునితో నడిచిన హానోకు | 38 |
| 10. | అబ్రాహాము కుమారులు | 41 |
| 11. | అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము | 44 |
| 12. | ఇష్మాయేలు అనగా దేవుడు వినును | 47 |
| 13. | నోవహు దినములు ఏలాగు ఉండెనో... | 50 |
| 14. | ఒకానొక సమయమందు | 53 |
| 15. | శక్తికి మించిన ప్రయాణము | 58 |
| 16. | దేవుడు హిజ్కియా మొరవినెను | 61 |
| 17. | రాజైన యెహోషాపాతు ప్రఖ్యాతి, పతనము | 65 |
| 18. | పరమందొక దేవుడున్నాడు | 70 |
| 19. | బహుప్రియుడైన దానియేలు | 74 |
| 20. | బెల్షస్సరు యొక్క పాపములు | 77 |
| 21. | నాశనమునకు ముందు గర్వము నడుచును | 83 |
| 22. | ఆయన వాడుక చొప్పున | 87 |
| 23. | నా కిష్టమే నీవుశుద్ధుడవు కమ్ము | 91 |

24. వారు ఆయనను గుర్తించిరి 94
25. వెలుగు సంబంధులు 98
26. దేవుని దొడ్డిలోనికి మానవునితిరిగి చేర్చుట 101
27. జక్కయ్యనుండి ఒక పాఠం 104
28. నిశ్చలమైన రాజ్యము 107
29. సంఘములో స్త్రీల పాత్ర 112
30. దేవుడు మనలను మన కుటుంబములను ఆశీర్వదించును 117
31. లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి 121
32. ధన్యురాలైన వేశ్య 125
33. కొనియాడదగిన హన్నా 129
34. మగ్దలేనే మరియ 133
35. బేతనీయ సోదరీమణులు 136
36. తబిత 140

# యెహోవా మనకు గొప్ప కార్యములు చేసియున్నారు.

## (The Lord hath done Great things for us)

"యెహోవా మనకొరకు గొప్ప కార్యములు చేసియున్నారు. మనము సంతోషభరితులమైతిమి" (కీర్తన 126:3). ఈ లోకములో ప్రతి ఒక్కరు ఆనందదాయకరమైన జీవితమును జీవించవలెనని కాంక్షించుచుందురు. ఈ జీవిత యాత్రలో వివిధ రకములైన ఆనందములు గలవు. అయితే ఈ ఆనందము దేవుని నుండి కలిగినట్టయిన నిజముగ అది చాల ధన్యకరమైనది. మన దేవుడైన యెహోవా చాల గొప్ప దేవుడు. ఆయన చేసిన పనులన్నియు చాల ఘనమైనవి. ఆశ్చర్యకరమైనవి. ఈ భూమి పై నివసించు మానవుని యొక్క సంతోషకరమైన జీవితము కొరకు దేవుడు భూమిని, దాని యందలి సమస్తమును పరలోకమును సృష్టించి యున్నారు.

నరుల యొక్క చెడుతనము భూమిపై చాల అధికమైనందున యెహోవా భూమి మీద నుండి నరుని నశింపచేయ తలంచెను. అయితే నోవహు దేవుని దృష్టిలో దయపొందిన వాడాయెను. భూమిపైనుండి సమస్త జీవరాసులు పూర్తిగ నిర్మూలించబడినవి. దేవుడు నోవహు యెడల గొప్ప కార్యములను చేసెను. ఎట్లనగా వారు జలప్రళయము నుండి తప్పింపబడిరి. అబ్రాహామునకు నూరు సంవత్సరముల వయస్సున్నప్పుడు వారికి ఇస్సాకును గర్భఫలముగ యిచ్చుటద్వారా వారికి ఆనందము కలుగజేసెను. దేవుడు ఇస్సాకును ఆశీర్వదించెను. ఎట్లనగా ఇస్సాకు ఆదేశమందున్న వాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక అమనుష్యుడు గొప్ప వాడాయెను. అతడు మిక్కిలి గొప్పవాడగు వరకు క్రమక్రమముగ అభివృద్ధి పొందుచువచ్చెను. అతనికి గొఱ్ఱెల ఆస్థియు, గొడ్ల ఆస్థియు దాసులు, గొప్ప సమూహము కలిగినందున ఫిలిష్తీయులు అతని యందు అసూయపడిరి (ఆది. కా. 26:12-14).

దేవుడు యాకోబు జీవితములో చాల గొప్పకార్యములు చేసెను. దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానమును అతనియొక్క వారసుల ద్వారా నెరవేర్చబడెను. యోసేపు జీవితములో దేవుడు గొప్ప కార్యములు చేసెను. ఎట్లనగా అతడు ఐగుప్తు వర్తకులకు బానిసగా అమ్మబడినప్పటికిని, ఐగుప్తు దేశమునకు ఫరోరాజు తరువాత ఫరో అంతటి ఏలికగా దేవుడు యోసేపును దీవించెను (ఆది.కా. 50:20).

మోషే జీవితములో దేవుడు గొప్ప కార్యములు చేసెను. ఫరోయొక్క కౄరమైన

ఆజ్ఞను బట్టి బాలుడైన మోషే చంపబడవలసియుండెను. కాని గొప్ప దేవుడు మోషేను మరణమునుండి తప్పించి, ఫరోయింటిలోనే రాజకుమారునిగ తన తల్లిద్వారానే పెంచబడెను (నిర్గమ 2:1-9). దేవుని యొక్క బలమైన హస్తము ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాసత్వము నుండి విడిపించెను. ఐగుప్తీయులను పది తెగుళ్లద్వారా బాధించెను. ఇశ్రాయేలీయులకు వాటిని గూర్చిన బాధయేమియు లేకపోవుటచే దేవుడు మహోన్నతుడైన దేవునిగ నిరూపింపబడెను. ఎఱ్ఱసముద్ర మును పాయలుగ చేసి ఫరో సైన్యము నుండి ఇశ్రాయేలీయులను తప్పించెను (నిర్గమ 14:21-31). ఇశ్రాయేలీయులు ఐగుప్తీయులకు కలిగిన నాశనమును చూచి దేవునికి భయపడిరి (నిర్గమ 14:21-31). దేవుడు నలుబది సంవత్సర ములు మన్నాను ఆకాశమునుండి కురిపించి, బండల నుండి నీటిని రప్పించి, ఆకాశ పక్షులైన పూరేళ్ల ద్వారా వారికి మాంసము నిచ్చి అరణ్యములో పోషించెను.

ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వాస్థ్యముగ పొందుటకు ఎన్నో గొప్ప కార్యములను దేవుడు వారి కొరకు చేసెను. ఆ దేశముల రాజులందరిపైన వారికి విజయములనిచ్చెను. రూతు, నయోమి, హన్నా, దావీదు, యోబు, షద్రక్, మేషక్ అబెద్నెగో, దానియేలు అనువారి జీవితములో యెన్నెన్నో గొప్ప కార్యములు దేవుడు చేసెను.

కన్యయైన మరియ జీవితములో దేవుడు గొప్పకార్యము చేసెను. సర్వశక్తిమంతుడు నాకు గొప్ప కార్యములను చేసెను గనుక ఇది మొదలు కొని అన్ని తరముల వారు నన్ను ధన్యురాలని యందురు, ఆయన నామము పరిశు ద్ధము అని ఆమె చెప్పుచున్నది (లూకా 1:49). వృద్ధులైన జెకర్యా, ఎలీసబెతులకు వృద్ధాప్యములో వారికి బాప్తిస్మమిచ్చు యోహానును కుమారునిగా అనుగ్రహించుట ద్వారా వారి జీవితములో గొప్ప కార్యము దేవుడు చేసెను. యేసు ప్రభువు ఈ భూలోకములో యుండినపుడు కుష్ఠరోగుల యెడల, చెవిటివారి యెడల, గ్రుడ్డివారి యెడల, దయ్యములు పట్టి పీడింపబడుచున్నవారి యెడల, 12 సంవత్సరముల నుండి రక్తస్రావ రోగముచే బాధింపబడుచున్న స్త్రీ యెడల, నానా విధములైన రోగములచే బాధింపబడుచున్న వారి యెడల ఆయన అనేక గొప్పకార్యములను చేసి వారందిరిని స్వస్థపరచెను. ఆయన మృతుడైన విధవరాలి కుమారుని బ్రతికించెను. యాయీరు కుమార్తెను, లాజరును బ్రతికించెను. పాపములో మునిగి పోయిన ఈలోక ప్రజలందరిని వారి పాపములనుండి రక్షించుటకు గాను దేవుడు తన అద్వితీయ కుమారుని ఈలోకములోనికి బలిగా పంపించుట

ద్వారా ఆయన ఈలోక ప్రజలందరి యెడలను గొప్ప కార్యములు చేసెను. యేసుప్రభువును మరణము నుండి సజీవునిగా లేపుట ద్వారా మనకు నిత్యజీవమును గూర్చిన నిరీక్షణ అనుగ్రహించి ఆయన మన యెడల గొప్ప కార్యము జరిగించెను.

మన బలహీనత లెన్నియైనప్పటికిని మనలో ప్రతి ఒక్కొక్కరి జీవితములలో మన యెడల యెన్నెన్నో గొప్పకార్యములను దేవుడు చేయుచున్నారు. ఆయన మన యెడల జరిగించుచున్న మేళ్లన్నిటి విషయములోను మన మాయనకేమి చెల్లించగలము? సమరయుడైన కుష్టురోగివలె శుద్ధుడై ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుటకు తిరిగి వచ్చిన వాడెవడును లేడా? నీ విశ్వాసమే నిన్ను స్వస్థపరచెను అని యేసు అతనికి చెప్పెను.

యేసు ప్రభువు గెరాసేనుల దేశమునకు వచ్చినపుడు అపవిత్రాత్మపట్టిన యొకనిని ఆయన స్వస్థ పరచివానితో, “నీవు నీయింటివారి యొద్దకు వెళ్లి ప్రభువు నీయందు కనికరపడి, నీకు చేసిన కార్యములన్ని వారికి తెలియజెప్పుము” అనెను (మార్కు 5:20). వాడు వెళ్లి యేసు తనకు చేసినవన్నియు దెకపొలిలో ప్రకటింపనారంభింపగా అందరూ ఆశ్చర్యపడిరి.

“యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి, ఆయన నామమును ప్రకటన చేయుడి జనములలో ఆయన కార్యములను తెలియజేయుడి ఆయనను గూర్చి పాడుడి, ఆయనను కీర్తించుడి. ఆయన ఆశ్చర్యకార్యములన్నిటిని గూర్చి సంభాషణ చేయుడి” అని కీర్తనా కారుడు వ్రాసెను (కీర్తనలు 105:1-2).

మనము దేవుని సన్నిధికి యెట్లు వెళ్లవలెను? దహనబలి అర్పించుట ద్వారానా? లేక ఏడాది లేత దూడతోను లేక వేలాది పొట్టేళ్లతోను, పదివేల నదులంత విస్తార తైలముతోను మన జీవితములలో ఆయన చేసిన మేళ్లు కొరకై ఆయనకు అర్పించుదమా? దేవుని ద్వారా ఈయబడినవి గాక మరి యిక మనకు ఎవరైనా యేమేళ్లయిన అనుగ్రహించిరా? (1 కొరింథీ 4:7). ప్రతి మేలును ఈవియు మనకు జ్యోతిర్మయుడగు తండ్రియైన దేవుని నుండియే కలుగుచున్నది. కనుక మన కీర్తనాకారుని వలె దేవుని నుండి మనము పొందుచున్న ప్రతిమేలు విషయములోను, మనలను ప్రేమించి మనలను సంతోషవంతులుగ చేయుటకుగాను మన జీవితములలో చేయుచున్న ప్రతి మంచి విషయములలోను యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతలు చెల్లించుదము.

# నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగిన వాడెవడు?

(Who Shall Dwell in Thy Holy Hill?)

ఈ భూమిపై మానవ జీవితమనుగడ కొరకు ప్రాముఖ్యముగ ఆహారము, వస్త్రములు, నివాసములు ముఖ్య అవసరతలుగ యున్నవి. మానవులు గృహములు నిర్మించుకొందురు, రాజులు రాజ సౌధములలో నివసింతురు. పక్షులకు గూళ్లు, సింహములకు దట్టమైన అడవులలో బొరియలు, నక్కలకు కూడ బొరియలు నివాస యోగ్యములుగ యున్నవి. కీర్తనకారుడు యెహోవా నీగుడారములో అతిధిగా యుండదగిన వాడెవడు? నీ పరిశుద్ధపర్వతము మీద నివసింపదగిన వాడెవడు? అని యెహోవాను అడుగుచున్నాడు (కీర్తన 15:1). మోషే నాయకత్వము ద్వారా ఇశ్రయేలీయులు ఐగుప్తు దాసత్వము నుండి విడిపింపబడినపుడు దేవుని కొరకు ఒక పరిశుద్ధ స్థలమును నిర్మించుటకు వారితో ఒడంబడికను చేసికొని వారికాజ్ఞాపించెను (నిర్గమ 25:8). దేవుడు వారి మధ్య నివసించునట్లు మనః పూర్వకముగా కానుకలు యిచ్చుట ద్వారా పరిశుద్ధమందిరమును వారు నిర్మించిరి. (నిర్గమ 25:8; 35 అధ్యాయము). మందిరము యెహోవా తేజస్సుతో నిండెను (నిర్గమ 40:35). మందిరము యొక్క బయటి ఆవరణములో జంతు బలివిషయమై ఒక యిత్తడి బలిపీఠము ఉండవలెను. యాజకులు మందిరములో ప్రవేశించక పూర్వము వారు కాళ్లు కడుగుకొనుటకై ఇత్తడి గంగాళమొకటి యుండవలెను. 1. బయటి ఆవరణము పరిశుద్ధ స్థలములో ధూప వేదిక, ఏడు విభాగములు గల బంగారు ధూపార్తి, రొట్టెనుంచుటకై ఒక బల్ల యుండవలెను. 2. లోపలి ఆవరణము ఇది అతిపరిశుద్ధ స్థలము. ఈ రెండు స్థలములను ఒక అడ్డ తెరతో విభాగింపవలెను. కరుణాపీఠము ఈ అతి పరిశుద్ధ స్థలములో ఉంచబడును. సంవత్సరమునకు ఒకసారి ప్రధాన యాజకుడు మాత్రమే తన కొరకు, ప్రజల కొరకు పాప ప్రాయశ్చిత్తము కొరకు దానిలో ప్రవేశించును.

**పర్వతముల ప్రాముఖ్యత:**

బైబిలు గ్రంధము నందు కొండలు, పర్వతములు ప్రత్యేక స్థానము కలిగియున్నవి. నోవహు కాలములో కలిగిన ఆ గొప్ప జలప్రళయము సమయములో నిర్మింపబడిన ఓడ అరారాతు పర్వతములపై ఆగినది. అబ్రాహాము

కుమారుడైన ఇస్సాకును మోరియా పర్వతము పై బలిఈయుమని దేవుడు అబ్రాహాముతో చెప్పెను. అది "యెహోవా యీరే" అని అనబడుచున్నది. హోరేబు పర్వతముపైనున్న ఒక మండుచున్న పొద దగ్గర దేవుడు మోషేకు ప్రత్యక్షమయ్యెను (నిర్గమ 3:2). ఇశ్రాయేలీయులకు సీనాయిలో పది ఆజ్ఞలు ఈయబడెను. ఇశ్రాయేలీయులు యోర్దాను నది దాటి వాగ్దాన దేశములో ప్రవేశించిన వెంటనే యెహోషువ సీనాయి కొండపై దేవునికి బలిపీఠము కట్టెను. మోషే ఇశ్రాయేలీయులకు వ్రాసియిచ్చిన ధర్మశాస్త్ర గ్రంథమును ఒక ప్రతిని అక్కడ ఆ రాళ్ల మీద వ్రాయించెను (యెహోషువ 8:30-35).

ఏలియా కర్మెలు పర్వతముపై 450 మంది బయలు ప్రవక్తలను యెహోవా దేవుని విషయములో సవాలు చేసెను. వారిని చంపెను (1 రాజులు 8:20-40). హోరేబు కొండపైనున్న ఒక గుహలో ఏలియా ప్రవక్త దేవుని ద్వారా సమకూర్చబడిన ఆహారము, నిప్పులపై కాల్చబడిన అప్పము తిని, నీళ్ల బుడ్డిలో యున్న నీళ్లు త్రాగి బలము పొందెను (1 రాజులు 19:20). దేవుని పర్వతమైన హోరేబునకు నడిచి వెళ్లుటకు బలము పొందెను. కొండల తట్టు నాకన్ను లెత్తుచున్నాను. నాకు సహాయమెక్కడ నుండి వచ్చును అని దావీదు పాడుచున్నాడు (కీర్త 121:1).

మన ప్రభువును రక్షకుడునైనయేసు క్రీస్తు ఈ లోకములోనికి వచ్చుట ద్వారా క్రొత్త ఆజ్ఞను గలిలయ పర్వతము మీదనుండి అనుగ్రహించెను. మత్తయి 5,6,7 అధ్యాయములలో మనము కొండ మీద ప్రసంగములో వాటిని చదువుదుము. యేసు కొండ మీద రూపాంతరము పొందెను (మత్తయి 17:1,2, మార్కు 9:2; లూకా 9:28). యేసు కల్వరి కొండపై మన పాపముల విషయమై సిలువలో మరణించెను. యేసు దేహము రాతిలో తొలిపించిన క్రొత్త సమాధి యందుంచబడెను (మత్తయి 27:59; మార్కు 15:46; లూకా 23:53; యోహాను 19:40). యేసు ఒలీవల కొండ నుండి పరలోకమునకు ఆరోహణుడయ్యెను (అపొ.కా. 1:12). పర్వతములతో ఆవరింపబడిన పరిశుద్ధ నగరమైన యెరూషలేములో పెంతెకొస్తు దినమున సంఘము స్థాపింపబడెను.

## సంఘారంభము:

బైబిలు యందలి ప్రాముఖ్యమైన చరిత్ర సంఘటనలన్నియు ఉన్నత స్థలములైన కొండలు, పర్వతముల పైననే జరిగెను. క్రీస్తు పూర్వము 700

సం॥లో ప్రవక్తయైన యెషయా ఈ విధంగ ప్రవచించెను. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము, పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. యాకోబు దేవుని మందిరమునకు, యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి అని చెప్పుకొందురు. ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును (యెషయా 2:2-4). దేవుని మందిరము అనగా జీవము గల దేవుని సంఘములో యెట్లు ప్రవర్తింపవలెనో మనకు తెలియును. ఈ సంఘము యెరూషలేములో పెంతెకోస్తు దినమున ప్రారంభింపబడెను (1 తిమోతి 1:15). దేవుడు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైన ఆయనను సంఘమునకు శిరస్సుగా యుంచెను (ఎఫెసీ 1:22). క్రీస్తు సంఘమునకు శిరస్సయి యుండులాగున పురుషుడు భార్యకు శిరస్సయి యున్నాడు (ఎఫెసి 5:22). యేసు దేవుని కుమారుడని నమ్మి, పాపముల విషయమై మారు మనస్సు పొంది యేసును రక్షకునిగ ఒప్పుకొని బాప్తిస్మము తీసికొనవలెనని పేతురు పెంతుకోస్తు దినమున మొదటి సువార్తను ప్రకటించెను. ఆ మొదటి సువార్త ప్రసంగము వినిన యూదులలో పదహారు తెగలలోని వారు యేసును రక్షకునిగ విశ్వసించి వారి పాపక్షమాపణ నిమిత్తము ఆదినమున మూడువేల మంది యేసులో బాప్తిస్మము పొందిరి. వారు దేవుని మందిరములో ప్రవేశించిరి. తరువాత అన్యజనాంగములోనుండి యేసులోనికి బాప్తిస్మము పొందినవారు దేవుని మందిరములోనికి ప్రవేశించిరి. అన్యజనాంగములో నుండి కొర్నేలి, అతని కుటుంబ సభ్యులు మొదట దేవుని బిడ్డలుగ చేరిరి (అ.కా. 10 అధ్యా). అపొస్తలుడైన పౌలు అన్యజనులకు సువార్త బోధించి దేవుని మందిరమునకు వారిని చేర్చుటకు యేర్పరచబడెను. దేవుని పరిశుద్ధ పర్వతమునకు లేక దేవుని మందిరమునకు యూదులు, అన్యజనాంగములు తరలి వచ్చుచుండిరి.

## గొప్ప ఆజ్ఞ:

యేసు సమరయ, యూదయ, గలిలయ ప్రాంతముల యందంతటను దేవుని వాక్యము బోధించుచువారికి నేర్పుచుండెను. ఆయన పరలోకమునకు ఆరోహణుడై వెళ్లక పూర్వము ఆయన శిష్యుల కీ విధముగ ఆజ్ఞాపించెను. మీరు సర్వలోకమునకు వెళ్లిసువార్త ప్రకటించి సమస్త జనులను శిష్యులుగా చేయుడి

తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు. పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా యున్నానని వారితో చెప్పెను (మత్తయి 28:19-20). క్రొత్త నిబంధన ద్వారా వాక్యము మనకు బోధింపబడుచున్నది.

## యెహోవా గుడారములో....

యెహోవా గుడారములో అతిథిగా యుండదగిన వాడెవడు? ఆయన పరిశుద్ధ పర్వతముపై నివసింపదగిన వాడెవడు? అని కీర్తనాకారుడు యెహోవా దేవుని అడుగుచున్నాడు (కీర్త 15:1). పరిశుద్ధ సంఘములోనికి ప్రవేశించుట లేక నివసించుట కొరకు వినుట, విశ్వాసము, మారుమనస్సు ద్వారాను, యేసు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మమము పొందుట ద్వారాను మనము ప్రవేశించగలము (అ.కా. 2:47). ఈ ప్రశ్నకు జవాబులు ఈ క్రింది ఈయబడిన కొన్ని వాక్యభాగముల ద్వారా గ్రహించ గలము:

1) నీతిగ జీవించుట : యోబువలె నీతిమంతునిగ పరిశుద్ధునిగా జీవించి పాపమును ద్వేషించు వానిగ, దేవుని యందు భయభక్తులు గలవానిగ యుండవలెను. పాపమును ద్వేషించిపవిత్రునిగ యుండవలెను. దేవుడు పాపమును అసహ్యించు కొనును. యోబు వలె పాపమును ద్వేషించు వారముగ యుండవలెను (2) నీతి గలిగి జీవించాలి. యెహోవా మార్గములు చక్కనివి. నీతి మంతులు దాని ననుసరించి నడుచుకొందురు. తిరుగు బాటు చేయువారి దారికి అది అడ్డము గనుక వారు తొట్రిల్లుదురు (హోషేయ 4:9). 3) యదార్ధ హృదయము కలిగి యుండి ఎల్లప్పుడును యదార్ధము పలుకవలెను అబద్ధికులుగ యుండరాదు. తమ పొరుగు వారితో యెల్లప్పుడు యదార్ధమే పలుక వలెను. మనము ఒకరికొకరము అవయవములమై యున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడు తన పొరుగు వానితో సత్యమే మాట్లాడవలెను (ఎఫెసి 4:25). 4) నాలుక మన అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయును. ప్రకృతి చక్రమునకు చిచ్చు పెట్టుచు అది నరకము చేత చిచ్చు పెట్ట బడును. నాలుకను అదుపులో పెట్టుటను గూర్చి యాకోబు వివరించెను (యాకోబు 3:3-12; మత్తయి 12:23-37). 5) గౌరవము పొందదగిన వ్యక్తి దేవునిని ఎరుగని వ్యక్తులతో సాంగత్యము

చేయడు. పాపుల మార్గమున నిలువక అపహాసకులు కూర్చుండుచోటను కూర్చుండడు (కీర్త 1:1). అతడు దేవుని బిడ్డలైన క్రైస్తవులతోనే సహవాసము చేయును. పరిశుద్ధులతో సమాజముగ కూడుట మానడు (హెబ్రీ 10:25). 6) దేవునికి భయపడువారిని అతడు గౌరవించును దైవసేవకులను గౌరవించును (I తిమోతి 5:12,13; రోమా 12:10;1 పేతురు 2:17). 7) అతడు ప్రమాణముచేసి మాటతప్పడు.

హన్నా తన కుమారుడైన సమూయేలును దేవుని సేవ కొరకు సమర్పించుకొందునని దేవునితో ఒప్పందము చేసెను. ఆమె దేవునితో చేసిన వాగ్దానమును నిలువబెట్టుకొనెను (I సమూయేలు 1:11; న్యాయాధిపతులు 11:20; 2 కొరింథి 1:17-18). 8) అతడు ధనద్రవ్యమును బుద్ధిహీనముగ ఖర్చు చేయడు. జ్ఞానయుక్తముగ ఖర్చు చేయును. దేవుని సేవకొరకు ఇచ్చును. అవసరతలలో యున్న వారికి సహాయము చేయును. 9) అమాయకులైన వారి యొద్ద నుండి బహుమానములు స్వీకరించడు. అమాయకులను నిందించడు. దుష్టుడైన అహాబురాజు యిద్దరు సాక్షుల అబద్దసాక్షములను బట్టి నాబోతును చంపి అతని ద్రాక్షతోటను స్వాధీనము చేసికొనెను (1రాజు 21:1,16). యేసు ప్రభువు ప్రధాన యాజకుని యెదుట విచారింపబడుచుండగ అనేకులు ఆయన మీద అబద్ధసాక్ష్యములు చెప్పిరి కాని వారి సాక్ష్యములు ఒకదానికొకటి సరిపడలేదు (మార్కు 14:56).

దావీదు వలె మనము మన దేవుని వాక్యము విని, దానికి లోబడి జీవిత కాలమంతయు యెహోవా మందిరములో నివసింపగోరవలెను (కీర్త, 23:6). హృదయపూర్వకముగ నమ్మి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెను. అట్టివారిని దేవుడు ఆయన కుటుంబ సభ్యులుగ, లేక సంఘసభ్యులుగ అంగీకరించును. దేవుడు యిచ్చిన పరిపూర్ణమైన సలహాలను మన జీవిత కాలమంతయు పాటించుచు విశ్వాసముతో జీవించిన యెడల దేవుడు మనకు నిత్యజీవమును అనుగ్రహించును.

# నీవేమి ధరించుకొన్నావు?

## (What have you put on?)

ప్రజలు తమ అంతస్థుకు తగినట్లుగా దుస్తులు ధరిస్తారు. మన వస్త్రధారణను బట్టి మన అంతస్థు తెలియనగును. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తులు ధరించే దుస్తులు వారు చేసే పనిని తెలియజేస్తాయి. ఉదా: పోలీసులు, నర్సులు, స్కూలు పిల్లలు, మరికొందరు ధరించే దుస్తులు వారి వృత్తిని తెలియజేస్తాయి. సంపన్నులు ఉదారంగు వస్త్రములను ధరించుట కద్దు (లూకా 16:19).

దేవుడు మొదట స్త్రీ పురుషులను చేసినప్పుడు వారు దిగంబరులు. దేవుడు నిషేధించిన ఫలాన్ని తినినప్పుడు "వారిద్దరి కన్నులు తెరవబడెను; వారు తాము దిగంబరులమని తెలిసికొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములు చేసికొనిరి"(ఆది.కా.3.7). దేవుడు స్త్రీ పురుషులను సర్పమును శపించెను. మరియు "దేవుడైన యెహోవా ఆదామునకును అతని భార్యకును చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగెను" (ఆది.కా.3:21).

మన మొదటి తల్లిదండ్రులకు దేవుడే వస్త్రములను చేయించెను. యాకోబు తన భార్యయగు రాహేలు యెడల ప్రత్యేక ప్రేమను కనబరుస్తు యోసేపుకు రంగురంగుల అంగీని చేయించి యిచ్చెను. దేవుడు అహరోనును ప్రధాన యాజకునిగా నియమించినప్పుడు అతడు ధరించవలసిన ప్రత్యేక దుస్తులను గూర్చిన హెచ్చరికలను నిర్గమ 28:2-14లో యిచ్చెను. సహోదరులు ఐక్యత కలిగి నివసించునప్పుడు అది తలమీదపోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళ తైలము వలె యుండునని దావీదు చెప్పెను (దా. కీర్తన 133:2). "బాలుడైన సమూయేలు నారతో నేయబడిన ఏఫోదు ధరించుకొని యెహోవాకు పరిచర్యచేయుచుండెను". వాని తల్లి వానికి చిన్న అంగీ ఒకటి కుట్టి యేటేట బలి అర్పించుటకు తన పెనిమిటితో కూడ వచ్చినప్పుడు దాని తెచ్చి వాని కిచ్చుచువచ్చెను" (1 సమూ 2:18-19). ఏలియా తన దుప్పటిని ఎలీషా మీద వేసి అతని ప్రవక్తగా నియమించెను. ఏలియా ఆకాశమున కారోహణమయినప్పుడు అతని దుప్పటి క్రింద పడగా ఎలీషా దానిని తీసికొనగా అతడు ప్రవక్తగా ఏలియా కంటే రెట్టింపు శక్తిని బొందెను (2 రాజులు

2:8–13). రాజులు, రాజవస్త్రములు ధరించేవారు. దుఃఖసమయాల్లో పూర్వము ప్రజలు తమ వస్త్రములను చింపుకొనేవారు.

ఆకాను శపితమైన హాయి వారి సొమ్ములో ఒక మంచి షీనారు వస్త్రమును రెండు వందల తులముల వెండిని, ఏబది తులముల బంగారు కడ్డీని ఆశించి దొంగిలించెను. దురాశ వలన అతడు, అతని కుటుంబీకులు చంపబడిరి (యెహోషువ 7:1–26). ఎలీషా యొక్క సేవకుడగు గెహజీ నయమాను దగ్గర రెండు జతల బట్టలను వెండిని ఆశించినందున కుష్ఠరోగముతో శపించబడెను (2 రాజులు 5:22–27).

క్రొత్త నిబంధనలో యేసు ప్రభువు జన్మించగానే ఆయన పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్టబడెను (లూకా 2:7). బాప్తిస్మమిచ్చు యోహాను ఒంటె రోమముల వస్త్రమును మొల చుట్టుతోలు దట్టియు ధరించుకొనేవాడు (మత్త 3:4). గుడ్డివాడైన బర్తిమయిని యేసు పిలిచినప్పుడు వాడు బట్టను పారవేసి దిగ్గున లేచి యేసునొద్దకు వచ్చెను (మార్కు 16:5; లూకా 24:4; యోహాను 20:12). యేసు సిలువ వేయబడగా సైనికులు ఆయన వస్త్రము కొరకు చీటీ వేసుకొనిరి. యేసు పరమున కారోహణుడవుచుండగా తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు, ఆయన ఏ రీతిగా వెళ్లెనో అదే రీతిగా తిరిగి వచ్చునని చెప్పిరి (అపొ.కా. 1:10–11). ప్రకటన 1:13లో పాదముల మట్టుకు దిగుచున్న వస్త్రము ధరించుకొనిన యేసు యోహానుకు దర్శనమిచ్చెను.

ఈ సందర్భములన్నిటిలోను ఆయా ప్రజలు ధరించుకొనిన వస్త్రములను ప్రాముఖ్యంగా మనం గమనించగలము. “యేమితిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చి యైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?” యని యేసు చెప్పెను (మత్తయి 6:25). లూకా 16లో యున్న ధనవంతుడు ఊదా రంగు వస్త్రముల కొరకు చింతించాడు గాని ఆత్మీయ వస్త్రములను గూర్చి ఎన్నడు ఆలోచించలేదు.

**క్రీస్తును ధరించు కొన్నవారు క్రైస్తవులు.** “క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు” (గలతీ 3:27). పౌలు ఇంకా ఇట్లు చెప్పాడు: “నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి యున్నాను; ఇకను

జీవించు వాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శశీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నాకొరకు తన్నుతాను అప్పగించు కొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

యెరూషలేము దేవాలయము దగ్గర పేతురు యోహానులు ఒక కుంటి వానిని స్వస్థపరచినప్పుడు గొప్ప గందరగోళము జరిగెను. పేతురు యోహానులు అక్కడ గుమిగూడిన జన సమూహమునకు బహు ధైర్యముగా వాక్యము బోధించిరి. "వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడి వారు యేసుతో కూడ ఉండిన వారని గుర్తెరిగిరి" (అపొ.కా. 4:13). పేతురు యోహానులు తమ జీవితము ద్వారా నిజంగా దేవుని మహిమ పరచిరి. "మనము అంధకార క్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించు కొందము... పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము. మెట్టుకు ప్రభువైన యేసు క్రీస్తును ధరించుకొనిన వారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీర విషయమై ఆలోచన చేసికొనకుడి" (రోమా 13:12–14) యని పౌలు హెచ్చరించాడు.

**క్రీస్తును ధరించుకొన్నప్పుడు నూతన సృష్టి అగుదుము.** "మీ చిత్త వృత్తియందు నూతన పరచబడిన వారై నీతియు యదార్ధమైన భక్తియు గలవారై దేవుని పోలికెగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:23–24). మనము దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనునపుడు అపవాది యొక్క తంత్రములను ఎదిరించుటకు శక్తిగలవారమగుదుము (ఎఫెసీ 6:11–17). ఏలయనగా మన ప్రాచీన స్వభావము దాని క్రియలతో కూడా విసర్జింపబడగా జ్ఞానము కలుగు నిమిత్తము మనలను సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొందుము (కొలస్స 3:10). క్రీస్తును ధరించుకొన్నవారు "జాలిగల మనస్సును, దయాళుత్వమును వినయమును సాత్వికమును దీర్ఘశాంతమును ధరించుకొందురు" (కొలస్స 3:12). వీటన్నిటికి పైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొందుము (కొలస్స 3:14).

క్రైస్తవ స్త్రీలు అణుకవయు స్వస్థబుద్ధియు గలవారై యుండి సత్ క్రియల చేత తమ్మును తాము అలంకరించుకొనవలెనని పౌలు ఉపదేశించెను (1తిమో 3:9–10;1 పేతురు 4:8). క్రైస్తవులు దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని

తమ్మును తాము అలంకరించుకొనవలెనని పేతురు హెచ్చరించాడు (1 పేతురు 5:5). క్రీస్తును దరించుకొన్నవారు వినయము విధేయత, దీనమనస్సులను ధరించుకొంటారు. ఈ లక్షణాల ద్వారా వారు దేవుని మహిమపరుస్తారు.

పెండ్లి విందునకు పిలువబడినవాడు తగిన వస్త్రము ధరించుకొని యుండనందున యజమానుడు వానిని బయట చీకటిలోనికి పడవేయించిన ఉపమానమును యేసు బోధించారు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 22:11–14). లవోదికయలో యున్న సంఘమునకు ప్రభువు ఇట్లు చెప్పారు. "నీ దిసమొల సిగ్గుకనబడకుండునట్లు ధరించుకొనుటకు తెల్లని వస్త్రములను నీకు దృష్టికలుగునట్లు నీ కన్నులకు కాటుకను నా యొద్దకొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను" (ప్రక 3:18).

"జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములో నుండి అతని పేరెంత మాత్రమును తుడుపుపెట్టక, నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందునని" ఈ పుడమి పై ఆయన నామమును ధరించిన వానికి ప్రభువు వాగ్దానము చేసెను. క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొనుదినము కొరకు మనము ఆశతో ఎదురు చూచుచుందుము గాక! (1 కొరింథీ 15:53).

# మన దేవుడు దహించు అగ్ని

(Our Lord is a Consuming Fire)

అగ్ని మంచి పరిచారకుడుగాని మంచి నాయకుడు కాదు. ఈ భూమిపై గాలి, నీరు, అగ్ని అనునవి మిక్కిలి అవసరమైన విషయములు. కాని అగ్ని అస్తులను, ప్రాణములను సహా నాశనము చేయును. ఈ అగ్ని లేక నిప్పు మనకు వెలుతురును వేడిమిని యిచ్చును. మన ప్రాచీన మానవుడు రెండు రాళ్లను ఒకదానితో మరియొకటి రాపిడిచేయుట ద్వారా నిప్పును తయారు చేసెడివాడు. కాని దేవుడు సమస్తమునకు సృష్టికర్తయై యున్నారు.

సూర్యుడు పెద్ద అగ్నిగోళమని మనకు తెలియును. వివిధ రకములైన వాయువులు నిర్విరామముగ అచ్చట మండుటచే దాని నుండి వెలుతురు, వేడిమి వచ్చుచున్నవి. భూమిపై అగ్ని పర్వతములు బ్రద్దలైనప్పుడు అగ్ని వెదజల్ల బడును. అట్లు జరిగిన యెడల దాని ఫలితములు ఎట్లుండునో మనకు తెలియును. భూగర్భములో పెట్రోలు, వివిధ రకములైన వాయువులు, బొగ్గు మున్నగునవెన్నియో గలవు. చంద్రమండల చోదన విమానము భూమికి తిరిగి వచ్చు సందర్భములో కొన్ని పర్యాయములు అది కూడ కాలిపోవును. దీనిని బట్టి వాతావరణములో అగ్నియున్నదని ఎరుగుదుము.

దేవుడైన యెహోవా అదాము, హవ్వలను ఏదేను తోటనుండి వెడలిగొట్టి జీవవృక్షమును కాయుటకు యిటు, అటు, తిరుగుచున్న ఖడ్గజ్వాలలను నిలువ బెట్టెను (ఆది. కా. 3:24). హేబెలు, నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు యాజకులైనట్టివారు బలిపీఠముపై వివిధ రకములైన బలుల నర్పించుటకు వారు అగ్నిని ఉపయోగించెడి వారు. హోరేబు పర్వతముపై ఒక మండుచున్న పొదలో దేవుడు మోషేకు ప్రత్యక్షమైనను పొద కాలిపోలేదు (నిర్గమ 3:1-4).

అరణ్యములో ఇశ్రాయేలీయులను పగలు మేఘస్తంభములోను, రాత్రి అగ్ని స్తంభములోను దేవుడు వారిని కాపాడుచువచ్చెను. ఇశ్రాయేలీయులకు తన నిబంధన నిచ్చుటకుగాను దేవుడు సీనాయి పర్వతము మీదికి అగ్నిలో దిగివచ్చెను (నిర్గమ 19:18; 24:17; యెషయా 33:14-16). బలిపీఠము మీద అగ్ని

నిత్యము మండుచుండ వలెను గాని ఆరిపోకూడదని దేవుడు ఆజ్ఞయిచ్చెను (లేవీ. కా. 16:13). అగ్నిరథమును అగ్ని గుఱ్ఱములును లేపబడి ప్రవక్తయైన ఏలియాను సజీవునిగా పరమందున్న తండ్రి యొద్దకు తీసుకొనిపోయెను (2 రాజులు 2:2-11). ఎంతో భయముతో యుండిన ప్రవక్తయైన ఏలిషా కండ్లను దేవుడు తెరవగా తనచుట్టు ఆవరించియున్న అగ్నిరథములను, అగ్ని గుఱ్రములను అతడు చూచెను (2 రాజులు 6:8-17). బలిపీఠము నుండి తీసిన నిప్పు యెషయా యొక్క పెదవులకు తగిలించుట ద్వారా పాపప్రాయశ్చిత్తము జరిగెను (యెషయా 6:6). పెంతెకోస్తు దినమున అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అపొస్తలులు అందరు పరిశుద్ధాత్మతో నింపబడిరి (అది.కా. 2:1-4), హెబ్రీ గ్రంథకర్త క్రైస్తవులను ఈ విధంగా హెచ్చరించుచున్నాడు: మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప కలిగి యుందము (హెబ్రీ 10:26). ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు (హెబ్రీ 12:29).

క్రొత్త నిబంధన గ్రంథములో దేవునికి అవిధేయులైన వారిపై ఆయన కోపాగ్ని వచ్చినట్లు లేదు కాని పాత నిబంధన గ్రంథములో అట్టివి మనకు గోచరమగును. సొదొమ గొమొర్రాల పాపము దేవుని దృష్టిలో ఘోరమైనపుడు యెహోవా యొద్దనుండి గంధకమును, అగ్నిని ఆకాశము నుండి కురిపించి వారిని నాశనము చేసెను (ఆది. కా. 19:24). అహరోను కుమారులైన నాదాబు, అబీహులు దేవుని సన్నిధిలో వేరొక అగ్నిని అర్పించినప్పుడు ఆకాశము నుండి అగ్ని దిగి వచ్చి వారిని దహించివేసెను (లేవి. కా. 10:1 -2). మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు. అరణ్యములో ఇశ్రాయేలీయులు ఆయనను గూర్చి సణుగుచుండినపుడు యెహోవా దానిని విని ఆయన కోపము రగులు కొని అపాళెములో ఒకకొనను దహించసాగెను. మోషే యెహోవాకు మొర పెట్టినప్పుడు ఆ అగ్ని ఆగెను (సంఖ్య. కా. 11:1). మన దేవుడు దహించు అగ్ని. కోరహు సంతతి వారైన రెండు వందలయాబది మంది మోషే అహరోనులకు విరోధముగ లేచి మేము అందరము పరిశుద్ధులము, మాపై మీరేల మిమ్మును మీరు హెచ్చించు కొనుచున్నారని మాట్లాడినపుడు మోషే ఆ మాటలు విని సాగిలపడెను. మరియు యెహోవా యొద్ద నుండి అగ్నిబయలుదేరి ఆ రెండు వందల యాభైమందిని కాల్చివేసెను (సంఖ్యా 16:3-18).

ఆయన కట్టడలను వ్యతిరేకించు వారి విషయములో దేవుడు దహించు

అగ్నివలె యుండును. అహాబు రాజు ఇశ్రాయేలీయులను పరిపాలించు కాలంలో వారు బయలు దేవతను పూజించుటకు ప్రారంభించిరి. దేవుని బిడ్డయైన ఏలిషా ప్రవక్త బయలు ప్రవక్తలందరిని కర్మెలు పర్వతము దగ్గర ప్రోగుచేసి బలిపీఠము మీద వధింపబడియున్న ఎద్దును దహింపచేయునట్లు మీ దేవతకు ప్రార్ధన చేయుడని చెప్పగా వారి దేవతలు దానిని దహింపలేకపోయిరి. కాని మన దేవుడు నిజమైన దేవుడు గనుక యెహోవా అగ్నిదిగి దహనబలి పశువులను కట్టెలను, రాళ్లను బుగ్గిని దహించి కందక మందున్న నీళ్లను ఆరిపోచేసెను (1 రాజులు 18:38). మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు ఆయన ఉగ్రతను సహింపగలిగినవా డెవడు? ఆయన కోపాగ్ని యెదుట నిలువగలిగిన వాడెవడు? ఆయన కోపము అగ్నివలె పారును. ఆయన కొండలను కొట్టగా అవి బ్రద్దలగును (నహూము 1:6).

మన దేవుడు దహించు అగ్నివలె యున్నాడు. నా మాట అగ్నివంటిది కాదా? బండలను బ్రద్దలు చేయు సుత్తె వంటిది కాదా? (యిర్మీయా 23:29; 5:14). మన విశ్వాసము మనము చేయు పని ఈ అగ్ని వలన పరీక్షింపబడును (1 పేతురు 1:7; 1 కొరింధీ 3:13).

బాప్తిస్మమిచ్చు యోహాను ఈ విధంగ చెప్పుచున్నాడు. ఆయన చేట ఆయనచేతిలో యున్నది. ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రముచేసి, గోధుమలను కోట్టులోపోసి పొట్టును కాల్చివేయునని చెప్పెను (మత్తయి 3:12). ఎవరి జీవితమైతే నీతి వంతమైనది కాదో వాడు మండుచున్న అగ్నిగుండములోనికి త్రోయబడును (మత్తయి 13:42; యోహాను 15:4; ప్రకటన 20:15).

మన ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు తిరిగి రానై యున్నారు. ఆయన పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని ఎరుగనివారికి, సువార్తకులోబడని వారికిని ప్రతిదండన చేయును (2 థెస్స 1:8). ఇప్పుడున్న ఆకాశము, భూమియు భక్తిహీనుల తీర్పునునాశనము జరుగు దినమువరకు అగ్నికొరకు నిలువచేయ బడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి (2 పేతురు 3:7-8). మన దేవుడు దహించే అగ్నియై యుండి ఆయన బిడ్డలను ఆ అగ్నిగుండము నుండి రక్షించగల సమర్థుడు (ప్రకట 20:15).

# యెహోవాకు అసహ్యములైనవి

## (Things The Lord Hates)

"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు, ఏడును ఆయనకు హేయములు. అవేవనగా అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" అని సొలొమోను చెప్పాడు (సామె 6:16-19).

### 1. అహంకార దృష్టి :

ఈ జాబితాలో అహంకారదృష్టి మొదట యుంచబడింది. దేవుని చట్టముపై తిరుగుబాటుకు, సమస్త అవిధేయతకు అది మూలకారణము. వినయానికి అది వ్యతిరేకమైనది. యేసుప్రభువు మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా తన్నుతాను తగ్గించుకొనెనని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 2:5-8). పౌలు గొప్ప అపొస్తలుడైనను, "నేను అపొస్తలు లందరిలో తక్కువ వాడనని" తనను గూర్చి చెప్పుకొన్నాడు (1 కొరింథి 15:9). యూదా రాజులలో పదియవవాడు ఉజ్జీయా. ప్రభువు దృష్టికి అతడు యోగ్యముగా పనిచేసినంత కాలము, ప్రభువతనికి తోడైయుండి, అతనికి సహాయము చేసారు, మరియు అతడు అభివృద్ధి చెందాడు. అయితే ఉజ్జీయ బలవంతుడై బహుగా అభివృద్ధి జెందినప్పుడు అతడు గర్విష్ఠుడై దేవుని బంగారు బలిపీఠము యొద్ద ప్రధాన యాజకుడు మాత్రమే చేయదగిన ధూపార్పణ చేయనెంచాడు. అక్కడే దేవుడతని మొత్తగా అతడు కుష్ఠరోగము గలవాడయ్యాడు. అతడు యూదా రాజ్యమును ఇక పాలించలేకపోయాడు. దేవుని ప్రధాన దూతయైన లూసిఫరు గర్విష్ఠుడై తన స్థానాన్ని కోల్పోయి భూమిపై పడద్రోయబడ్డాడు. నీవు నైతిక జీవితంలో ఎంతో సాధించినను, అహంకార దృష్టి నిన్ను ఇట్టే పడద్రోయగలదు.

### 2. కల్లలాడు నాలుక :

దేవుడు యదార్ధవంతుడు; ఆయనే సత్యము. గనుక అబద్ధములాడు

నాలుకను ఆయన అసహ్యించుకొంటారు. అబద్ధములాడు వారందరు అపవాది సంబంధులు. కొందరు యూదులతో యేసుప్రభువు ఇట్లన్నారు : "మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు, మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాదు; వానియందు సత్యమేలేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు" (యోహాను 8:44).

నాలుకను దుర్వినియోగ పరచుటవలన కలిగే ప్రమాదమును గూర్చి యాకోబు తన పత్రికలో హెచ్చరించాడు (యాకోబు 3:3-15). మన మాటలను బట్టియే అంత్యదినమందు మనకు తీర్పు జరుగునని యేసుప్రభువు చెప్పారు. కొందరు తమ క్రియలద్వారా ప్రజలను మోసగిస్తారు. అట్టివారు నిశ్చయంగా తమ ఫలమును పొందుదురు. అననీయ సప్పీరాలను దంపతులు ప్రభువుకు వారు సమర్పించుకొనిన దానిలో కొంత దాచుకొని అపొస్తలుల యొద్ద అబద్ధమాడారు. "అప్పుడు పేతురు - అననీయా నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను నీ హృదయమును ఎందుకు ప్రేరేపించెను?.. నీవు మనుష్యులతో కాదు, దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను." అబద్ధమాడినందువలన అననీయ సప్పీరాలు తమ ప్రాణమును కోల్పోయారు (అపొ.కా. 5:1-11). అబద్ధములాడువారిని యెహోవా అసహ్యించుకొంటారు.

## 3. నిరపరాధులను చంపు చేతులు :

పది యాజ్ఞలలో ఆరవది "నరహత్య చేయరాదు" అనునది. మొదటి తల్లిదండ్రుల మొదటి కుమారుడే నరహంతకుడయ్యాడు. నిర్దోషియైన హేబెలు రక్తము నేలలోనుండి దేవునికి మొఱ్ఱపెట్టినది. ధర్మశాస్త్ర ప్రకారము నరహత్య చేయువాడు మరణ శిక్షకు పాత్రుడు. అయితే యేసు ప్రభువు ఇట్లు బోధించారు: నరహత్య చేయవద్దు; "నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా- తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పు వాడు నరకాగ్నికి లోనగును" (మత్త 5:21,22). "తన సహోదరుని ద్వేషించువాడు

నరహంతకుడు" అని యోహాను చెప్పాడు (1 యోహా 3:15). గనుక తన సహోదరుని లేక పొరుగు వానిని ప్రేమింపని వాడు నరహంతకునితో సమానుడు.

## 4. దుర్యోచనలు యోచించు హృదయము:

ప్రతి జీవరాశికి మాంసపు గుండె ఒకటి యున్నది గాని దుర్యోచనలు యోచించే హృదయము మానవునికి మాత్రమే యున్నది. దేవుడు తప్ప మానవుని హృదయాంతర్యమును ఎరిగినవాడెవడు లేడు. నరుల "హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని" యెహోవా ఎరుగునని వ్రాయబడి యున్నది (ఆది 6:5). అందరు పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారని పౌలు చెప్పాడు (రోమా 3:23). "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చునని" యేసుప్రభువు బోధించారు (మత్త 15:19). మన హృదయములు దేవుని వాక్యముతో నింపబడకపోతే దుష్టత్వముతో నింపబడతాయి. ఒక ఖాళీ గ్లాసు నిండా గాలి మాత్రమే యుంటాది. అయితే దానిని పాలతో నింపినపుడది పాలతో నింపబడిన పాత్ర అవుతాది, దానిలో గాలికి తావుండదు. అట్లే మన హృదయములు దేవుని వాక్యముతో నింపబడినపుడు అందులో దుష్టత్వానికి తావుండదు. అందుకే "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" అని దావీదు చెప్పాడు (కీర్త 119:11).

## 5. కీడు చేయుటకు పరుగులెత్తు పాదములు:

సాధారణంగా మెదడు యొక్క ఆజ్ఞలను బట్టి పాదములు నడుస్తాయి. అయితే సోలొమోను ఇక్కడ కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములను గూర్చి చెబుతున్నాడు. అవి మానవ హృదయాలోచనను బట్టి పరుగెడతాయి. అట్టి వాటిని దేవుడు అసహ్యించుకొంటారు. మరల "దుష్కార్యము జరిగించుటకై సమూహమును వెంబడింపవద్దు" అని దేవుని వాక్యం చెబుతున్నది (నిర్గ 23:2).

మానవ జీవితం ఒక యాత్ర వంటిది. దీనిలో అతడు ప్రయాణించుటకు రెండే మార్గాలున్నాయి. విశాల మార్గము నాశనానికి, సంకుచిత మార్గము జీవనానికి నడిపిస్తాయి. దేవుని వాక్య ప్రకారము నడుచుకొనేవాడు ఇరకు

మార్గమున నడుస్తాడు. "యౌవనస్థులు దేనిచేత తమ నడతను శుద్ధిపరచు కొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?" (దా. కీర్త 119:9).

## 6. అబద్ధ సాక్షి :

అబద్ధ సాక్ష్యము పలుకకూడదు అనునది పది యాజ్ఞలలో తొమ్మిదవది. అబద్ధ సాక్ష్యము పలికే వానిని, అబద్ధములాడే వానిని దేవుడు అసహ్యించు కొంటారు. కల్లలాడు నాలుక వలన కలిగే విపత్తులను గూర్చి ఇదివరకే మనము చూచాము. అపవాది హవ్వయొద్ద అబద్ధ సాక్ష్యము పలికాడు. దేవుడు నిషేధించిన పండును తినిన తరువాత మీరు చావనే చావరని అతడు అబద్ధము పలికాడు. తద్వారా పాపము మరణము ఈ లోకంలో ప్రవేశించాయి. యేసు ప్రభువుపై నిందలు మోపడానికి కొందరు అబద్ధ సాక్షులను వారు నిలబెట్టారు. ఆయన పునరుత్థానుడైన తరువాత కూడ రోమా సైనికులు క్రీస్తు శిష్యులు వచ్చి ఆయన శరీరాన్ని ఎత్తుకొని పోయిరని అబద్ధ సాక్ష్యము పలికారు.

అబద్ధసాక్ష్యము లాడువారు తమ్మును తామే మలినపరుచుకొంటారు. "సర్ప సంతానమా, మీరు చెడ్డవారై యుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు? హృదయము నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా" యని యేసు ప్రభువు చెప్పారు (మత్త 12:34). ఒకడు తన నాలుకను వినియోగించే విధానాన్ని బట్టి అతని ఆత్మీయ పరిస్థితి గోచరమవుతాది. "కూట సాక్షి శిక్ష నొందకపోడు. అబద్ధములాడువాడు తప్పించుకొనడని" సొలోమోను చెప్పాడు (సామె 19:5). అపవాది అబద్ధమునకు జనకుడు గాని సత్యవాక్యము ననుసరించువాడు అబద్ధ సాక్షి కాజాలడు.

## 7. అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడు:

తన బిడ్డల మధ్య దేవుడు ఐక్యత కోరుచున్నారని యిది తెలియజేయుచున్నది. అందువలన సహోదరుల మధ్య జగడములు, విభేదములు పుట్టించు వానిని ఆయన అసహ్యించుకొంటారు. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! అది తలమీద పోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండ మీదికి వచ్చు హెర్మోను మంచువలె నుండును"

(కీర్త 133). పౌలు రోమాలోని క్రైస్తవుల కిట్లు వ్రాసాడు: "సహోదరులారా మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు" (రోమా 16:17).

# దేవునికి ప్రీతికరమైన సేవ చేయుడి

## (హెబ్రీ 12:18-29)

## (Serve God Acceptably)

యూదులుగా జన్మించిన క్రైస్తవులను ప్రోత్సహించుటకు హెబ్రీ గ్రంథం వ్రాయబడింది. మోషేకంటే దేవదూతలకంటే యేసు ప్రభువు ఉన్నతుడు గనుక మనం ఇపుడు పాతనిబంధనకు బద్ధులం కాము. "స్పృశించి తెలిసికొనదగినట్టియు మండుచున్నట్టియు కొండకును, అగ్నికిని, కారుమేఘమునకును, గాంఢాంధకారము నకును, తుఫానుకును, బూరధ్వనికిని, మాటల ధ్వనికిని మీరు వచ్చియుండలేదు. ఒక జంతువైనను ఆ కొండను తాకినయెడల రాళ్లతో కొట్టబడవలెనని ఆజ్ఞాపించిన మాటకు వారు తాళలేక, ఆధ్వనిని వినిన వారు మరి ఏమాటయు తమతో చెప్పవలదని బతిమాలుకొనిరి. మరియు ఆ దర్శనమెంతో భయంకరముగా ఉన్నందున మోషే నేను మిక్కిలి భయపడి వణకుచున్నానెను" (హెబ్రీ 12:18-21). సీనాయి పర్వతం మీద పాతనిబంధనను మోషేకు ఇచ్చినప్పటి సంగతులను గూర్చి రచయిత మాట్లాడుచున్నాడు (నిర్గమ 20:19; ద్వితి 4:11).

ఇపుడయితే క్రైస్తవులమయిన మనము సీనాయియను కొండకు వచ్చియున్నాము (హెబ్రీ 12:22). దేవుని ఆలయం నిర్మింపడిన యెరూషలేములో ఈసీయోను పర్వతం ఉంది. దావీదు రాజు యెబూసీయులనుండి ఈసీయోనును తీసికొని దావీదు పట్టణంగా నిర్మించాడు. అతడు గిబియానుండి దేవుని నిబంధన మందసమును తీసికొని వచ్చి యెరూషలేములో ఉంచాడు. సొలొమోను యెరూషలేములో గొప్పమందిరమును నిర్మించు వరకు మందసము గుడారము మధ్యనుంచబడెను (2 సమూ 5:6-9). యెషయా ప్రవక్త ఇలా ప్రవచించాడు: "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున కొండలకంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులోనుండి ధర్మ శాస్త్రము యెరుషలేములో నుండి యెహోవా వాక్కు బయలువెళ్లును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి..." (యెషయా 2:2-3; మీకా 4:1-2). "దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు

ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులు నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును దాని ఆధారమునై యున్నది (1 తిమోతి 3:15; 1 పేతురు 2:5). సీయోను దేవుని ఇల్లు, దేవుని ఇల్లు జీవముగల దేవుని సంఘము. క్రీ॥శ 33లో యెషయా ప్రవక్త యొక్క ప్రవచనము పెంతెకోస్తుదినాన యెరూషలేములో నెరవేరింది (అపొ.కా. 2వ అధ్యా). యెరూషలేములో (సీయోనులో) సంఘము స్థాపింపబడింది. సమస్త జనులు ప్రవాహంగా దీనిలోనికి వస్తున్నారు. క్రొత్తనిబంధన ఆజ్ఞలు, దేవుని వాక్యము అపొస్తలుల ద్వారా యెరూషలేము నుండి ప్రకటించబడింది (అపొ॥కా 2: 42;8:1).

సంఘము అనేది జీవముగల దేవుని పట్టణం. దేవుడు తన ప్రజలకు ఒక పట్టణము సిద్ధపరచనైయున్నాడని అబ్రాహాము ఎరుగును (హెబ్రీ 11:16; 8: 56; ఎఫెసీ 2:18). అతని దర్శనములో యోహానుకు ఒక దూత ఈలాగు చెప్పెను. "యెరూషలేము అను పరిశుద్ధపట్టణము దేవుని మహిమగలదై పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట నాకు చూపెను. ........ గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడిన వారే దానిలో ప్రవేశింతురుగాని నిషిద్ధమైనదేదైనను అసహ్యమైనదానిని, అబద్ధమైన దానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు" (ప్రకటన 21:1-27).

దేవదూతలు సేవకులైన ఆత్మలు (హెబ్రీ 1:14, లూకా 2:13; ఆది 28:12; కీర్త 103:20; 34:7; 148:2; దానియేలు 7:10; ప్రకటన 5:11; మత్తయి 26:53; మార్కు 1:13). వారు నిత్యము స్తుతిచేయుదురు (యెష 6:24; ప్రక 19:1-3). ఆయన రెండవ రాకడలో వారు యేసు ప్రభువుతో వస్తారు (మత్త 25:31; 1 కొరింథీ 15:52). క్రైస్తవులందరితో పాటు లెక్కింప శక్యముకానంత మంది దేవదూతలు కూడ దేవునికి స్తుతిగానము పాడుదురు.

సంఘము అనేది పరలోకమందు పేర్లు వ్రాయబడిన ప్రధమ సంతతియొక్క కూడిక. ప్రధమ సంతతి ఎవరు? దేవుడు ఫరోతో అన్నారు "....... ఇశ్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్టపుత్రుడు" (నిర్గమ 4:22). యేసుక్రీస్తు రక్తములో ఎవరైతే తమ పాపములను కడుగుకున్నారో వారే దేవుని పిల్లలు. "బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాడు, శరీరమందు బాహ్యమైనసున్నతి సున్నతి కాదు. అయితే అంతరంగ మందు యూదుడైనవాడే యూదుడు. మరియు సున్నతి

హృదయసంబంధమైనదై ఆత్మయందు జరుగునదేగాని అక్షరము వలన కలుగునది కాదు. అట్టివానికి మెప్పు మనుష్యుల వలన కలుగదు. దేవుని వలననే కలుగును". (రోమా 2:28,29). క్రైస్తవులు దేవుని ప్రియమైన కుమారులు, కుమార్తెలునైన నూతన ఇశ్రాయేలీయులు. దేవుడు మోషేతో ఇలా అన్నారు "ఇశ్రాయేలీయులలో నుండి లేవీయులను నావశము చేసికొనియున్నాను. ప్రతి తొలిచూలియు నాది. గనుక లేవీయులు నావారైయుందురు. నేనే యెహోవాను" (సంఖ్యా 3:12,13). ప్రత్యక్షగుడారములోను తరువాత దేవాలయములోను దేవునికి సేవచేయుటకు ఏర్పరచుకొనబడిన గోత్రపువారు లేవీయులు. క్రైస్తవులయిన మనలను ప్రభువైన దేవుడు రాజులైన యాజకులుగా ఏర్పరచుకొన్నారు. వారు "దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" అని పేతురు వ్రాసాడు (1పేతురు 2:9). పరలోకమందు పేరులు వ్రాయబడిన జ్యేష్ఠసంతానము క్రైస్తవులు (లూకా 10:20, ఫిలిప్పీ 4:3, 14; ప్రక 3:5; 20:12).

సమస్త దేశములకు న్యాయాధిపతియైనవానిని సంఘము ఘనపరుస్తుంది. దేవుడు సొదొమ-గొమెఱ్ఱాలను నాశనం చేయాలను కొన్నప్పుడు ఆ పట్టణంలోని నీతిమంతుల కొరకు అబ్రాహాము దేవుని యెదుట మొఱ్ఱపెట్టుకున్నాడు. "సర్వలోకమునకు తీర్పుతీర్చువాడు న్యాయము చేయడా?" (ఆది 18:25). "భూలోక న్యాయాధిపతీ లెమ్ము, గర్విష్టులకు ప్రతిఫలమిమ్ము అని కీర్తనాకారుడు ప్రార్థిస్తున్నారు. "ఇక మీదట నాకొరకు నీతికిరీటముంచబడి యున్నది. ఆదినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు ఆదినాకును నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:8) అని తన జీవిత చివరి దశలో పౌలు చెప్పాడు.

ప్రభువునందు నిద్రించినవారు లేదా పరిపూర్ణులయినవారితో కలిసి క్రైస్తవులు దేవుని స్తుతిస్తారు. అబ్రాహాము రొమ్మున ఆనుకొని (లూకా 16:19-31) ఆదరణ పొందుచున్న వారి ఆత్మలు, క్రీస్తు ప్రభువు భూమికి తిరిగి వచ్చినపుడు ఆయనతో కూడా ఉంటారు (1 థెస్స 4:16; 3:13). "ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చును" (యూదా 14). గొప్ప పరిశుద్ధుల సమూహము ప్రభువును, గొఱ్ఱెపిల్లను సింహాసనాసీనుడైన మాదేవునికిని గొఱ్ఱెపిల్లకును మా రక్షణకై స్తోత్రమని స్తుతిస్తారు (ప్రక 7:9,10; 15:3,4; 19:1,2). క్రొత్తనిబంధనకు మధ్యవర్తి యేసుక్రీస్తు ప్రభువు సర్వశక్తుడైన దేవుని ప్రియమైన కుమారుడు.

సర్వమానవ పాపములను భరించుటకై ఈలోకమునకు మానవ రూపంలో వచ్చారు, “దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయ ధనముగా తన్నుతానే సమర్పించుకొనెను. దీనిని గూర్చిన సాక్ష్యము యుక్తకాలముల యందు ఇయ్యబడును” (1 తిమోతి 2:5-6). “ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున పిలువబడిన వారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానము పొందినందున ఆయన కొత్తనిబంధనకు మధ్యవర్తియైయున్నాడు” (హెబ్రీ 9:15). నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు (1 యోహాను 2:2). యేసుక్రీస్తు ప్రభువు మన ప్రధాన యాజకుడు. పరలోక ప్రభువు మానవజాతికి మధ్యవర్తి.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా ఎవరు తమ పాపములను కడుగుకొనుచున్నారో వారిని ప్రభువు తన సంఘమునకు చేరుస్తున్నారు. నీతి యగునట్లు క్రీస్తుప్రభువు మనపాపములనన్నీటిని కడుగుతున్నారు. హేబెలు తన సోదరుని ద్వారా చంపబడినపుడు అతని రక్తము నేలనుండి దేవునికి మొరపెట్టింది. (ఆది 4:9). హేబెలు రక్తముకు ఎవరి పాపములను కడుగ గల శక్తి లేదు గనుక యేసుక్రీస్తు ప్రభువు రక్తము హేబెలు రక్తము కంటే శ్రేష్టమైనది.

రచయిత పాతనిబంధన కంటే నూతన నిబంధన యొక్క ఆధిక్యతను తెలియచేయుచున్నాడు. దేవుని సంఘములో దేవుని రాజ్యములో ఉండే ఆశీర్వాదము అనేది కదల్చబడదు. దేవుని రాజ్యములో ఉన్న ఆశీర్వాదములన్నిటిని అనుభవించగల ఆధిక్యత గలవారం గనుక మనము దేవునిని భయభక్తులతో, గౌరవంతో అంగీకారమునైన రీతిగా సేవించవలెను. లేనియెడల మనము శిక్షింపబడుదుము. ఎందుకనగా “మన దేవుడు దహించు అగ్నియైయున్నారు.” (హెబ్రీ 12:18-29).

# హేబెలు మృతినొందియు మాటలాడుచున్నాడు.

## (Abel Being Dead, Yet Speaketh)

మన మొదటి తల్లిదండ్రులు ఆదాము హవ్వల ప్రథమ కుమారుడు కయీను. హేబెలు వారి రెండవ కుమారుడు. హెబ్రీ గ్రంథకర్త హేబెలును గూర్చి "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు" (హెబ్రీ 11:4) అని హేబెలును గూర్చి చెప్పెను. కయీను, హేబెలుల కథ మనం ఆదికాండము 4వ అధ్యాయంలో చదువుతాము.

"ఆదాము తన భార్యయైన హవ్వను కూడినపుడు ఆమె గర్భవతియై కయీనును కని – యెహోవా దయవలన నేనొక మనుష్యుని సంపాదించుకొన్నా ననెను. తరువాత ఆమె అతని తమ్ముడగు హేబెలును కనెను. హేబెలు గొర్రెల కాపరి కయీను భూమిని సేద్య పరచువాడు. కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా –యెహోవా కయీనుతో – నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియచేయని యెడల వాకిట పాపము పొంచియుండును. నీయెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను. కయీను తన తమ్ముడైన హేబెలుతో మాటలాడెను. వారు పొలములో ఉన్నప్పుడు కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతని చంపెను." (ఆది 4:1-8).

### హేబెలు నీతిమంతుడు

ప్రభువైన దేవుడు హేబెలు అర్పణను ఎందుకు లక్ష్యపెట్టెను? కయీను అర్పణను ఎందుకు తిరస్కరించెను? యోహాను దానికి సమాధానమిస్తున్నాడు. "మనము కయీను వంటి వారమై యుండరాదు. వాడు దుష్టుని సంబంధియై

తన సహోదరుని చంపెను. వాడతనిని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతి గలవియునై యుండెను గనుకనే గదా!" (1యోహాను 3:12). ప్రభువైన దేవుడు హేబెలు జీవితమును అతని అర్పణను అంగీకరించెను. ఎందుకనగా అతడు ఆయన దృష్టిలో నీతిమంతుడు. ఆయన వాక్యమును బట్టి మనము నడుచుకొనుచున్న యెడల మనము కూడా ఆయన దృష్టిలో అంగీకరింపబడుదుము.

"నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక" (కీర్త 19:14). మన నోటిమాటలు, మన తలంపులు, మన జీవన విధానము ఆయన దృష్టికి అంగీకారముగా ఉండును గాక. హేబెలు మృతిచెందెనుగాని దేవునికి అంగీకారంగా ఉండే జీవన విధానం మనం కలిగి ఉండాలని అతడు మనతో మాట్లాడుచున్నాడు.

**రెండవదిగా, యెహోవా కయీనుతో - "నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి?** నీవు సత్క్రియచేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచియుండును; నీ యెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను" (ఆది 4:6). హేబెలు జీవితము దేవుని యెదుట మంచిగా ఉండెను. అతని జీవితము మంచి పనులతో నిండివుండెను. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16) అని యేసు ప్రభువు చెప్పెను. "సత్ క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకు వారికి ఆయన నిత్య జీవము నిచ్చును" (రోమా 2:7).

"మనము మేలు చేయుటయందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంటకోతుము" (గలతి 6:9).

"ఎవడును కీడునకు ప్రతికీడు ఎవరికైనను చేయకుండ చూచుకొనుడి. మీరు ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైన దానిని అనుసరించి నడుచుకొనుడి" (1 థెస్స 5:15). "సహోదరులారా! మీరైతే మేలు చేయుటలో విసుక వద్దు" (2 థెస్స 3:13). "అధిపతులకును అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెననియు, ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండవలెననియు, ఈ మాట నమ్మదగినది గనుక దేవుని యందు

విశ్వాసముంచినవారు సత్క్రియలను శ్రద్ధగా చేయవలెను. ఇవి మంచివియు మనుష్యులకు ప్రయోజన కరములునై యున్నవి. మన వారును నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరముబట్టి సమయోచితముగా సత్క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను (తీతు 3:1, 8,14) "ఉపకారమును, ధర్మమును చేయమరచిపోకుడి, అట్టి యాగములు దేవుని కిష్టమైనవి" (హెబ్రీ 13:16).

**మూడవదిగా, హేబెలు మృతి చెందినప్పటికి దేవునికి శ్రేష్ఠమైనవి ఇవ్వాలని మనతో మాట్లాడుచున్నాడు.** "శ్రేష్ఠమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును. ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనా గమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు". (యాకోబు 1:17). అన్ని దీవెనలు మనము ఆయన నుండి పొందుచున్నాము. "ఎందుకనగా నీకు ఆధిక్యము కలుగజేయువాడెవడు? నీకు కలిగిన వాటిలో పరుని వలన నీవు పొందనిది ఏది? పొంది యుండియు పొందనట్టు నీవు అతిశయింపనేల?" (1 కొరిం 4:7). ఆయన మన సృష్టికర్త, మన తండ్రి, మన అవుసరతలన్నీ ఆయన సమకూరుస్తారు. ఆయన ఆకాశమునుండి వర్షమును, ఫలభరితమైన ఋతువులను ఇచ్చి మేలుతో మనలను తృప్తి పరచుచున్నారు (అపో.కా. 14:17). ఆయన నుండి మనకు సహాయం వస్తుంది. ఆయన మన దేవుడు. దానికి ప్రతిగా మనము ఆయనకు ఏమి ఇవ్వగలము? సర్వశక్తిగల దేవుడు ఇట్లనుచున్నారు: "నీ యింటనుండి కోడెనైనను, నీ మందలోనుండి పొట్టేలైనను నేను తీసికొనను. అడవి మృగములన్నియు, వేయి కొండలమీది పశువులన్నియు నావేగదా. కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును. పొలములోని పశ్వాదులు నా వశమై యున్నవి. లోకమును దాని సంపూర్ణతయు నావే. నేను ఆకలిగొనినను నీతో చెప్పను" (కీర్తన 50:9–12)

మనము అన్ని మేలులను దేవుని నుండి పొందుతాము. తిరిగి ఆయనకు ఏమి ఇవ్వగలము? మన పాప ప్రాయశ్చిత్తంగా ఆయన తన కుమారుడు యేసుక్రీస్తు ప్రభువును ఈ లోకమునకు పంపారు. తన మందలో శ్రేష్ఠమైన దానిని హేబెలు అర్పించాడు. తన వాగ్దాన పుత్రుని ప్రభువునకు ఇయ్యదానికి అబ్రాహాము వెనుదీయలేదు (ఆది 22). హన్నా తన మొదటి కుమారుడు సమూయేలును దేవుని సేవకు ఇచ్చింది. దావీదు, సొలొమోను తన కున్నవాటిలో శ్రేష్ఠమైనవి దేవునికి ఇచ్చారు. హేబెలు మరణించాడు. మరణించినా గాని మనము

దేవునికి శ్రేష్టమైనవి ఇవ్వాలని మనతో మాట్లాడుచున్నాడు.

**హేబెలు మరణించినప్పటికి దేవునికి మనము మొదటి స్థానం ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు.** హేబెలు తన మందలో 'తొలిచూలు' వాటిని దేవునికి ఇచ్చాడు. మన దేవుడైన ప్రభువు మన జీవితంలో మొదటి స్థానం కోరుతున్నారు. ఇశ్రాయేలుకు ఆయన ఇచ్చిన మొదటి ఆజ్ఞ "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" (నిర్గమ 20:3). ఓడ నుండి బయటకు వచ్చిన తరువాత నోవహు మొదటిగా "యెహోవాకు బలిపీఠము కట్టి పవిత్ర పశువులన్నిటిలోను పవిత్ర పక్షులన్నిటిలోను కొన్ని తీసికొని ఆ పీఠము మీద దహన బలి అర్పించెను" (ఆది 8:20). మన పితరులు, విశ్వాసవీరులునైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు ప్రభువుకు ప్రథమ స్థానమిచ్చారు.

ప్రభువైన యెహోవా ఇశ్రాయేలీయులు తమ పంటలోని ప్రథమ పంటను ఆయనకు ఇవ్వాలని వారికి ఆజ్ఞాపించారు (లేవి 23:10). "మనుష్యులలోను, పశువుల లోను ఇశ్రాయేలీయులలో తొలిచూలియైనది యావత్తును నాది. ఐగుప్తుదేశములో తొలిచూలియైన ప్రతివానిని నేను సంహరించిన నాడు వారిని నాకొరకు ప్రతిష్టించుకొంటిని. ఇశ్రాయేలీయులలో తొలిచూలియైన ప్రతివానికి మారుగా లేవీయులను తీసికొనియున్నాను" (సంఖ్యా 8:17,18).

కొండమీది ప్రసంగంలో మన దేవుడైన యెహోవా, మన రక్షకుడైన ప్రభువు "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడు అవన్నియు మీకనుగ్రహింపబడును" అన్నారు (మత్తయి 6:33). మనము సంఘముయొక్క క్షేమాభివృద్ధి కొరకు ఆయన రాజ్య విస్తరణకొరకు ప్రయాసపడాలి. దేవుని చిత్తము చేయడమే యేసు ప్రభువు యొక్క గురి ప్రథమ కర్తవ్యం కూడా. "ఇతర సమీప గ్రామములలోనూ నేను ప్రకటించునట్లు వెళ్ళుదము. రండి. ఇందు నిమిత్తమే గదా నేను బయలు దేరి వచ్చితినని వారితో చెప్పెను" (మార్కు 1:39). "నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది" (యోహా 4:34). యేసుప్రభువు తనను వెంబడించమని ఆయన శిష్యులను పిలిచినపుడు వారు తమ వృత్తిని తల్లిదండ్రులను విడిచి ఆయనను వెంబడించారు. మనము ఇద్దరు యజమానులకు దాసులుగా వుండలేము. మన హృదయంలో, జీవితంలో దేవునికి లోకానికి ఒకేసారి ప్రథమస్థానం ఇయ్యలేము. మనం దేవునికి మన జీవితంలో ప్రథమస్థానం

ఇయ్యాలని ఆయన ఆశ. రెండవ స్థానం ఆయన అంగీకరించరు. మరియ ఆయన పాదముల యొద్ద కూర్చొని దేవుని మాటలు వినడానికి ప్రాధాన్యతనిచ్చింది గనుక యేసుప్రభువు ఆమెను అభినందించారు (లూకా 10:38-42).

హేబెలు మరణించినప్పటికి మనం జీవితంలో, మన రాబడిలో, మన సమయంలో దేవునికి మొదటిస్థానం ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు. ఆయన ప్రథముడుగా ఉండడం ఆయనకు ఇష్టం. మనం ప్రతిదినం ప్రార్ధనతో ప్రారంభిద్దాం. ఆరాధన కార్యక్రమాలకు హాజరు కాలేనంత పనులభారంతో మనం ఉండవద్దు. అలా చేస్తున్నట్లయితే మనం యేసుప్రభువునకు ఆయన రాజ్య విస్తరణకు మొదటిస్థానం ఇవ్వడం లేదన్నమాట. ప్రతిరోజు కుటుంబ ప్రార్ధనలో పాల్గొనకపోతే మనం మన జీవితంలో దేవునికి ప్రధమ స్థానం ఇయ్యడం లేదు. నీ జీవితంలో, నీ హృదయంలో నీవు ఎవరికి మొదటి స్థానం ఇస్తున్నావు? హేబెలు మరణించినాగాని మనం దేవునికి మొదటిస్థానం ఇవ్వాలని మాట్లాడుతున్నాడు.

మరణించినాగాని మంచి చేయుటకు హేబెలు మనతో మాట్లాడుతున్నాడు. శ్రేష్టమైనవి ఆయనకిచ్చుట ద్వారా మన జీవితంలో, రాబడిలో, మన సమయంలో సర్వశక్తుడైన దేవునికి ప్రధమ స్థానం ఇచ్చుట ద్వారా మన ప్రతి దినచర్యలో ఆయనను ఘనపరచవలెనని హేబెలు మరణించినాగాని మనతో మాట్లాడుతున్నాడు. అతడు చెప్పినది నీవు వింటున్నావా?

# నా తమ్మునికి నేను కావలి వాడనా?

## (Am I my Brother's Keeper?)

మన మొదటి తలిదండ్రులయిన ఆదాము, హవ్వలకు కయీను, హేబెలు అను ఇద్దరు కుమారులుండిరి. కయీను భూమిని సేద్యపరచువాడు, హేబెలు గొర్రెల కాపరి. వాక్యం ఏం చెబుతుందంటే – "కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును, అతని అర్పణను లక్ష్యపెట్టెను. కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా, యెహోవా కయీనుతో – నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచి యుండును. నీ యెడల దానికి వాంఛకలుగును నీవు దానిని ఏలుదువనెను. కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతనిని చంపెను. యెహోవా – నీ తమ్ముడైన హేబెలు ఎక్కడ ఉన్నాడని కయీను నడుగగా అతడు – నేనెరుగును, నా తమ్మునికి నేను కావలి వాడనా? అనెను" (ఆది 4:4–9).

చాల కుటుంబాలలో జ్యేష్టుడు మిగిలిన చిన్నబిడ్డల బాధ్యత తీసుకుంటూ వారికి మాదిరికరంగా ఉండాలని తల్లిదండ్రులు అంటారు. అక్క అయిన మిర్యాము బాలుడైన మోషేను గూర్చి జాగ్రత్త తీసి కొన్నది. మన తోటివారితో గల సంబంధంపైన దేవునితో మనకు గల సంబంధంపైన మన జీవితం ఆధారపడి యుండును. దేవుని ఆజ్ఞలకు లోబడడం ద్వారా, ప్రార్థించడం ద్వారా, దేవుని వాక్యము ధ్యానించడం ద్వారా, దేవునితో మనకున్న సంబంధాన్ని మనం బలపరచుకుంటాం. దేవుడు సీయోను పర్వతం మీద ఇశ్రాయేలీయులకు పది ఆజ్ఞలు ఇచ్చారు. యేసు ప్రభు వాటిని రెండు భాగాలుగా కుదించారు. "నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణఆత్మతోను, నీ పూర్ణ మనసుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే. ఇది ముఖ్యమైనదియు, మొదటిదియునైన ఆజ్ఞ. నిన్ను వలె నీ పొరుగు వాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమైయున్నవి"

(మత్తయి 22:36–40; రోమా 13:8–10; ఆది 3:14). “నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొక నినొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ” అని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 15:12;13:35). అపొస్తులుడైన యోహాను రాస్తున్నారు –“ మన మొకనినొకడు ప్రేమింపవలెననునది మొదటినుండి మీరు వినిన వర్తమానమే గదా. మనము కయీను వంటివారమై యుండరాదు. వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను, వాడతనిని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతిగలవియునై యుండెను గనుకనేగదా?” (1 యోహాను 3:11–12). ఎవడైనను – “నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును. తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు (1 యోహా 4:20). థెస్సలోనికయలో నున్న క్రైస్తవులకు పౌలు ఇలా వ్రాస్తున్నాడు “సహోదర ప్రేమను గూర్చి మీకు వ్రాయనక్కరలేదు, మీరు ఒకనినొకడు ప్రేమించుటకు దేవుని చేత ఏర్పరచబడితిరి” (1 థెస్స 4:9).

సంఘమునకు యేసుక్రీస్తు ప్రభువుశిరస్సు. క్రైస్తవులమైన మనము ఆయన శరీరమై యున్నాము. క్రైస్తవుడైన ప్రతీ వ్యక్తి క్రీస్తు శరీరములో యొక భాగమువలె యున్నాడు. “ఒక్క శరీరములో అనేక అవయవములుండినను ఈ అవయవము లన్నిటికి ఒక్క పని యేలాగుండదో, ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము (రోమా 12:5,6). “శరీరములో వివాదములేక, అవయవములు ఒక దానికొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగచేసి, శరీరమును అమర్చియున్నారు. కాగా ఒక అవయవము శ్రమపడినపుడు అవయవములన్నియు దానితో కూడా శ్రమపడును. ఒక అవయవము ఘనత పొందునపుడు అవయవములన్నియు దానితో కూడా సంతోషించును. అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమైయుండి వేరువేరుగా అవయవములై యున్నారు” (2 కొరింథీ 2:25–27).

ఒక శరీరము యొక్క లేదా ఒక కుటుంబముయొక్క సభ్యులమైయుండి మనము ఒకరికొకరము అబద్ధమాడరాదు “ఒకనితోనొకడు అబద్ధమాడకుడి, ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడా మీరు పరిత్యజించిరి”

(కొలస్స 3:9). మనము ఒకరికొకరము అవయములై యున్నాము గనుక మీరు అబద్ధ మాడుట మాని ప్రతివాడును తన పొరుగు వానితో సత్యమే మాటలాడవలెను (ఎఫెసీ 4:25). "ఒకనికి విరోధముగా ఒకడు మాటలాడకుడి. తన సహోదరునికి విరోధముగా మాటలాడి తన సహోదరునికి తీర్పు తీర్చువాడు ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా మాటలాడి ధర్మశాస్త్రమునకు తీర్పు తీర్చుచున్నాడు. నీవు ధర్మశాస్త్రమునకు తీర్పు తీర్చినయెడల ధర్మశాస్త్రమును నెరవేర్చువాడవుకాక న్యాయము విధించువాడవైతివి" (యాకోబు 4:11). "ఒకరినొకరము వివాదము రేపకయు, ఒకరియందొకరము అసూయ పడకయు వృధాగా అతిశయ పడకయు ఉందము" అని పౌలు గలతీయులకు 5:26 లో చెబుతున్నాడు.

దైవజనుడైన మోషేకు వ్యతిరేకముగా మాటలాడినపుడు దేవునికోపము అహరోను, మిర్యాముకు కుష్టువ్యాధి కలిగించెను. దీనిని సంఖ్యా 12 అ॥లో చూడగలం. ఒకే కుటుంబము యొక్క లేక ఒకే శరీరము యొక్క సభ్యులంగా మనము ఒకరి భారములను మరొకరు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చవలెను" (గలతీ 6:2). ఒకరికొకరం దయగా ఉండి గౌరవించుకోవాలి. "సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగము గలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" (రోమా 12:10; లూకా 10:25-37). ఒకే కుటుంబము యొక్క సభ్యులంగా ఒకరికొకరిని అప్పగించుకొని సహకరించుకోవాలి. "ప్రేమ కలిగిన వారై ఒకనికొకడు దాసులై యుండుడి" (గలతి 5:13). "క్రీస్తునందలి భయముతో ఒకనినొకడు లోబడియుండుడి" (ఎఫెసి 5:21). ఒకే కుటుంబము యొక్క సభ్యులంగా ఒకనినొకరం సహించుకొనాలి, దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణవినయముతోను... సాత్వీకముతోను నడుచుకొనాలని పౌలు ఎఫెసీ సంఘానికి వ్రాస్తున్నాడు (ఎఫెసి 4:2). "ఒకనినొకడు సహించుచు ఒకని నొకడు క్షమించుడి". (కొలస్స 3:13; మత్తయి 6:14). "క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము, మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫె4:32). "మీరు ఒకనినొకడు కరచుకొని భక్షించినయెడల మీరు ఒకని వలన ఒకడు బొత్తిగా నశించిపోదురు"... (గలతీ 5:15). ఒక కుటుంబము యొక్క సభ్యులంగా ఒకరినొకరం ఆదరించుకొని క్షేమాభివృద్ధి కలిగించుకోవాలి. "ఒకని నొకరు ఆదరించి ఒకనికొకడు క్షేమాభివృద్ధి కలుగచేయుడి." (1 థెస్స 5:11). "కాబట్టి సమాధానమును,పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయు వాటినే ఆసక్తితో

అనుసరింతము" (రోమా 14:19). "తన పొరుగువానికి క్షేమాభివృద్ధి కలుగునట్లు మనలో ప్రతివాడును మేలైన దానియందు అతనిని సంతోష పరచవలెను" (రోమా 15:2). ఒక కుటుంబము యొక్క సభ్యులంగా "ఒకనితోనొకడు సమాధానముగా ఉండుడి.... అందరియెడల దీర్ఘశాంతము గలవారైయుండుడి... మేలైనదానిని అనుసరించి నడుచుకొనుడి" (1 థెస్స 5:13,15). సమాధానపరచువారు ధన్యులు, వారు దేవుని కుమారుల నబడుదురని ప్రభువు చెప్పారు. దేవుని ఒకే కుటుంబంలోని సభ్యులంగా ఒకరికొకరు గౌరవించుకొనాలి. "వారి పనిని బట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెను " (1థెస్స 5:13). ప్రేమ విషయములో ఒకని యందొకడు అనురాగము గలవారై యుండాలి (రోమా 12:10). దేవుని కుటుంబంలోని సభ్యులంగా ఒకనినొకడు బుద్ధిచెప్పుకోవాలి (హెబ్రీ 3:15). "కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకని ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చిగానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" (కొల్స 3:16). "ఒకనినొకడు హెచ్చరించుచు... ఆలోచించితము." (హెబ్రీ 10:24,25)

ప్రభువైన దేవుడు ప్రవక్తయైన యెహెజ్కేలుతో "నరపుత్రుడా ఇశ్రాయేలీయులకు నేను నిన్ను కావలిగా నియమించియున్నాను..... నిన్ను ఉత్తరవాదిగా ఎంచుదును". (యెహెజ్కేలు 3:17-21). ఒక కుటుంబం యొక్క సభ్యులంగా ఒకరికొరకు ఒకరు ప్రార్థించాలి. 1 థెస్స 5:25లో మాకొరకు ప్రార్థన చేయుడి అంటూ రాస్తున్నారు పౌలు. యాకోబు 5:16 ఒకని కొరకు ఒకరు ప్రార్థన చేయుడి. మత్తయి 5:44లో ప్రభువంటున్నారు "మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి... (ఫిలిప్పి 1:3-4, కొలస్స 1:2). ప్రతి సమయమందును ప్రతి విధమైన ప్రార్థన విజ్ఞాపనలు చేయుచు... మెలకువగా ఉండుడి (ఎఫెసి 6:18-19) అని ఎఫెసీయులకు పౌలు రాస్తున్నాడు. ఒకే కుటుంబము యొక్క సభ్యులంగా ఒకరినొకరు వందనము చేసుకోవలెను, "పవిత్రమైన ముద్దు పెట్టుకొని ఒకనికి ఒకరు వందనములు చెప్పుకొనుడి" (2 కొరింథీ 13:12). క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:15-16). కయీను "నేనునా తమ్మునికి కాపలాదారునా అని దేవుని అడిగాడు... మనము మన తోటి సోదరులకు కావలివారము, అవును కావలివారమే.

# దేవునితో నడిచిన హానోకు

## (Enoch, who walked with God)

తమ శరీరాలతో పరలోకమునకు ఎక్కిపోయిన ముగ్గురు వ్యక్తులు గురించి బైబిలులో నమోదు చేయబడింది. వారు మన పితరుడైన హానోకు, ప్రవక్తయైన ఏలియా మన ప్రభువైన యేసుక్రీస్తు. ఆదాము నుండి ఏడవవాడైన హానోకును గురించి హెబ్రీ గ్రంథకర్త ఇలా వ్రాస్తున్నాడు. “విశ్వాసమును బట్టి హానోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను; అతడు కొనిపోబడక మునుపు దేవునికి ఇష్టుడైయుండెనని సాక్ష్యము పొందెను” (హెబ్రీ 11:5). వారి జననము గురించి అనేకమంది బిడ్డలను కలిగి ఉండడం గురించి, ఈ భూమి పై దీర్ఘాయుష్షు కలిగి ఉండుటను గూర్చి తప్ప మొదటి పితరులను గురించి ఎక్కువగా చెప్పబడలేదు.

**దేవుని సంతోషపెట్టెను :**

దేవునిని సంతోషపెట్టే జీవితాన్ని హానోకు ఎంపిక చేసుకున్నాడు. “హానోకు దేవునితో నడిచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేకపోయెను. (ఆది.కా. 5:24). 365 సం॥ల సుదీర్ఘమైన హానోకు నడక “అతడు దేవునితో నడిచెను” అను చిన్న పదంలోకి కుదించబడింది. “సమ్మతింపకుండ ఇద్దరు కూడి నడుతురా?” (ఆమోసు 3:3). ఆదాము అవిధేయుడు కాకపూర్వము చల్లపూటను దేవుడు వారియొద్దకు వస్తూఉండేవారు. తాను ప్రేమించిన తన పిల్లలతో మంచి సహవాసం కలిగి ఉండాలని దేవునికి ఇష్టం. మంచి సహవాసం లేకుండా హానోకు దేవునితో నడిచిఉండేవాడుకాదు. హేబెలు చేసినట్లు హానోకు కూడ తనకున్న దానిలో శ్రేష్టమైనది దేవునికి ఇచ్చాడు. గనుక హానోకు జీవితం దేవునికి సంతోషకరంగా ఉన్నది. ఏనోషు కాలము నుండి మానవులు దేవునికి ప్రార్థన చేయుట ప్రారంభమైంది (ఆది.కా. 4:26). హానోకు అలా ప్రార్థించిన వారిలో ఒకడు. ప్రార్థన లేకుండా అతడు దేవునితో నడిచి ఉండేవాడు కాదు. హానోకు ప్రార్థనా పరుడు.

ఆ తరమంతా దుర్మార్గముగా నున్నప్పుడు అతడు సుదీర్ఘమైన 300 సం॥లు దేవునితో నడిచాడు. మొదటి ప్రవక్తయైన హానోకు ఈలాగున ప్రవచించాడు.

“ఇదిగో అందరికిని తీర్పు తీర్చుటకును వారిలో భక్తిహీనులందరు భక్తిహీనముగా చేసిన వారి భక్తి హీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటిని గూర్చియు వారిని ఒప్పించుటకును, ప్రభువు తన వేవేల పరిశు ద్ధుల పరివారముతో వచ్చెను” (యూదా : 14,15).

## దేవునికి విధేయుడై జీవించెను:

హనోకు జీవితం ఈ లోకంలో త్వరితంగానే ముగిసింది. అతడు కొనిపోబడెను గనుక అతడు లేకపోయెను. దేవునితో నుండుటకు అతడు మరొక లోకమునకు కొనిపోబడెను. అతడు మరణము చూడలేదు. దేవుని చట్టమునకు అవిధేయులు అవుటవల్ల ఆత్మీయ, శారీరక మరణాలు సంభవిస్తాయి. అవిధేయత పాపము. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23).

హనోకు పాపరహిత, నిందా రహిత జీవితం జీవించాడు గనుక మరణమునకు అతనిపై అధికారము లేదు. అతని జీవితం దేవునికి అంగీకారంగా ఉంది గనుక దేవుడతనిని మరొక లోకమునకు కొనిపోయారు. “మన్నయినది వెనుకటి వలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును” (ప్రసంగి 12:7) అని జ్ఞానియైన సొలొమోను చెప్పియున్నాడు. భూమిలో గల ఖనిజములన్నిటితో మానవుని శరీరం తయారు చేయబడింది. “నేల నుండి నీవు తీయబడితివి, నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోయెదవు” (ఆది. కా. 3:19) అని దేవుడు మానవుని శపించారు. మానవుని భౌతిక శరీరము మంటిలోకి తిరిగి వెళ్లిపోతుంది గాని అతని ఆత్మ నిత్యము ఉంటుంది. నీతిమంతుల ఆత్మలు దేవుని యొద్ద నిత్యము ఉంటాయి. అవినీతిమంతుల ఆత్మలు నిత్యాగ్నికి గురిఅవుతాయి.

## పరదైసు – పాతాళము :

నీతిమంతుల ఆత్మలు పరదైసు అను స్థలములో తీర్పు కొరకు కనిపెడుతూ ఉండును. నీతి మంతుల ఆత్మలు వేచి ఉండు స్థలం పరదైసు. సిలువ పైనున్న దొంగతో యేసుప్రభువు “నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు అని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాను” (లూకా 23:24) అన్నారు.

మరణం తరువాత లాజరు అబ్రాహాము రొమ్మున అనుకొని కనబడ్డాడు, ధనవంతుని ఆత్మ పాతాళములో బాధపడుతూ ఉంది (లూకా 16:22,23).

ఇదిగో మీకొక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పుపొందుదుము. క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసియున్నది, మర్త్యమైన యీ శరీరము అక్షయతను ధరించు కొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనును (1 కొరింథీ 15:49-53).

ఎవరు క్రీస్తుప్రభువు కొరకు జీవిస్తారో వారు క్రీస్తు ప్రభువులో మరణిస్తారు. క్రీస్తుప్రభువు కొరకు జీవించిన వారు ఆయన పోలికలోకి తమ్మును తాము మార్చుకొనుచున్నారు. "మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము (2 కొరింథి 3:18; రోమా 12:2; గలతీ 4:19).

మనము మొదటి ఆదామును పోలి సృజింపబడ్డాము, క్రైస్తవులమైన మనము రెండవ ఆదాములోనికి ఆయన అడుగుజాడలలో నడుచుట ద్వారా మార్చబడుచున్నాము ( 1పేతురు 2:21). హానోకు దేవునితో నడిచెను అతడు ఈ లోకములోనుండి మరియొక లోకములోనికి కొనిపోబడెను. "మృతులలో నుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును (రోమా 8:11). హానోకు నడిచినట్లు మనము దేవునితో నడిచిన యెడల అట్టి పరలోక శరీరము తీర్పుదినాన మనము కూడ కలిగి ఉందుము.

# అబ్రాహాము కుమారులు

## (The Sons of Abraham)

గొప్ప జలప్రళయము నుండి ఎనిమిది మంది మాత్రం రక్షించబడ్డారు. అటు తరువాత ఉద్భవించిన జనాంగములన్నీ నోవహు సంతతి వారే. అవి నోవహు ముగ్గురు కుమారులగు షేము, హాము, యాపెతను వారివలన భూమి విస్తరించబడింది. నోవహుకురులద్వారా ఈ భూమి అంతా ఎలా విస్తరించబడెనో ఆదికాండము 11వ అధ్యాయములో వ్రాయబడియున్నది. అబ్రాహాము షేము సంతతివాడు. కొంత కాలానికి ప్రజలు దేవుని నుండి దూరమైపోయారు. అబ్రాహాము తండ్రియైన తెరహు యితర దేవతలను పూజించేవాడని వ్రాయబడియున్నది (యెహోషు 24:2). ఆదికాండము 12వ అధ్యాయము నుండి అబ్రాహాము అతని జీవితము గూర్చి మనము కనుగొనగలము.

హెబ్రీ పత్రిక లేఖకుడు అబ్రాహామును గూర్చి వ్రాస్తూ "అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు వెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలు వెళ్లెను" అని చెప్పాడు (హెబ్రీ 11:8). కానానులో అతని చుట్టు యున్నవారందరు ఇతర దేవతలను పూజిస్తూయుంటే, అతడొక్కడు మాత్రమే ప్రభువును సేవించుచుండెను. జనసమూహముతో కలసి ఈదుట సులభమేగాని వారికెదురు ఈదుట కష్టము. అందరివలె అతడు అన్యదేవతలను సేవించలేదు.

అబ్రాహాము సంతానహీనుడైన వృద్ధుడయ్యాడు. అయితే అతని 99వ యేట యెహోవా అతని ప్రత్యక్షమై, "అతని వెలుపలికి తీసికొనివచ్చి నీవు ఆకాశమువైపు తేరిచూచి నక్షత్రములను లెక్కించుటకు నీ చేతనైతే లెక్కించుమని చెప్పి నీ సంతానము ఆలాగవునని చెప్పెను. అతడు యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను" (ఆది 15:5,6). తెరహు ఇతర దేవతలను పూజించేవాడుగనుక, ప్రభువైన యెహోవా యందలి విశ్వాసమును అబ్రాహాము తన తండ్రి నుండి పొందలేదు. మోషే ధర్మశాస్త్రము, పదియాజ్ఞలు అప్పటికియ్యబడ లేదు. గనుక వాటి ననుసరించుట ద్వారా అతడు నీతిమంతుడుగా ఎంచబడే అవకాశము అతనికి లేదు. అయితే అతడు "ఆ విశ్వాసమువలన దేవుని వాగ్దానము

గూర్చి సందేహింపక దేవుని మహిమపరచి, ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలము నొందెను" (రోమా 4:20, 21).

అబ్రాహాము దేవునియందు విశ్వాసముంచాడు; దాన్ని నిరూపించాడు. "ఇస్సాకు వలననైనది నీ సంతానమనబడును" అని యెవని గూర్చి చెప్పబడెనో (హెబ్రీ 11:19), ఆ ఏకైక కుమారుని బలి ఇయ్యమని ప్రభువడిగినప్పుడు, అతడు సందేహించక ఆ పనికి సిద్ధమయ్యాడు. "అబ్రాహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను; మరియు దేవుని స్నేహితుడని అతనికి పేరు కలిగెను'' (యాకోబు 2:23). వాగ్దానము చేయబడినట్లు అతడనేక జనాంగములకు తండ్రి అయ్యాడు.

క్రొత్త నిబంధనలో సంతానహీనుడడైన మరియొక వృద్ధుని కనుగొనగలము. అతడు యాజకుడైన జెకర్యా. అతని భార్య ఎలీసబెతు. "వీరిద్దరు ప్రభువుయొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులైయుండిరి" (లూకా 1:6). ఈ దంపతులు ప్రభువు యొక్క ధర్మశాస్త్రాన్నిబట్టి నడుచుకొనుచు నీతిమంతులైయున్నట్లు మనము గమనించగలము; జెకర్యా దేవుని మందిరములో సేవచేయుచున్నాడు. ఒకనాడు ప్రభువు దూతగు గబ్రీయేలు అతనికి కనబడి, జెకర్యా భయపడుకుము; నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహానని పేరు పెట్టుదువు. అతడు ప్రభువు దృష్టికి గొప్పవాడై... పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఇశ్రాయేలీయులలో అనేకులను ప్రభువైన వారి దేవుని వైపునకు త్రిప్పును" అని చెప్పెను (లూకా 1:13-17). ప్రభువు దూత పుట్టబోవు శిశువును గూర్చిన సంపూర్ణ వివరణ, అతనిపేరు, జీవితము, చేసేపని మొదలగువాటిని గూర్చి చెప్పాడు. గాని అతడు ప్రభువుదూత మాట నమ్మలేదు. అందువలన "ఈ సంగతులు జరుగు దినము వరకు నీవు మాటలాడక మౌనివై యుందువని" దూత అతనితో చెప్పాడు (లూకా 1:20).

అబ్రాహాము, జెకర్యా అనువారిలో కొన్ని సమానాంతరాలు, తారతమ్యాలు మనం చూడగలము. ఇద్దరు సంతానములేని వృద్ధులే, దేవుని దృష్టిలో నీతిమంతులనబడినవారే. మరియు తమ వృద్ధాప్యములో కుమారులు

కలుగుదురని వాగ్దానము చేయబడినవారే.

అబ్రాహాము తండ్రి యితర దేవతలను సేవించేవాడు. జెకర్యా ఒక యాజకుడు, గనుక లేవీయుడు. అంటే అతని పితరులు యాజకులు, కానానులో తన చుట్టుయున్న ప్రజలు విగ్రహారాధకులై యుండగా అబ్రాహాము ఒక్కడే నిజదేవుని సేవించుచుండెను. జెకర్యా దేవుని ఆలయములోనే నివసించుచు ప్రభువుచే ఏర్పరచుకొనబడిన ప్రజలకు పరిచర్య చేయుచుండెను. ధర్మశాస్త్రము చొప్పున నడుచుకొని నీతి మంతుడవుటకు అబ్రాహాము కాలములో ధర్మశాస్త్రమీయబడలేదు. జెకర్యా అయితే ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పున విధుల చొప్పున నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతుడై యుండెను (లూకా 1:6). అబ్రాహాముకు వృద్ధాప్యములో కుమారుడు కలుగునని ప్రభువు వాగ్దానము చేయగా అతడు నమ్మెను (ఆది 15:5,6). జెకర్యాకు వాగ్దానము చేయబడినప్పుడతడు దేవుని దూతను నమ్మలేదు (లూకా 1:20).

ఈ యిద్దరిలోను మనమెవరిని పోలియున్నాము? అబ్రాహాము నివసించిన కాలములో మనములేము, మోషే యుగములోకూడ లేము. మనము క్రైస్తవ యుగములో, మన ప్రభువైన యేసుక్రీస్తు కృపకాలములో జీవించుచున్నాము. "కాబట్టి విశ్వాససంబంధులే అబ్రాహాము కుమారులని మీరు తెలిసికొనుడి" యని పౌలు వ్రాయుచున్నాడు (గలతీ 3:7). మనము రక్తమాంసములనుబట్టిగాక విశ్వాసమునుబట్టి అబ్రాహాము కుమారులము. ఇశ్రాయేలీయులు, ఇష్మాయేలీయులు ఏశావుసంతతి, అబ్రాహాముకు కెతూరద్వార కలిగిన సంతతి (ఆది 25:1-5) మొదలైనవారు అబ్రాహాముద్వారా కలిగిన వారే. అయితే కృపయుగంలో విశ్వాసముబట్టి అబ్రాహాము కుమారులైనవారే రక్షింపబడుదురు. విశ్వాసము లేకుండ మనము అబ్రాహాము కుమారులముకాము. మనము పైకి క్రైస్తవులవలె కన్పడవచ్చు, ఆరాధనలకు వెళ్లుచు యుండవచ్చు గాని జెకర్యావలె ఆయన వాగ్దానములను విశ్వసించలేకపోతే, మనకు శిక్ష తప్పదు. గనుక మనము అబ్రాహాము రొమ్మున ఆనుకొనగల్గునట్లు విశ్వాసము ద్వారా అతనికి నిజమైన కుమారులముగాను కుమార్తెలుగాను యుందము (లూకా 16:23).

## "అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము"

## (Charm is deceitful and Beauty is Vain)

**సామె 31:30**

నోవహు దినములు చెడుతనముతో నిండియున్నవి. ఆ తరమంతా దుర్మార్గ మైనది. వారి జీవితాలలో దేవునికి స్థానం లేదు. "జల ప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు నుండిరి" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 24:38). ఆ తరమంతా చెడిపోయి, దుర్మార్గమయినది. దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కని వారని చూచి వారందరిలో తమకు మనస్సు వచ్చిన స్త్రీలను వివాహము చేసికొని వారు తమ అక్రమ విషయములో నరమాత్రులై యున్నారు. ఆ దినములలో నెఫీలులను వారు భూమి మీద నుండిరి, తరువాతను ఉండిరి. దేవుని కుమారులు, నరుల కుమార్తెలతో పోయినపుడు వారికి పిల్లలను కనిరి, పూర్వకాలమందు పేరుపొందిన శూరులు వీరే. నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయములయొక్క తలంపుల లోని ఊహ అంతయు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి, తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను. అప్పుడు యెహోవా – నేను సృజించిన నరులును నరులతో కూడ జంతువులును పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమి మీద నుండకుండ తుడిచి వేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను. అయితే నోవహు యెహోవా దృష్టియందు కృపపొందిన వాడాయెను" (ఆది 6:1–8).

చక్కని వారైన నరుల కుమార్తెలు వారి పిల్లలను దేవుని భయములో తర్ఫీదు చేయలేకపోయిరి. అన్యులతో ఏ విధమైన వైవాహిక సంబంధాలు ఏర్పరచుకొన కూడదని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించారు. "నీవు వారితో వియ్యమందకూడదు, వాని కుమారునికి నీ కుమార్తెను ఇయ్యకూడదు, నీ కుమారునికి వాని కుమార్తెను పుచ్చుకొనకూడదు. నన్ను అనుసరింపకుండ ఇతర దేవతలను పూజించునట్లు నీ కుమారుని వారు మళ్లించుదురు, అందును బట్టి యెహోవా కోపాగ్ని నీ మీద రగులుకొని ఆయన నిన్ను త్వరగా నశింపజేయును" (ద్వితి 7:3–4; 32:18,46).

బాల్యమునుండి వారు దేవుని భయములో పెంచబడలేదు గనుక పిల్లలు దుర్మార్గులై చెడిపోయిరి. "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనపుడు దాని నుండి తొలగిపోడు" (సామె 22:6). మరియు బిడ్డలను గూర్చి ఆయన ఇలా ఆజ్ఞాపించారు -"నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునపుడును త్రోవను నడుచునపుడును పండుకొననపుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికము వలెనుండవలెను. నీ యింటి ద్వారా బంధముల మీదను నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను. (ద్వితీ 6:7-9).

పౌలు ఎఫెసీయులకు ఇలా వ్రాస్తున్నాడు - "తండ్రులారా! మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి". (ఎఫెసి 6:4). "నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదము" అని యెహోషువా అన్నాడు (యెహోషువా 24:15).

అబ్రాహాము గాని ఇస్సాకు గాని తమ కుమారులు కనాను స్త్రీలను వివాహమాడాలని తలంచలేదు (ఆది 24:3; 28:1). ఏశావు హేతు కుమార్తెలను (కనానీయులను) వివాహమాడాడు, వారు ఇస్సాకు రిబ్కాలకు సంతోషం కలిగించలేదు (ఆది 24:46;28:8). లోతు భార్య ఉప్పు స్తంభమైపోయింది. శూరుడైన సమ్సోను ఫిలిష్తీయ స్త్రీలతో సంబంధం కలిగి ఉండెను. వారే తరువాత తన పతనానికి కారణమైనారు (న్యాయా 14:1-3; 16 వ అధ్యాయము). భూమి మీద గొప్పజ్ఞాని అయిన సొలొమోను రాజు తన హృదయమును అన్యదేవతల తట్టు త్రిప్పినందువల్ల, ఆతని పాపములవల్ల ఇశ్రాయేలు రాజ్యము విభజింపబడింది. సీదోనీయుల రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును రాజైన ఆహాబు వివాహం చేసికొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను (I రాజులు 16:31,22 అధ్యాయం). అన్యులైన తమ భార్యలను వారికి పుట్టిన బిడ్డలను విడిచిపెట్టమని బబులోను నుండి తిరిగివచ్చిన ఇశ్రాయేలీయులకు ఎజ్రా, నెహెమ్యాలు పిలుపు నిచ్చారు (ఎజ్రా 10:10-44).

అన్యులైన కొందరు స్త్రీలు తమ పిల్లలను దేవుని భయములో పెంచినట్టు మనము చదువుతాము. ఉదా:- రాహాబు, రూతు. వారు యేసు క్రీస్తు ప్రభువు వంశావళిలో స్థానం పొందారు. " అందము మోసకరము సౌందర్యము వ్యర్థము

యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును". ఇది ఖచ్చితము (సామె 31:30). చక్కని వారైన నెఫిలీల కుమార్తెలు వారి బిడ్డలకు దేవుని భయమును బోధింపలేకపోయారు. మొత్తం తరం అంతా చెడిపోయింది. దుర్మార్గమయింది. దేవుడు ఆ తరమంతటిని నాశనంచేసారు గాని నోవహు యెహోవా దయను పొందాడు. ఆతడు తన కుటుంబము మాత్రమే జలప్రళయంనుండి రక్షింపబడ్డారు.

"మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి" (II కొరిం 6:14).

# ఇష్మాయేలు అనగా దేవుడు వినును

(Ishmael, that is God heareth)

"క్రీస్తు మన ప్రతి సంభాషణను వినును" అను ఈ మాటలను ప్రతి క్రైస్తవ గృహములోను చదువుతాము. దేవుడు ఈ విశ్వానికి సృష్టికర్త. ఆయనకు తెలియకుండా యేది ఈ విశ్వంలో జరగదు. మన తలవెంట్రుకల సంఖ్య నెరిగిన వానికి మనలను గూర్చి సమస్తము ఎరుకే. ఆయన సర్వాంతర్యామి. ఆయన మన ప్రతి సంభాషణను, ప్రతి ప్రార్ధనను ఆలకించును.

హేబెలు రక్తము నేలలోనుండి మొర్రపెట్టగా దేవుడు వినెను. అతనిని హత్య చేసిన తన అన్నయైన కయీనును ఆయన శిక్షించెను (ఆది. కా. 4:1-5). తన యజమానురాలైన శారాయినుండి పారిపోవుచున్న దాసియగు హాగరు ప్రార్ధనను దేవుడాలకించెను (ఆది.కా. 16:11). సొదొమగొమొర్రాల దుష్టత్వము ఆయన సన్నిధిని వినబడగా దేవుడు వాటిని అగ్ని గంధకములతో నాశనము చేసెను (ఆది. కా. 18:20,24). బానిసలైయుండిన ఇశ్రాయేలీయుల మొరను ఆయన వినెను (నిర్గ 3:9). మోషే నాయకత్వములో ఆయన వారిని ఎట్లు విడిపించెనో పరిశుద్ధలేఖనములు ఉపదేశించుచున్నవి. దేవుడు హన్నా యొక్క ప్రార్ధన విని ఆమెకొక కుమారునను గ్రహించెను. ఆమె అతనికి సమూయేలు అని పేరు పెట్టెను. ప్రవక్తయైన యోనా దేవుని సన్నిధి నుండి పారిపోవుచు ఒక పెద్ద చేప కడుపులో యుండి ప్రార్ధన చేయగా దేవుడతని ప్రార్ధనవిని, అతని కక్కి వేయునట్లు ఆయన ఆ చేపకు ఆజ్ఞాపించెను.

గబ్రియేలు దూత జెకర్యాను చూచి "జెకర్యాభయపడుకుము, నీ ప్రార్ధన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహానని పేరు పెట్టుదువు" అని చెప్పెను (లూకా 1:13). కొర్నేలి యొక్క ప్రార్ధనలు దేవునికి వినబడెను. అతడును అతని యింటివారును రక్షణ సువార్తను వినునట్లు ఆయన పేతురును అతని యింటికి పంపించెను (అపో.కా. 10). ఆయనను ఆసక్తితో వెదకు వారి ప్రార్ధనలను ఆయన వినుము. అన్యాయస్థుడైన తీర్పరి ఒక విధవరాలి విన్నపము నాలకించగా తాను ఏర్పరచుకొనిన వారు మొరపెట్టుకొనుచుండగా దేవుడు వారికి న్యాయము తీర్చును గదా? (లూకా

18:7).

ఐగుప్తునుండి కానానుకు వెళ్లుచు ప్రయాణములో ఇశ్రాయేలీయులు దేవునిపై పలుమారులు సణిగారు. “యెహోవా దానిని వినినప్పుడు ఆయన కోపము రగులు కొనెను” (సంఖ్యా 11:1). మనం యితరులను గూర్చి ముఖ్యముగా ఆయన దాసులను గూర్చి సణగిప్పుడు దేవుడు వినును. దైవజనుడైన మోషేకు వ్యతిరేకముగా మిరియాము, అహరోనులు సణిగినప్పుడు దేవుడు వారిని శిక్షించెను. “నా సేవకుడైన మోషేకు విరోధముగా మాటలాడుటకు మీరేల భయపడలేదని” దేవుడు వారినడిగెను (సంఖ్యా 12:1–9). కుష్ఠురోగము గలదిగా దేవుడు మిర్యామును మొత్తెను. మోషే ప్రార్థన చేయగా ఏడు దినములు అనంతరము ఆమె శుద్ధి ఆయెను.

మన హృదయములోని ప్రతి దుష్టతలంపును దేవుడు వినును. నోవహు కాలమందలి దుష్టజనాంగము నంతటిని ఆయన నాశనము చేసెను. “నరుల హృదయము యొక్క తలంపుల లోని ఊహ అంతయు ఎల్లప్పుడు చెడ్డదని యెహోవా చూచెను” (ఆది.కా. 6:5). బుద్ధిహీనుడైన ధనిక రైతు యొక్క తలంపులను ఆయన వినెను. అతడిట్లు తలంచెను: “నా పంట సమకూర్చు కొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతుననుకొని తనలో తాను ఆలోచించుకొని, నేనీలాగు చేతును; నా కొట్లు విప్పి వాటికంటె గొప్ప వాటిని కట్టించి, అందులోనా ధాన్యమంతటిని, నా ఆస్థిని సమకూర్చుకొని నా ప్రాణముతో, ప్రాణమా అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది; సుఖించుము, తినుము త్రాగుము సంతోషించుమని చెప్పుకొందుననుకొనెను. అయితే దేవుడు వెర్రివాడా, ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను” (లూకా 12:17–20). ఇశ్రాయేలీయుల మధురగాయకుడగు దావీదు, “నానోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక” యని ప్రార్థించాడు (కీర్త 19:14).

మనము పలుకు ప్రతి మాటను గూర్చి దేవుడు మనలను లెక్క అడుగును. “మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీవు నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు” అని

యేసు ప్రభువు చెప్పెను (మత్తయి 12:36-37). మన నాలుకను గూర్చి జాగ్రత్తగ యుండాలని యాకోబు 3:1-12లో చెప్పబడియున్నది. బూతులైనను, పోకిరి మాటలైనను సరసోక్తులైనను ఉచ్చరింపకూడదని ఎఫెసీ 5:4లో పౌలు హెచ్చరించాడు (I తిమోతి 6:20; II తిమో2:16).

మన పరలోకపు తండ్రి మన ప్రార్థనలనాలకింపకపోతే మన గతి యేమవును? (I పేతురు 3:16). మన జీవితం ఆయన చిత్తానికి విరుద్ధంగా యుంటే ఆయన మనలనాలకించదు (యెషయా 59:1-2). మనము తన ఏకైక కుమారుని మాటలను విని రక్షింపబడునట్లు ఆయనను ఈ లోకమునకు పంపారు. "ఈయనే నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాటలను వినుడి" యని ఆయన ఉద్ఘాటించారు (మత్తయి 17:5). ఆయన మాటలను విననివాడు నిత్యనాశనమునకు గురి యవుతాడు.

మనము తన కుమారుని మాట వినిన యెడల మన పరలోకపు తండ్రి మన ప్రార్థనలను వినును. "చెవులను కలుగజేసినవాడు వినకుండునా?" (కీర్త 94:6).

# నోవహు దినములు ఏలాగుండెనో

(As the Days of Noah were...)

యేసు దేవాలయము నుండి బయలుదేరి వెళ్లుచుండగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చి - దేవాలయపు వినాశనము ఎప్పుడు జరుగును? మరియు నీ రాకడకును ఈ యుగసమాప్తికి సూచనలేవి? అని రెండు ప్రశ్నలు అడిగిరి. మొదటి ప్రశ్నకు సమాధానం మత్తయి 24:1-26 నందు వ్రాయబడియున్నది. మరియు రెండవ ప్రశ్నకు సమాధానం 27 నుండి 50 వచనముల యందు చదువగలము. "అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును అలాగే ఉండును. "జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; అలాగుననే మనుష్య కుమారుని రాకడయు ఉండును" (మత్తయి 24:36-39). ఇక్కడ యేసు ఆయన యొక్క రెండవ రాకడను నోవహు సమయములో జలప్రళయము ముందు రోజులతో పోల్చెను.

నరులు భూమి మీద విస్తరింపనారంభించిన తరువాత వారి చెడుతనము భూమి మీద గొప్పదని దేవుడు చూచి నరులను చేసినందుకు సంతాపము నొంది జలప్రళయము ద్వారా భూమిని నాశనము చేయాలని నిర్ణయించుకొనెను. అయితే నీతిపరుడైన నోవహు యెహోవా దృష్టియందు కృపపొందిన వాడాయెను. దేవుడు నోవహును చితిసారకపు మ్రానుతో ఓడను చేసి అరలు పెట్టవలెనని ఆజ్ఞాపించెను. నోవహును అతని భార్యయు, అతని కుమారులును కోడండ్రును సమస్త జీవులలో ప్రతి జాతిలోను రెండేసి చొప్పున ఓడలోనికి ప్రవేశించి నలుబది పగళ్లును, నలుబది రాత్రులును కురిసిన ప్రచండ వర్షము నుండి రక్షింపబడెను. అప్పటి దినము వరకు భూమి మీద వర్షము పడలేదు. అయినా నోవహు దేవుడు ఆజ్ఞాపించిన ప్రకారము యావత్తును చేసెను. "విశ్వాసమును బట్టి నోవహు

అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను" (హెబ్రీ 11:7). మరియు ఆయన పూర్వకాలమందున్న లోకమును విడిచిపెట్టక భక్తిహీనుల సమూహము మీదికి జలప్రళయమును రప్పించినప్పుడు, నీతిని ప్రకటించిన నోవహును మరి యేడుగురిని కాపాడెను (2 పేతురు2:5). మనము జలప్రళయము ముందటి తరమును రెండు వర్గాలుగా విభజించగలము... నోవహు అతని భార్యయు అతని కుమారులు, అతని కోడండ్రును ఓడలోనికి ప్రవేశించి రక్షింపబడెను. వీరు మొదటి వర్గము, మరియు రెండవ వర్గమునకు చెందిన ప్రజలు ఓడ వెలుపల ఉన్నవారు తినుచు త్రాగుచు, పెండ్లిచేసికొనుచు, పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవువరకు ఎరుగకపోయిరి (మత్తయి 24:38,39).

ఇప్పుడు మనము యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు రోజులలో జీవించుచున్నాము. మనము ఈ తరములోను రెండు వర్గాల ప్రజలను చూడగలము. ఎవరు సువార్త విని దానికి విధేయులై యున్నారో వారు సురక్షితముగా నోవహు యొక్క కుటుంబము ఓడలో రక్షింపబడినట్లు సంఘముతో చేర్చబడి రక్షింపబడియున్నారు. ఎవరు దేవునికి మరియు దేవుని యొక్క వాక్యమునకు దూరముగా ఉన్నారో వారు రెండవ వర్గమునకు చెందినవారు.

"ఏలయనగా పూర్వము నుండి ఆకాశముండెననియు, నీళ్లలోనుండియు నీళ్లవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. ఆ నీళ్లవలన అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్ని కొరకు నిలువచేయబడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి" (2 పేతురు 3:5-7). అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను యెరుగరు (మత్తయి 24:36). మీ హృదయములు ఒకవేళ తిండి వలనను మత్తువలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదకి ఉరి వచ్చినట్టు రాకుండ మీ

విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. ఆ దినము భూమి యందంతట నివసించు వారందరి మీదికి అకస్మాత్తుగా వచ్చును. కాబట్టి మీరు జరగబోవు వాటినెల్లను తప్పించుకొని, మనుష్య కుమారుని యెదుట నిలువబడుటకు శక్తిగల వారగునట్లు ఎల్లప్పుడును ప్రార్ధన చేయుచు మెలకువగా ఉండుడని యేసు చెప్పెను (లూకా 21:34-36). అపోస్తులుడైన పౌలు థెస్సలోనికయుల సంఘమునకు ఈ విధముగా వ్రాసెను. "లోకులు నెమ్మదిగా ఉన్నది, భయమేమియు లేదని చెప్పుకొనుచుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంతమాత్రము తప్పించుకొనలేరు" (1 థెస్సలోనికయులు 5:3).

జలప్రళయము ముందటి తరము వారు నోవహు బోధయందు నమ్మికయుంచలేదు, దానిని లక్ష్యపెట్టలేదు. నోవహును నిర్లక్ష్యము చేసి ఎగతాళి చేసిరి. వారు తినుచు త్రాగుచు పెండ్లిచేసికొనుచు, పెండ్లికిచ్చుటలో నిమగ్నమైరి. మనము ఇప్పుడు యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడ ముందటి సమయములో జీవించుచున్నాము గనుక, రెండవ వర్గపు ప్రజలు వలె నశింపబడకుండ ఉండునట్లు మెలకువగా ఉండి దేవుని కలిసికొనుటకు మనల్ని మనము సిద్ధపరచుకొందము.

# ఒకానొక సమయమందు

## (Once upon a time)

క్రీస్తు పూర్వము 1000 సం॥రముల క్రితము దేవుని చిత్తానుసారమైన మనస్సు కలిగి యున్న యొక వీరుని గూర్చిన కథ యిది. తన తండ్రియైన యెష్షయి ఆ వీరునికి దావీదు (అనగా మిక్కిలి ప్రియమైన) అను పేరు పెట్టెను. యెష్షయి యొక్క సంతానములో దావీదు ఎనిమిదవవాడు. ఆఖరిసంతానమగు ఈ దావీదు యొక్క జీవితమును గూర్చి తన జీవితములో అతడు జరిగించిన కార్యములను గూర్చి 1,2, సమూయేలు, 1 రాజులు, 1 దినవృత్తాంతముల గ్రంథములలో బైబిలునందు మనము చదువ గలము. బైబిలు గ్రంధములో మరియే యితర వ్యక్తిని గూర్చి కూడ యింత వివరముగ వ్రాయబడి యుండలేదు. బెత్లేహేమీయుడైన ఈ బాలుడు అందమైన రూపముగలవాడు. అతడు ఎఱ్ఱని వాడును, చక్కని నేత్రములు గలవాడును, చూచుటకు సుందరమైన వాడునై యుండెను (1 సమూయేలు 16:12). అయితే దేవుడు అతని హృదయమును లక్ష్య పెట్టినందువలన సౌలు రాజు తరువాత ఇశ్రాయేలీయులకు రాజుగా అతనిని అభిషేకించెను. అతడు మంచి శరీరదారుఢ్యము కలిగి యుండుటయే గాక, విశ్వాసమందు కూడ చాల స్థిర చిత్తుడుగ యుండెను. విశ్వాసమును బట్టి మహాశూరుడగు గొల్యాతును వడిసెల రాతితో చంపెను. అందుకు దావీదు సౌలుతో ఇట్లనెను. “మీ దాసుడనైన నేను నాతండ్రి యొక్క గొఱ్ఱెలను కాయుచుండగ సింహమును ఎలుగబంటియు వచ్చి, మందలో నుండి యొక గొఱ్ఱె పిల్లను ఎత్తికొనిపోవుచుండగ, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆగొఱ్ఱెను విడిపించితిని, అది నామీదికి రాగా దాని గడ్డము పట్టుకొని దాని కొట్టిచంపితిని” (1 సమూయేలు 17:34-35). గొప్ప యోధుడైన దావీదు ఇశ్రాయేలీయులను 40 సం॥రములు పరిపాలించెను.

ఇశ్రాయేలీయుల మధుర గాయకుడైన దావీదు కీర్తనల గ్రంధములోని డెబ్బది మూడు కీర్తనలను రచించెను. యెహోవా నిబంధన మందసము దావీదు పురములోనికి రాగా ఆనందముతో దావీదు మందసము ముందు నాట్యమాడు చుండెను. యెహోవా నిబంధన మందసము దావీదు పురములోనికి రాగా సౌలు

కుమార్తె యైన మీకాలు కిటికీలో నుండి చూచి రాజైన దావీదు నాట్యమాడుటయు, వాయించుటయు కనుగొని తనమనస్సులో అతని హీనపరచెను (1 దినవృత్తాంతములు 15:29). దావీదు సౌలు రాజునకు భయపడినందున అచ్చటినుండి పారిపోయిగాతు దేశమునకు చేరెను. గాతు రాజు సేవకులు దావీదును గుర్తించుట ద్వారా ఆ దేశపు రాజునకు భయపడి నందువలన వారి యెదుట తన చర్య మార్చు కొని వెర్రివానివలె నటించుచు, ద్వారపు తలుపుల మీద గీతలు గీయుచు, ఉమ్మి తన గడ్డము మీదకు జారనిచ్చుచుండెను (1 సమూయేలు 21:13). దావీదు మంచి నటుడు కూడాను.

రాజైన దావీదు చాల **ప్రేమ గల వ్యక్తి.** సౌలు రాజు యొక్క ఆగ్రహము నుండి తన్ను రక్షించు కొనుటకుగాను మోయాబు దేశమునకు పారిపోయి ఆదేశపు రాజు చెంతకు వెళ్లి దేవుడు నాకు యేమి చేయునది నేను తెలిసికొను వరకు నా తల్లిదండ్రులు వచ్చి నీ యొద్ద నుండ నిమ్మని ఆ రాజుతో మనవి చేసికొని, అతని యొద్దకు వారిని తోడుకొని పోయెను (1 సమూయేలు 22:3). **అతడు మంచి ప్రేమ గల భర్తకూడాను.** దావీదు, బత్షెబల యొక్క ప్రథమ సంతానమైన బిడ్డచనిపోయినప్పుడు తన భార్యయైన బత్షెబను దావీదు ఓదార్చెను (II సమూయేలు 12:24). **అతడు ప్రేమ గలిగిన తండ్రి.** అబ్షాలోము తన సహోదరుడైన అమ్నోనును చంపి పారిపోయినపుడు తన కుమారుడైన అమ్నోను కొరకు దావీదు ప్రతి దినము అంగలార్చుచుండెను (2 సమూయేలు 13:37). తనపై తిరుగుబాటు చేసిన తన కుమారుడైన అబ్షాలోము మృతి చెందినపుడు కూడ అతడు ఎంతగానో దుఃఖించెను (2 సమూ 18:33). దావీదు యోనాతాను యొక్క **ప్రియమైన స్నేహితుడు.** యోనాతాను కుమారుడైన మెఫీబొషెతును కనుగొని వానిని యెరూషలేమునకు తీసికొని వచ్చి సదాకాలము రాజు బల్ల యొద్ద భోజనము చేయుటకు యేర్పాటు చేసెను. అతని కాళ్లు రెండును కుంటివి (2 సమూ 9:13).

దావీదు మంచి శిల్పకళా నైపుణ్యత గలవాడు. యెరూషలేములో దేవుని మందిరమును అతని కుమారుడు కట్టించి నప్పటికిని దాని రూపకల్పన యంతటిని తెలియజేసినవాడు దావీదే. "అప్పుడు దావీదు మంటపమునకును, మందిరపు కట్టడమునకును, బొక్కసపుశాలలకును, ప్రతిష్ఠిత వస్తువుల బొక్కసములకును, తాను యేర్పాటు చేసి సిద్ధపరచిన మచ్చులను తన కుమారుడైన సొలోమోనునకు

అప్పగించెను" (1 దిన వృత్తాంతములు 28:11-13). మరియు యాజకులును లేవీయులును సేవోపకరణముల పట్టీయును, యెహోవా మందిరపు సేవను గూర్చిన పట్టీయును దావీదు అతనికప్పగించెను. ప్రశస్త వస్తువులన్నిటి యెహోవా మందిరము కొరకు అతడు సేకరించెను. "నేను బహుగా ప్రయాసపడి నా దేవుని మందిరమునకు కావలసిన బంగారపు పనికి బంగారమును, వెండి పనికి వెండిని, ఇత్తడి పనికి ఇత్తడిని, ఇనుప పనికి ఇనుమును, కఱ్ఱ పనికి కఱ్ఱలను, గోమేధికపురాళ్లను, చెక్కుడు రాళ్లను, వింతైన వర్ణములుగల పలు వివిధములైన రాళ్లను, మిక్కిలి వెలగల నానావిధ రత్నములను, తెల్లచలువ రాయిని విశేషముగా సంపాదించితిని" (1 దినవృత్తాంతము 29:2).

మన వీరుడు చాల అసమాన్యమైన వ్యక్తిగా ఈ భూమి మీద జీవించెను. దావీదు యుద్ధమందు జీవించెను. దావీదు ఒక యుద్ధమందు ఒక వడిసెల రాతితో జయమును పొందెను. "అప్పుడు యెహోవా కత్తిచేతను, ఈటెచేతను రక్షించువాడు కాడని ఈ దండు వారందరు తెలిసికొందురు. యుద్ధము యెహోవాదే; ఆయన మిమ్మును మాచేతికి అప్పగించును" (1 సమూ 17:47). యెహోవా చేత అభిషేకము నొందిన రాజైన సౌలు రెండుసార్లు తన చేతికి చిక్కినను అతనిని చంపుటకు నిరాకరించెను. శత్రువు చేతికి చిక్కినట్లయిన ఏ మనుష్యుడైన అతనికి హాని చేయకుండ విడిచిపెట్టునా? (1సమూ 24:10,19). తనకు పుట్టిన బిడ్డ రోగియై యుండినపుడు ఉపవాసములో నేలపై పడి యుండి దేవునిని బ్రతిమాలుకొని బిడ్డ చనిపోయెనని తెలుసుకొని నేలనుండి లేచి స్నానము చేసి, తైలము పూసికొని వేరు వస్త్రములు ధరించి యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి తన యింటికి తిరిగి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి. అప్పుడు అతడు భోజనము చేసెను (2 సమూయేలు 2:15-23). ఈ విధముగ చేయుట ద్వారా దావీదు తన సేవకులకందరికి ఎంతో ఆశ్చర్యమును కలిగించెను.

తన కుమారుడైన అబ్షాలోము దావీదు పై తిరుగుబాటు చేసిన సమయములో దావీదు బయటకు పోవుచున్నప్పుడు షిమీ అనునతడు దావీదు వెంటనడచుచు, దావీదును శపించుచు దావీదు మీదను అతని సేవకులందరి మీదను రాళ్లు రువ్వు చుండినను దావీదు షిమీని స్వేచ్ఛగ విడిచిపెట్టెను (2 సమూయేలు 16:11-14). దావీదు యొక్క మరియొక అసాధారణమైన వ్యక్తిత్వమేమనగా ముగ్గురు యోధులైన సైనికులు ఫిలిష్తీయుల దండులోనికి చొరబడి పోయి

బెత్లెహేము ఊరి గవిని యొద్ద బావి నీళ్లు చేదుకొని దావీదు కొరకు తీసుకునిరాగా దావీదుకు ఆ నీళ్లు త్రాగుటకు మనసు లేక యెహోవాకు అర్పితముగ వాటిని పారబోసెను (2 సమూయేలు 23:16; 1 దినవృత్తాంతములు 11:17-19). తెగులు మనుష్యులకు తగులకుండ నిలిచిపోవునట్లు దావీదు యెహోవా బలి పీఠమును కట్టి బలుల అర్పించుటకు సమాయత్తమగు చుండగ అరౌనా బలిపీఠమునకు స్థలమును, దహన బలులు అర్పించుటకు ఎడ్లను, నూర్చుటకు కఱ్ఱ సామానులును దావీదునకు యిచ్చుటకు మనస్కరింపగా, రాజు – నేనాలగు తీసికొనను వెలయిచ్చినీ యొద్ద కొందును, వెల ఇయ్యక నేను తీసికొనిన దానిని నాదేవుడైన యెహోవాకు అర్పించనని చెప్పి ఆ కళ్లమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను (2 సమూ 24:24). దావీదు హిత్తీయుడైన ఊరియా సంగతి యందు తప్ప తన జీవిత దినములన్నియు యెహోవా అతనికిచ్చిన ఆజ్ఞలలో దేని విషయమందును తప్పిపోకుండెను (1 రాజులు 15:4).

దేవుని చిత్తాను సారమైన మనస్సుగల ఈ మనుష్యుని దేవుడు బహుగా ఆశీర్వదించెను. అతడు ఇశ్రాయేలీయులను నలుబది సంవత్సరములు పరిపాలించెను. నీమట్టుకు నీ సంతానమును, నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అని యెహోవా దేవుడు దావీదునకు తెలియజేసెను (2 సమూ 7:16). యెహోవా దావీదును బహుగా వృద్ధిపొందించి అతనిని ఒక కొలమానికగ చేసెను. అతని వంశీయులు ఒకరి తరువాత మరియొకరు యూదాను పరిపాలించిరి.

దావీదు వంశములో నుండియే మన ప్రభువైన యేసు క్రీస్తు జన్మించెను. క్రీస్తు పూర్వము 700 సంవత్సరములు క్రితమే ప్రవక్తయైన యెషయా ఈ విధముగ ప్రవచించెను. అదేమనిన "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు. నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6). "ఇది మొదలుకొని మితి లేకుండ దానికి వృద్ధియు, క్షేమము కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును, రాజ్యమును నియమించును. న్యాయము వలనను నీతి వలనను రాజ్యమును స్థిరపరుచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్య పరిపాలన చేయును. సైన్యములకు అధిపతియగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని

నెరవేర్చును" ( యెషయా 9:6-7). యేసు ప్రభువు పుట్టక ముందు దూత ఈ విధంగ తెలియపరచెను. "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారు డనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును. ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును అని చెప్పెను" (లూకా 1:32-33). మన ప్రభువైన యేసు రాజాధిరాజుగ ఆయన దావీదు సింహాసనమునధిష్టించి రాజ్యపరిపాలన చేయుచున్నారు. నేను దావీదువేరు చిగురును, సంతానమును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునై యున్నాను (ప్రకటన 22:16) అని మన ప్రభువైన యేసు చెప్పుచున్నారు. నేను జయించి నా తండ్రితో కూడ ఆయన సింహాసన మందు కూర్చుండి యున్న ప్రకారము జయించు వానిని నాతోకూడ నా సింహాసనమందు కూర్చుండ నిచ్చెదను అని ఆయన వాగ్దానము చేయుచున్నారు (ప్రకట 3:21). మరణము వరకు నమ్మకముగ యుండుము - నేను నీకు జీవకిరీటమిచ్చెదను (ప్రక 2:10). మంచి పోరాటము పోరాడితిని. నా పరుగుకడముట్టించితిని. విశ్వాసము కాపాడుకొంటిని ఇక మీదట నా కొరకు నీతికిరీట ముంచబడియున్నది (2 తిమోతి 4:7).

దావీదు సింహాసనముపై అధిష్టించియున్న మన ప్రభువైన యేసు క్రీస్తు చెంతయుండుటకు, నీవు జీవకిరీటమును, స్థలమును సంపాదించుకొనుటకు నీవు సిద్ధపడియుంటివా?

# శక్తికి మించిన ప్రయాణము

## (The Journey is Too Great)

పాత నిబంధన ప్రవక్తలలో మోషే తరువాత ఏలియాను గూర్చి క్రొత్తనిబంధనలో పలుమార్లు చెప్పబడింది. బాప్తిస్మమిచ్చు యోహాను ఏలియావంటి ఆత్మగలవాడని చెప్పబడింది. రూపాంతర సమయంలో అతడు యేసుకు ప్రత్యక్షమయ్యాడు, అతని గూర్చి యేసు లూకా 4:25లోను, పౌలు రోమా 11:2 లోను, యాకోబు పత్రిక 5:17లోను చెప్పడం జరిగింది. ఇశ్రాయేలు రాజగు ఆహాబు కాలంలో దేవుడు ఈ ప్రవక్తను నిలబెట్టారు. అతని ప్రవచనమును బట్టి ఇశ్రాయేలులో 3½ సంవత్సరములు వర్షము కురియలేదు. ఈ క్షామకాలంలో ఇశ్రాయేలు దేశమంతా శ్రమపడినను ఈ ప్రవక్తను పోషించడానికి దేవుడు ఏర్పాట్లు చేసారు. మొదట కాకోలముల ద్వారా దేవుడతని పోషించారు. తరువాత సారెపతులో యున్న ఒక విధవరాలి దగ్గరకు ఆయన అతని పంపించాడు. మరల అతడు ప్రార్ధన చేయగా ఇశ్రాయేలులో వర్షము కురిసింది. అతడు భయము లేకుండా రాజు నెదుర్కొన్నాడు. నాలుగువందల యాభైమంది బయలు దేవతా ప్రవక్తల నతడు సవాలు చేసాడు, ఆ సవాలు నతడు జయించిన తరువాత 450 మంది బయలు దేవతా ప్రవక్తలందరిని కీషోను వాగు దగ్గర వధించాడు. ఏలియా చేసినదంతయు క్రూరురాలైన యెజెబెలుకు తెలియగా అతని చంపుదునని ఆమె అతనికి వర్తమానము పంపెను.

ఇక్కడ ఏలియా వింతప్రవర్తనను మనం గమనించగలము. అతడు నిర్భయంగా రాజు నెదుర్కొన్నాడు, ఏకాకిగా 450 మంది బయలు ప్రవక్తలను సవాలు చేసాడుగాని యెజెబెలున కతడుభయపడి ప్రాణభయము కలిగి బెయేర్షెబాకు చేరి తాను ఒకదిన ప్రయాణము అరణ్యములోనికి పోయి ఒక బదరీ వృక్షముక్రింద మరణాపేక్ష గలవాడై ఆ వృక్షముక్రింద పరుండి నిద్రించుచుండగా "ఒక దేవదూత వచ్చి అతని ముట్టి నీవులేచి భోజనము చేయుమని చెప్పెను... గనుక అతడు భోజనముచేసి తిరిగి పరుండెను. అయితే యెహోవా దూత రెండవ మారు వచ్చి అతని ముట్టి – నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమైయున్నది, నీవు లేచి భోజనము చేయుమని చెప్పినపుడు అతడు లేచి భోజనము చేసి ఆ భోజనము బలముచేత నలుబది రాత్రింబగళ్లు ప్రయాణము చేసి దేవుని పర్వతమని పేరు పెట్టబడిన హోరేబునకు

వచ్చెను" (1రాజులు 19:5-8).

## క్రైస్తవుని ప్రయాణం

ఒకడు దేవుని వాక్యమును నమ్మి, విధేయత చూపుచు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు అతడు క్రైస్తవునివలె తన ప్రయాణము నారంభించును. యేసు, "నేనే మార్గమును సత్యమును జీవమును నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడని" చెప్పారు (యోహాను 14:6). తండ్రి యొద్దకు వెళ్లాలంటే మనకొక దీర్ఘ ప్రయాణమున్నది. యిది మన శక్తికి మించినది. ఈ లోకంలో శిశువు జన్మించిన తరువాత ఆహారం లేకుండా ఎట్లు బ్రదుకలేడో అట్లే మన ప్రభువు యొక్క ఆత్మీయ రాజ్యములోనికి జన్మించినవాడెవడు ఆత్మీయాహారము లేకుండా బ్రదుకలేడు. అందువలన "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి" యని పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 2:2).

## క్రైస్తవుని ఆహారం

ప్రభువతని కనుగ్రహించిన ఆహారాన్ని ఏలియా భుజించి బలము పొంది దేవుని పర్వతమును చేరుటకు నలుబది రేయింబగళ్లు ప్రయాణం చేసాడు. క్రైస్తవులవలె మనం చేయు ప్రయాణంలో దేవుని పర్వతమునకు చేరుటకు మనకు కూడ శక్తి అవసరం. ఏలయనగా మన ప్రయాణం శక్తికిమించినదే. గనుకనే ప్రభువు తాను మనకిచ్చే ఆహారాన్ని భుజించుడని చెప్పుచున్నారు; అదే దేవుని వాక్యం.

క్రైస్తవ యాత్ర నారంభించిన తరువాత అనేకులు మార్గములో పడిపోతారు. ఎందుచేత? తమ యాత్ర నంతటినీ జరిగించుటకు వారిలో బలములేదు. ప్రభువు అనుగ్రహించు ఆహారాన్ని వారు భుజించరు గనుక వారికి బలము, లేక శక్తియుండదు. మన జీవితాల్లో సరిపడినంత బైబిలు పఠనం లేకపోవుటయే మన బలహీనతకు మూల కారణం. మనం పాపములో పడకుండు నిమిత్తము ప్రభువు తన వాక్యముద్వారా మనల్ని నడిపిస్తారు, బలపరుస్తారు.

## దేవుని వాక్యం ఇచ్చే శక్తి

"మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు; నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువని"

యేసుప్రభువు చెప్పారు (మత్త 12:36, 37). ఈ వాక్యము మన హృదయములో నివసించినయెడల నోటిద్వారా మనము పాపము చేయకుందుము. అది దుర్భాషలాడకుండ, ఇతరులను నిందించకుండ, అబద్ధములాడకుండ మన నాలుకను అదుపులో యుంచును. మరల నీ శత్రువులను, నీ పొరుగువానిని ప్రేమించుమని దేవుని వాక్యం చెబుతున్నది. మనమట్లు చేసినపుడు యితరులకు ఏ హానియు చేయకుందుము. మనము పాపములో పడకుండ దేవుని వాక్యము సహాయం చేస్తాది. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను" అని అందుకే దావీదు చెప్పాడు (కీర్తన 119:11).

## క్రైస్తవుని ఆదరణ

ఆపదలో దేవుని వాక్యము మనకు ఆదరణ నిస్తాది. "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీకు నాకు తోడైయుందువు. నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును" (కీర్తన 23:4). "యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును" (సామె 18:10). "యెహోవా ఉత్తముడు, శ్రమదినమందు ఆయన ఆశ్రయ దుర్గము. తనయందు నమ్మిక యుంచువారిని ఆయన ఎరుగును" (నహూము 1:7). మన ఆపత్కాలములో ఆదరణ నిచ్చుయిట్టి వాక్యముల నెన్నిటినో మనం కనుగొనగలము. దేవుని వాక్యము మనకు నిత్యజీవ నిరీక్షణ ననుగ్రహిస్తాది. ఆయన మార్గములో నమ్మకముగా యుండునట్లు సహాయపడ్తాది. దేవుని వాక్యం దేవునియొక్క ఘనతను, మహిమను, ఆయన శక్తిని మనకు తెలియజేస్తాది. భూమి సూర్య చంద్ర నక్షత్రాదులు కల్గిన విధానాన్ని తెలియజేస్తూ దేవుని బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులగునట్లు అది మనకు సహాయం చేస్తాది.

బైబిలు చదవడానికి మనకు సమయం దొరుకుట లేదని సాకులు చెప్పేస్తాం. గాని యెహోవా ధర్మశాస్త్రమునందానందించుచు దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు (కీర్తన 1). మనం విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొంది, క్రైస్తవ యాత్ర నారంభించినను, బలము లేనియెడల, ఆ ప్రయాణంలో నిలువలేము. లిఖింపబడిన దేవుని వాక్యము (బైబిలు) మన ప్రయాణానికి కావలసినంత శక్తి నిచ్చును. గనుక ప్రతి దినము జీవాహారమును భుజించుచు, బలము పొంది దేవుని పర్వతమునొద్దకు మనం చేరుకొందుము గాక!

# దేవుడు హిజ్కియా మొర వినెను

## (God Heard Hezekiah's Prayer)

దక్షిణ రాజ్యమయిన యూదాను ఏలిన మంచి రాజులలో హిజ్కియా ఒకడు. ఆతనిని గురించి బైబిలు మంచిగా చెబుతుంది. “తన పితరుడైన దావీదు చేసినట్లు అతడు యెహోవా దృష్టికి పూర్ణముగా నీతిననుసరించెను. ఉన్నత స్థలములను కొట్టివేసి విగ్రహములను పగులగొట్టి దేవతా స్థంభములను పడగొట్టి మోషే చేసిన ఇత్తడి సర్పమును చిన్నాభిన్నములుగా చేసెను. దానికి ఇశ్రాయేలీయులు నెహుష్టానను పేరుపెట్టి దానికి ధూపము వేయుచు వచ్చుచుండిరి. అతడు ఇశ్రాయేలీయుల దేవుడైన – యెహోవా యందు విశ్వాసముంచిన వాడు; అతని తరువాతవచ్చిన యూదా రాజులలోను అతని పూర్వికులైన రాజులలోను అతనితో సమమైన వాడు ఒకడును లేడు. అతడు యెహోవాను హత్తుకొని, ఆయనను వెంబడించుటలో వెనక తీయక ఆయన మోషేకు ఆజ్ఞాపించిన ఆజ్ఞలన్నీటిని గైకొనుచుండెను” (II రాజులు 18:3–6; II దిన 29:25).

ఆతని పాలనలోని మొదటి సం॥మందు మొదటి నెలలో ఆతడు దేవుని ఇంటి తలుపులు తెరిపించి బాగుచేయించి యాజకులను, లేవీయులను పిలువనంపించి దేవుని మందిరమును పరిశుద్ధపరచ నాజ్ఞాపించెను. “ఇప్పుడు మన మీదనున్న ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మహోగ్రత చల్లారునట్లు ఆయనతో మనము నిబంధన చేయవలెనని నా మనస్సులో అభిలాష పుట్టెను.... పవిత్ర పరుచుటకై యాజకులు యెహోవా మందిరపు లోపలి భాగమునకు పోయి యెహోవా మందిరములో తమకు కనబడిన నిషిద్ధ వస్తువులన్నిటిని యెహోవా మందిరపు ఆవరణలోనికి తీసికొని రాగా...”, (II దిన 29:10–16). రాజైన హిజ్కియా యొక్క మొదటి కర్తవ్యం దేవుని మందిరం పవిత్రపరచి మందిర సేవను పునరుద్ధరించుట. ఆతని పాలనలోని మొదటి నెల మొదటి రోజున ఆతడు ఆపనిని ప్రారంభించాడు. 16వ దినమున పని ముగించబడింది.

రాజైన హిజ్కియా పెందలకడలేచి పట్టణపు అధికారులను సమకూర్చుకొని యెహోవా మందిరమునకు పోయెను (20). దహన బలియు, పాప పరిహారార్ధబలియు బలిపీఠము మీద అర్పింపబడెను. సర్వసమాజము ఆరాధించెను, గాయకులు పాడిరి. వాయిద్యములు వాయించిరి (28వ). ఈ

లాగున యెహోవా మందిరము యొక్క సేవ క్రమముగా జరిగెను (35వ). రాజైన హిజ్కియాయు జనులందరును సంతోషించిరి (36).

హిజ్కియా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు పస్కాపండుగ ఆచరించుటకై యెరూషలేముకు రావలసినదని యూదావారికందరికిని వర్తమానములను పంపెను. ఎందుకనగా బహుకాలమునుండి వ్రాయబడిన ప్రకారము యెహోవాకు పస్కాపండుగ ఆచరించుటలేదు (II దిన 30:1,5). వర్తమానికులు యూదా అంతా, ఇశ్రాయేలు రాజ్యమంతా ప్రకటించినపుడు కొందరు నవ్వి అపహసించారు గాని కొందరు తమ్మును తాము తగ్గించుకొని పస్కాను ఆచరించుటకు యెరూషలేముకు వచ్చారు.

"కావున రెండవ నెలయందు పులియని రొట్టెల పండుగ నాచరించుటకై అతి విస్తారమైన సమాజముగా బహుజనులు యెరూషలేములో కూడిరి" (II దిన 30:13). సమాజములలో తమ్మును తాము ప్రతిష్టించుకొనని వారు అనేకులున్నారు, ఎఫ్రాయీము, మనష్షే, ఇశ్శాఖారు, జెబూలూను దేశములనుండి వచ్చిన జనులలో చాలామంది తమ్మును తాము ప్రతిష్టించుకొనకయే విధి విరుద్ధముగా పస్కాను భుజింపగా హిజ్కియా పరిశుద్ధ స్థలము యొక్క శు ద్ధీకరణము చొప్పున తన్ను పవిత్రపరుచుకొనకయే తన పితరుల దేవుడైన యెహోవాను ఆశ్రయింప మనస్సు నిలుపుకొనని ప్రతివాని నిమిత్తము దయగల యెహోవా ప్రాయశ్చిత్తము చేయునుగాక అని ప్రార్థింపగా యెహోవా హిజ్కియా చేసిన ప్రార్ధన అంగీకరించెను. ప్రజలు పస్కాను భుజించిరి ఎందుకనగా మంచిరాజు వారికొరకై ప్రార్థించినందువల్ల. దయగల దేవుడు అతని ప్రార్ధన అంగీకరించారు. ఇశ్రాయేలు రాజును దావీదు కుమారుడునైన సొలొమోను కాలము తరువాత ఈలాగున జరిగియుండలేదు గనుక యెరూషలేము కాపురస్తులకు మిక్కిలి ఆనందము కలిగెను. అప్పుడు లేవీయులైన యాజకులు లేచి జనులను దీవింపగా వారి మాటలు వినబడెను, వారి ప్రార్ధన ఆకాశమున నున్న పరిశుద్ధ నివాసమునకు చేరెను.

పస్కా పండుగ జరుపుకొనిన తరువాత ఇశ్రాయేలు వారందరును యూదా పట్టణములకు పోయి, యూదా దేశమంతటను, బెన్యామీను ఎఫ్రాయీము మనష్షే దేశములయందంటను ఉన్న విగ్రహములను నిర్మూలము చేసి దేవతా స్థంభములను ముక్కలుగా నరికి, ఉన్నత స్థలములను, బలిపీఠములను పడగొట్టిరి.

రాజైన హిజ్కియా యెవరి సేవాధర్మము వారు జరుపుకొనునట్లుగా యాజకులను వరుసల ప్రకారముగాను, లేవీయులను వారివారి వరుసల ప్రకారముగాను నియమించెను; ఉదయాస్తమయములలో దహనబలులను, విశ్రాంతిదినముల కును, అమావాస్యలకును, పండుగులకును అర్పించుటకై రాజు యొక్క ఆస్తినుండి ఒక భాగమును రాజు ఏర్పాటు చేసెను. యాజకులకు లేవీయులకు కానుకలు తీసికొని రావలసినదని యెరూషలేము ప్రజలకు ఆజ్ఞాపించాడు. వారు దశను భాగములు తెచ్చారు. విస్తారముగా తెచ్చారు. "హిజ్కియా యూదా దేశమంతటను ఈలాగున జరిగించి, తన దేవుడైన యెహోవా దృష్టికి అనుకూలముగాను యదార్థముగాను నమ్మకముగాను పనిచేయుచు వచ్చెను. తన దేవుని మందిర సేవ విషయమందేమి ధర్మశాస్త్రమంతటి విషయమందేమి తాను ఆరంభించిన ప్రతి పని అతడు హృదయపూర్వకముగా జరిగించి వర్ధిల్లెను. (II దిన 31:20-21).

ఆతని పాలన 14వ సం॥న అష్షూరు రాజైన సన్హెరీబు వచ్చి యూదా దేశములో ప్రాకారపురముల యెదుట దిగి వాటిని లోపరచుకొన జూచెను. హిజ్కియాను భయపెడుతూ ఒక ఉత్తరమును ఆతడు రాజుకు పంపాడు. రాజైన హిజ్కియా వర్తమానికుడు తెచ్చిన ఉత్తరమును తీసికొని చదివి దేవుని మందిరమునకు వెళ్లి దేవుని ఎదుట ఆ ఉత్తరమును పరచి దేవునికి ఈ లాగు ప్రార్థించెను - "యెహోవా... ఇశ్రాయేలీయుల దేవా... నీవులోకమందున్న సకల రాజ్యములకు దేవుడవైయున్నావు" (2 రాజు 19:14, 18,19). "ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్ను విడిపించెదను నీవు నన్ను మహిమ పరచెదవు" (కీర్త 50:15) అని చెప్పారు కదా ప్రభువు! రాజైన హిజ్కియా ప్రార్థించాడు. యెహోవా దూత అష్షూరు దండులోని ఒక లక్ష ఎనుబది ఐదువేల మందిని చంపాడు. అష్షూరు రాజుకైననూ అతనితో కూడుకున్న సైన్యమంతటి కైనను మీరు భయపడవద్దు, విస్మయమొందవద్దు, అతనికి కలిగియున్న సహాయము కంటె ఎక్కువ సహాయము మనకు కలదు ...... మన దేవుడైన యెహోవా మనకు తోడుగా ఉన్నాడు" అని చెప్పాడు (II దిన 32:7-8). దేవుడు హిజ్కియా ప్రార్థన విని అష్షూరు రాజైన సన్హెరీబు చేతినుండి ఆతనిని తప్పించారు.

హిజ్కియాకు మరణకరమైన రోగము సంభవించింది. ప్రవక్తయైన యెషయా ద్వారా దేవుడు అతనికి ఇలా తెలియజేసారు - "నీవు మరణమవుచున్నావు, బ్రతకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టు కొనుము". అప్పుడతడు తన ముఖము

గోడ తట్టు త్రిప్పుకొని దేవునికి ఈలాగు ప్రార్థన చేసెను – "యెహోవా, యదార్థ హృదయుడనై, సత్యముతో నీ సన్నిధిని నేనెట్లు నడుచుకొంటినో, నీ దృష్టికి అనుకూలముగా సమస్తమును నేనెట్లు జరిగించితినో కృపతో జ్ఞాపకము చేసికొనుమని హిజ్కియా కన్నీళ్లు విడుచుచు ప్రార్థించెను" (II రాజులు 20:13; యెషయా 36:1–3). దేవుడైన యెహోవా హిజ్కియా ప్రార్థన ఆలకించి వెంటనే జవాబిచ్చారు. "యెషయా నడిమిశాలలోనుండి అవతలకు వెళ్లకమునుపే యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను. నీవు తిరిగి నా ప్రజలకు అధిపతియైన హిజ్కియా యొద్దకు పోయి అతనితో ఇట్లనుము – నీ పితరుడైన దావీదునకు దేవుడైన యెహోవా నీకు సెలవిచ్చునదేమనగా – నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని, నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను. నేను బాగుచేసెదను. మూడవ దినమున నీవు యెహోవా మందిరమునకు ఎక్కిపోవుదువు" (2 రాజులు 20:4,5; యెషయా 38:4,5). ఆయన ఆతని ఆయుష్షు పదిహేను సంవత్సరములు పెంచారు.

రాజైన హిజ్కియా యదార్థ హృదయముతో సత్యముతో నడుచుకున్నాడు. దేవుని దృష్టిలో ఏది మంచిదో దానిని చేసాడు. దేవుని ఇంటిని గూర్చిన ఆసక్తి ఆతని హృదయంలో గలదు (కీర్త 69:9). "యెహోవా యొద్ద ఒక వరమడిగితిని, దానిని నేను వెదుకుచున్నాను, యెహోవా ప్రసన్నతను చూచుటకును, ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవిత కాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్త 27:4) అని దావీదు చెబుతున్నాడు (23:6). "నీ మందిరమునందు నివసించు వారు ధన్యులు, వారు నిత్యము నిన్ను స్తుతించుదురు" (కీర్త 84:4). యెహోవా నీ నివాసమందిరమును, నీ తేజోమహిమ నిలుచు స్థలమును నేను ప్రేమించుచున్నాను". (కీర్త 26:8)

దేవుని ఇంటిలో నివసించు ఆయన పిల్లల యొక్క ప్రార్థన దేవుడు వింటారు. (I తిమోతి 3:15). ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి" (I పేతురు 3:12).

# రాజైన యెహోషాపాతు యొక్క ప్రఖ్యాతి, పతనము

(The Rise and Fall of King Jehoshaphat)

సౌలు, దావీదు, సొలొమోనులు సమైక్య ఇశ్రాయేలు రాజ్యమును ఒక్కొక్కరు నలువది సంవత్సరములు మట్టుకు పాలించిరి. సొలొమోను తరువాత అది ఉత్తర రాజ్యముగను, దక్షిణ రాజ్యముగను విభజింపబడెను. ఉత్తరాన్న ఉన్న ఇశ్రాయేలు రాజ్యములో పది గోత్రములుండగా, దక్షిణాన్న యూదా రాజ్యములో దావీదు వంశస్థులగు రెండు గోత్రములుండిరి. ఇశ్రాయేలు దేశమును పాలించిన రాజులందరు దేవుని దృష్టిలో దుర్మార్గులైరి. వారు విగ్రహముల నారాధించుచు విగ్రహారాధనను ప్రోత్సహించిరి. యూదయను పాలించిన వారిలో కొంతమంది మంచి వారుండిరి. వారిలో యెహోషాపాతు ఒకడు.

యెహోషాపాతు యూదయను 25 సంవత్సరముల మట్టుకు జ్ఞానము గలవాడై పాలించెను. అతడనేక సంస్కరణలను ప్రవేశపెట్టెను. అతడు లేవీయులను, యాజకులను, ఉపదేశకులను దేవుని ధర్మ శాస్త్రమునుపదేశించుటకు ఆయా పట్టణములకు పంపుచుండెను. తద్వారా ప్రజలను దేవునివైపు మళ్లించుటకు ప్రయత్నించెను. "యెహోషాపాతు యెరూషలేములో నివాసము చేయుచు బేయేర్షెబా నుండి ఎఫ్రాయీము మన్యము వరకు జనుల మధ్యను సంచరించుచు, వారి పితరుల దేవుడైన యెహోవావైపు వారిని మళ్లించెను. మరియు అతడు ఆయా పట్టణములలో... న్యాయాధిపతులను నిర్ణయించెను" (2 దినవృ 19:4,5). అతడు తన పితరుల మార్గములో నడిచెను గనుక దేవుడతనికి తోడైయుండెను. దావీదు వలె అతడును బయలు దేవతను గాక యెహోవా దేవుని నారాధించెను. అతడు తన పితరుల మార్గములో నడుచుచు, ఇశ్రాయేలు వలె గాక దేవుని ఆజ్ఞలను పాటించెను. అతడు తన రాజ్యమును స్థిరపరచెను. యూదావారందరు అతనికి బహుమానము లిచ్చిరి. ఫిలిష్తీయులలో కొందరును, అరబీయులును అతనికి పన్నును, కానుకలను ఇచ్చుచు వచ్చిరి. అందువలన అతనికి ఐశ్వర్యమును, ఘనతయు అధికముగా కలిగెను. దేవుని మార్గములో నడుచుటకు అతని హృదయము సంతోషించెను. అతడు ఉన్నత స్థలములను దేవతా స్థంభములను యూదాలో నుండి తీసివేసెను (2 దినవృ 17:3-6).

## రాజు యొక్క ప్రఖ్యాతి

2 దిన వృత్తాంతములు 18వ అధ్యాయములో అతడు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో కలిసి రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు వెళ్లవచ్చునో లేదో యని దేవుని విచారించినట్లు మనము కనుగొనగలము. అయితే దేవుని ప్రవక్తయగు మీకాయా యొక్క సలహాకు వేరుగా వారు యుద్ధమునకు పోయిరి. ఆ యుద్ధములో ఇశ్రాయేలు రాజగు ఆహాబు చనిపోయెను.

యెహోషాపాతు అంతకంతకు గొప్పవాడై యూదా దేశము నందు కోటలను, సామాగ్రిని నిలువచేయు పట్టణములను కట్టించెను. అతని క్రింద పరాక్రమశాలులైన సైన్యముండెను (2 దినవృ 17:12-19).

మోయాబీయులును, అమ్మోనీయులును, మెయోనీయులలో కొందరును దండెత్తి యెహోషాపాతు మీదికి రాగా అతడు భయపడి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొనెను. యూదా అంతట ఉపవాస దినము ఆచరింపవలెనని ప్రకటింపగా ప్రజలందరు యెరూషలేములో దేవుని సహాయము సభ్యర్ధించుటకు గాను కూడుకొనిరి. ఆసాపు, సంతతివాడును లేవీయుడునగు యహజీయేలు మీదికి దేవుని ఆత్మరాగా, అతని ద్వారా ప్రభువు వారికి విజయాన్ని వాగ్దానం చేసెను.

అంతటవారు ఉదయముననే లేచి తెకోవ అరణ్యమునకు పోయిరి. యెహోషాపాతు జనులను హెచ్చరిక చేసి యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందరనడుచుచు, యెహోవా కృప నిరంతర ముండును, ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను. వారు పాడుటకును స్తుతించుటకును మొదలు పెట్టగా యెహోవా యూదా వారి మీదికి వచ్చిన అమ్మోనీయుల మీదను మోయాబీయుల మీదను శేయీరు మన్యవాసుల మీదను మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి. దేవునికి స్తుతి గానము చేయుచు వారు యుద్ధము జయించిరి. సరిగదా శత్రుశవములు యొద్ద విస్తారమైన ధనమును, ప్రశస్తమైన నగలును వారికి కనబడెను. వారు కొంచుపోలేనంత విస్తారమైన ధనము వారి వశమాయెను. కొల్లసొమ్ము విస్తారమైనందున దానిని కూర్చుటకు మూడు దినములు పట్టెను. ఇశ్రాయేలీయుల శత్రువులతో యెహోవా యుద్ధము చేసెనని దేశముల రాజ్యనివాసులు వినగా దేవుని భయము వారందరి మీదికి వచ్చెను. ఈ ప్రకారము అతని దేశపు చుట్టువున్న వారిని జయించి అతనికి నెమ్మది

ననుగ్రహింపగా యెహోషాపాతు రాజ్యము నిమ్మళముగా నుండెను. దేవునితో అతడు సహవాసము కలిగి యున్నంతవరకు దేవుడతనికి తోడైయుండెను.

## రాజు యొక్క పతనము

యెహోషాపాతు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో వియ్యమందినందున దేవుని ఉగ్రతను తనమీదికి తెచ్చుకొనెను. ఆహాబుతో కలసి అతడు రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు పోయెను. ఆ యుద్ధములో ఆహాబు చనిపోగా, దీర్ఘ దర్శియగు యెహూ నీవు భక్తిహీనులకు సహాయము చేసి యెహోవా శత్రువులకు స్నేహితుడవైతివి గదా? అందువలన యెహోవా సన్నిధినుండి కోపము నీ మీదికి వచ్చునని చెప్పెను (2 దినవృ 19:2). యెహోషాపాతు తన పాలన చివరిభాగములో మిక్కిలి దుర్మార్గముగా ప్రవర్తించిన అహజ్యాతో స్నేహము చేసెను. అప్పుడు మారేషా వాడును దోదావాహు కుమారుడునగు ఎలీయెజెరు – నీవు అహజ్యాతో స్నేహము చేసికొంటివి గనుక యెహోవా నీ పనులను భంగము చేయునని యెహోషాపాతు మీద ప్రవచనమొకటి చెప్పెను (2 దినవృ 20:35–37).

యెహోషాపాతు దేవునితో నడిచినంత కాలము ఆశీర్వదించబడెను ధనికుడయ్యెను. అయితే దుర్మార్గులైన రాజులగు ఆహాబు, అహజ్యాలతో అతడు ఏకీభవించినప్పుడు ఆయన దృష్టికి కీడు చేసిన వాడాయెను.

ఆవిధేయతను బట్టి సౌలు రాజు శిక్షించబడెను. వ్యభిచార కారణము వలన దావీదు శిక్షననుభవించెను. సొలొమోను అన్యస్త్రీలను వివాహమాడినందున ఇశ్రాయేలు దేశము రెండు ముక్కలాయెను. ఇశ్రాయేలు దేశపు దుర్మార్గ రాజులతో సహవాసము చేసినందున యెహోషాపాతు శిక్షించబడెను.

"మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసికి విశ్వాసితో పాలెక్కడిది?" యని అపొ, పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీ 6:14–16). హానోకు దేవునితో నడిచెను గనుక దేవుడతని కొనిపోయెను. విగ్రహారాధికులతో సాంగత్యము చేయకుండు నిమిత్తము అబ్రాహామును దేవుడు పిలిచెను. అతడు దేవునికి లోబడి ఈ లోక జనాంగము లన్నిటికి దీవెనకు కారకుడాయెను. పోతీఫరు భార్యతో సహవసించ నందున యోసేపు దీవించబడెను, ఐశ్వర్యవంతుడాయెను. మోషే, అల్పకాలము

పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి ఫరో కుమార్తె యొక్క కుమారుడనని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు" (హెబ్రీ 11:24–25). యెహోషువాయు, అతని కుటుంబమును విగ్రహములను గాక సజీవుడైన దేవుని సేవించుటకు ఎంచుకొనెను.

## దుష్ట సాంగత్య ఫలితము

దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపునని వారందరు ఎరుగుదురు (I కొరింథీ 15:33). దుష్టుల నుండి మనం దూరముగా యుండాలని ప్రభువు మనకు తరచు హెచ్చరిక చేయుచున్నారు. ఏలయనగా పులిసినపిండి కొంచెమైనను ముద్ద అంతయు పులిచేయును (గలతీ 5:9).

హవ్వ దేవుని సహవాసమును వీడి అపవాది మాటలకు లోబడినప్పుడు పాపములో పడింది. శిక్షించబడింది. ఏశావు అన్య స్త్రీలను వివాహమాడి శ్రమల పాలయ్యెను. పరాక్రమశాలుడైన సంసోను దుష్టుల ఆలోచన చొప్పున నడిచి, పాపుల మార్గమున నిలిచి, అపహాసకులు కూర్చుండు చోట కూర్చొని పతనమయ్యెను.

దుష్ట సాంగత్యము అపాయకరము. దుష్టులతో సహవాసము చేస్తే యెహోషాపాతుకు జరిగినట్లు దేవుని ఉగ్రతమన మీదికి వచ్చును. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలవుటకు నియమించలేదు" (I థెస్స 5:9). మానవులను రక్షించుటకు తండ్రియైన దేవుడు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందిన వారు రక్షింపబడుదురు. సంఘముతో చేర్చబడుదురు. నిత్యజీవమునకు వారసులదురు "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము; అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము" (రోమా 6:23). "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు" (రోమా 8:1).

"ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" అని యేసు ప్రభువు చెప్పెను (యోహాను 15:6).

మనం క్రీస్తులోయుంటూ లోకముతో సాంగత్యము చేయలేము. మరణ పర్యంతము మనము క్రీస్తుతో ఆయన వాక్యము ద్వారాను, ప్రార్థన ద్వారాను సహవాసము కలిగియుండాలి. ఆదిమ సంఘము ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

పరిశుద్ధులతో మనం సహవాసం కలిగియుంటే, బలపడగలము. గాని దుష్టులతో సాంగత్యం చేస్తే దేవుని ఉగ్రతకు పాలవుదుము. "ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీ రెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగునని" యాకోబు చెప్పెను. (యాకోబు 4:4). నీవు దేవుని మిత్రుడవా? లేక శత్రువువా? దేవుడు నీ పక్షమున యుండగోరుచున్న యెడల దుష్ట సాంగత్యమును విడనాడుము. లేదా యెహోషాపాతు వలె దేవుని ఉగ్రతకు పాత్రుడవుగుదువు.

# పరమందొక దేవుడున్నాడు

## (There is a God in heaven)

రాజైన నెబుకద్నెజరు ఏలుబడి 2వ సం॥ మందు ఆయన ఒక కలగన్నాడు దానినతడు మరచిపోయాడు. అందువల్ల అతని మనసు కలతపడి నిద్రలేకుండా పోయింది. గనుక తాను కనిన కలను దాని భావమును తెలియచెప్పుటకై రాజు తన ఆస్థానంలోని శకునగాండ్రను, గారడీ విద్యగలవారిని, మాంత్రికులను ఆజ్ఞాపించాడు గాని వారు దానిని తెలియచెప్పలేకపోయారు. ఆగ్రహించిన రాజు బబులోనునందలి జ్ఞానులునందరిని సంహరింపవలెనని ఆజ్ఞాపించాడు. “ఇట్టి శాసనము బయలుదేరుట వలన జ్ఞానులు చంపబడవలసి యుండగా వారు దానియేలును అతని స్నేహితులను చంపజూచిరి” (దాని యేలు 2:13). అప్పుడు దానియేలు రాజు వద్దకు వెళ్లి స్వప్న భావము తెలియ చేయడానికి తనకు కొంత సమయమిమ్మని అడిగాడు.

దానియేలు, అతని స్నేహితులు బబులోను నందలి జ్ఞానులందరి ప్రాణములు ప్రమాదములో నుండెను. వారిని చంపునట్లు రాజు ఆజ్ఞజారీ ఆయెను. దానియేలు దేవుని కృపను వెతుకుతున్నాడు. “అప్పుడు దానియేలు తన ఇంటికి పోయి తన స్నేహితులైన హనన్యాకును, మిషాయేలుకును ఆజర్యాకును సంగతి తెలియజేసి తానును తన స్నేహితులును బబులోనులో తక్కిన జ్ఞానులతో కూడా నశింపకుండునట్లు........ దేవుని వలన కటాక్షము పొందునిమిత్తమై ఆయనను వేడుకొనుడని వారిని హెచ్చరించెను” (దాని 2:17,18). అపుడు ఆమర్మము రాత్రియందు దర్శనములో దానియేలుకు బయలు పరచబడెను. గనుక దానియేలు పరలోక మందున్న దేవుని స్తుతించాడు.

సర్వోన్నతుడు, సర్వశక్తి మంతుడునైన దేవుడు ఇలా అంటున్నారు: “ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్నువిడిపించెదను నీవు నన్ను మహిమపరచెదవు” (కీర్తన 50:15). ప్రభువైన దేవుడు ఎర్రసము ద్రమును పాయలుగా చేసి ఇశ్రాయేలు ప్రజలను ఫరో బంధకముల నుండి విడిపించారు. అప్పుడు మోషేయు ఇశ్రాయేలీయులును “యెహోవాను గూర్చి గానము చేసెదను, ఆయన మిగుల అతిశయించి జయించెను..... యెహోవా

నిరంతరము ఏలువాడు" (నిర్గ 15:1-8) అని ప్రభువుకు స్తుతులు పాడారు. దేవుడు హన్నా ప్రార్ధన ఆలకించి ఆమెకు సమూయేలును ఇచ్చారు. అపుడు ఆమె ప్రభువును ఇలా స్తుతించింది: "నా హృదయము యెహోవాయందు సంతోషించుచున్నది......... తాను అభిషేకించిన వానికి అధిక బలము కలుగజేయును" (1 సమూయేలు 2:1-10). ప్రవక్తయైన యోనా మత్స్యము కడుపులోనుండి స్తుతించాడు. "నేను ఉపద్రవములో ఉండి యెహోవాకు మనవి చేయగా ఆయన నాకు ప్రత్యుత్తర మిచ్చెను ...... యెహోవా యొద్దనే రక్షణ దొరుకును" (యోనా 2:1-9).

దేవుడు ఎస్తేరు యొక్కయు ఆమె పనికత్తెల యొక్కయు ప్రార్ధన ఆలకించి యూదా జనాంగమును హామాను యొక్క దుష్టపథకము నుండి కాపాడెను. "ఏలయనగా మనము ఆయనకు మొఱ్ఱపెట్టునప్పుడెల్ల మనదేవుడైన యెహోవా మనకు సమీపముగా నున్నట్లు మరి ఏ గొప్పజనమునకు ఏ దేవుడు సమీపముగానున్నాడు?" (ద్వితి 4:7). "దేవుడు నా ప్రార్ధనను త్రోసివేయలేదు నాయొద్ద నుండి తన కృపను తొలగింపలేదు, ఆయన సన్నుతింపబడును గాక" (కీర్తన 66:20). "ఆయన యాజకులలో సమూయేలు ఉండెను, వారు యెహోవాకు మొఱ్ఱపెట్టగా ఆయన వారికుత్తర మిచ్చెను" (కీర్తన 99:6). మన పరలోకపు తండ్రి మన ప్రార్ధన లనాలకించును (మత్తయి 7:7-11; లూకా 18:4). "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను, నీవు నాకు తోడైయుందువు నీదుడ్డు కఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును". అనేక పర్యాయములు దేవుడు దావీదును అతని శత్రువులనుండి విడిపించారు, ఆయన చేసిన ఉపకారములన్నిటికి అతడు ఎల్లప్పుడు దేవునికి వందనాలు చెల్లించేవాడు.

దానియేలు రాజుయొక్క కలను, దాని భావమును దేవుని యొద్దనుండి పొంది శక్తిగల ఆ దేవుని నామమును స్తుతించి వందనాలర్పించాడు. మన దేవుడు జ్ఞానవంతుడు, బలవంతుడు, ఆయన జ్ఞానము వలన బలము వలన సర్వలోకమును ఏలుచున్నారు. కాలములను సమయములను తన స్వాధీనములో ఉంచుకొనినవాడు ఆయన ఒక్కరే. ఆయన శక్తిచేతనే రాజ్యములు కూలును రాజులు లేతురు. "తూర్పు నుండియైనను పడమటినుండియైనను అరణ్యమునుండియైనను హెచ్చు కలుగదు. దేవుడే తీర్పు తీర్చువాడు. ఆయన

ఒకని తగ్గించును ఒకని హెచ్చించును" (కీర్తన 75:6,7). "ఆయన జనములను విస్తరింపజేయును నిర్మూలము చేయును సరిహద్దులను విశాలపరుచును జనములను కొనిపోవును" (యోబు 12:23). మన దేవుడు సర్వాధికారి. మరణాంధకారములో ఏముందో ఆయన ఎరుగును "చీకటిలోని రహస్యములను ఆయన బయలుపరచుచు మరణాంధకారమును వెలుగులోనికి రప్పించును" (యోబు 12:22). సర్వజ్ఞుండైన మన దేవుడు అన్ని ఎరుగును. సముద్రాగాధములలో ఏముందో ఆయన ఎరుగును. "నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడ ఉన్నావు, నేను పాతాళమునందు పండుకొన్నను నీవు అక్కడ ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడ నీ చేయి నన్ను నడిపించును. నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. అంధకారము నన్ను మరుగుచేయును. నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును. .. అని నేననుకొనినయెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా యుండును. చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి" (కీర్తన 139:7-12). మన దేవుడు సర్వాంతర్యామి, ఆయన ప్రతిదానిలోను ఉన్నారు.

సర్వజ్ఞుండు, సర్వాంతర్యామి సర్వశక్తిమంతుడునైన మనదేవుడు సమీపింపరాని తేజస్సులో వసించును (1 తిమోతి 6:16). ఆయన వెలుగును వస్త్రముగా ధరించుకొనిన వాడు (కీర్తన 104:2). ఆయన బిడ్డలకొరకు లక్ష్యము చేయును, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపు తెరచి ఉన్నవి (1 పేతురు 3:12). పరలోకమందున్న మన దేవుడు కాలమును ఆయన స్వాధీనములో ఉంచుకొని యున్నారు. మనందరి భవిష్యత్ ఆయన ఎరిగి యున్నారు.

దానియేలు రాజైన నెబుకద్నెజరుతో "రాజా, ప్రస్తుతకాలము గడచిన పిమ్మట ఏమి జరుగునో అనుకొని తాము పడక మీద పరుండి మనోచింత గలవారై యుండగా మర్మములను బయలు పరచువాడు కలుగబోవు దానిని తమరికి తెలియజేసెను" (దానియేలు 2:29). రాజునకు కలిగిన స్వప్నమును గూర్చి దాని భావమును గూర్చి మనము దానియేలు గ్రంథం 2:29-45లో చూడగలము. తన అనంతరము వచ్చు రాజ్యములకు సంభవింపబోవు వాటిని నాల్గవ రాజ్య కాలంలో స్థాపింపబడు సంఘమును గూర్చియు దేవుడు ఆతనికి తెలియచేసియున్నారు.

సాధారణంగా ప్రజలు సాష్టాంగ నమస్కారముచేసి రాజును ఆరాధిస్తారు గాని అక్కడ రాజగు నెబుకద్నెజరు దానియేలునకు సాష్టాంగ నమస్కారముచేసి అతని పూజించి, నైవేద్య ధూపములు ఆతనికి సమర్పింప ఆజ్ఞాపించెను. "మరియు రాజు ఈ మర్మమును బయలు పరుచుటకు నీవు సమర్థుడవైతివే, నీదేవుడు దేవతలకు దేవుడును రాజులకు ప్రభువును మర్మములను బయలు పరుచువాడునై యున్నాడు. తరువాత రాజు దానియేలును అధిపతినిగాను బబులోను జ్ఞాను లందరిలో ప్రధానుని గాను నియమించెను". (దాని 2:46-48). రాజు చేత చంపబడవలసి యుండగా దానియేలు ప్రార్థించి దేవుని సహాయాన్ని కోరి రాజు సన్నిధిలో కూర్చున్నాడు (దానియేలు 2:49). పరలోకమందున్న దేవుడు నీకోసం ఆలోచిస్తున్నాడు. కృతజ్ఞత కలిగిఉండు.

# బహుప్రియుడైన దానియేలు

## (Daniel, a man greatly beloved)

బైబిలునందలి ప్రముఖ వ్యక్తులలో దానియేలు ఒకడు. ఆతని గురించి ఏమియు చెడుగా వ్రాయబడలేదు. ఇతడు దేవుని సేవకుడు దేవునికి బహుప్రియుడు. యూదులు బబులోను చెరలోనున్న 70 సం||ల కాలమును గూర్చి వ్రాసాడు. దానియేలు అనగా "దేవుడే న్యాయాధిపతి" అని అర్థం. క్రీ||పూ 604లో బబులోనుకు చెరగా కొనిపోబడిన వారితో దానియేలు అతని స్నేహితులయిన షద్రకు, మేషాకు, అబెద్నెగోలున్నారు. వారు రాజవంశస్థులు దావీదు నుండి ఉద్భవించినవారు.

రాజు నపుంసకుల అధిపతియైన అష్పెనజునకు ఇలా ఆజ్ఞాపించాడు: "ఇశ్రాయేలీయుల రాజవంశములలో ముఖ్యులై లోపములేని సౌందర్యమును సకల విద్యా ప్రవీణతయు జ్ఞానమును కలిగి తత్వజ్ఞానము తెలిసినవారై రాజునగరు నందు నిలువదగిన కొందరు బాలురను రప్పించి కల్దీయుల విద్యను భాషను వారికి నేర్పుము" (దానియేలు 1:4). కావున వారికి 3 సం||లు బబులోను విద్య నేర్పబడింది. రాజు భోజనపు బల్లనుండి భోజనము, ద్రాక్షరసము వచ్చేవి. అయితే దానియేలు వాటిని నిరాకరించాడు.

**రాజు భోజనం :**

1 రాజులు 4:22-23 వచనాలలో రాజైన సొలొమోను భోజనపు బల్లపై ఉండే భోజనము మొత్తము, అందలి రకాలు సవివరంగా మనం చూడగలం. అదే విధంగా బబులోను రాజు భోజనపు బల్లకూడా తప్పనిసరిగా అనేక రుచికర మైన విలువైన ద్రాక్షరసాలు, పండ్లరసాలు, ఆహారపదార్థాలతో నిండి ఉంటుంది గాని 16 సం||ల వయసు గల దానియేలు మాత్రం "రాజు భుజించు భోజనమును పానము చేయు ద్రాక్షరసమును పుచ్చుకొని తన్ను అపవిత్ర పరచు కొనకూడదని ఉద్దేశించి తాను అపవిత్రుడు కాకుండునట్లు నపుంసకుల అధిపతిని వేడుకొన్నాడు" (దాని 1:8).

రాజు భోజనపు బల్లపై నున్న మాంసము వారి అన్యదేవతలకు బలి ఇచ్చిన జంతువుల నుండి వచ్చునది. రెండవదిగా ఇశ్రాయేలీయుల దేవుడు మోషేద్వారా వారు ఏరకమైన మాంసమును తినవలెనో, ఏది తినకూడదో దానిని ఏవిధంగా తినవలెనో అంతా తెలియజేసారు. వారికి కొన్ని అపవిత్రమైన జంతువులు ఉన్నవి. వాటి మాంసము తినకూడదు (లేవి 11 అధ్యా; అపొ.కా. 10:9-14).

రాజు బల్ల వద్ద నుండి తినవలెనని రాజు ఆజ్ఞ అయినప్పటికి దేవుని ఆజ్ఞకు అవిధేయత చూపి తనను తాను అపవిత్రపరచు కొనకూడదనుకున్నాడు. అందువల్లనే యోసేపు కూడా కామతప్తురాలైన పోతిఫరు భార్యయొక్క చర్యను తిరస్కరించాడు (ఆది 39:7-23). మోషే కూడా ఫరోకుమార్తె యొక్క కుమారుడనని అనిపించుకొని కొద్దికాలం పాపభోగముల నుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించడానికే ఎన్నుకున్నాడు (హెబ్రీ 11:24-26).

## అపవిత్రత అవిధేయతయే:

అపవిత్ర పరచుకోవడం అంటే అవిధేయత చూపడమే. యేసు క్రీస్తు రక్తము మన గత పాపములన్నిటి నుండి బాప్తిస్మము ద్వారా శుద్ధి చేస్తుంది. క్రొత్త నిబంధన గ్రంథములో వ్రాయబడిన ప్రభువు యొక్క ఆజ్ఞలను మీరి మనలను మనము అపవిత్రపరచుకొనకూడదు. "నోటి నుండి బయటకు వచ్చునవి హృదయములో నుండి వచ్చును. దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును" (మత్తయి 15:18-20; యాకోబు 1:27). దానియేలు వలె మనలను అపవిత్ర పరచుకొనకూడదని, దేవుని ఆజ్ఞలకు లోబడ వలెనని మనము నిశ్చయించు కొనాలి. బబులోను చెరనుండి ఇశ్రాయేలీయుల పిల్లలు తిరిగి యెరూషలేముకు వచ్చినపుడు "ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దానిచొప్పున నడుచుకొనుటకును ఇశ్రాయేలీయులకు దానికట్టడలను విధులను నేర్పుటకును ధృఢ నిశ్చయము చేసికొనెను" (ఎజ్రా 7:10).

## హృదయంలో నిశ్చయించుకొనాలి:

"మీరు మొదట దేవుని రాజ్యమును నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33). దేవునిని తెలిసికొనుటకును ఆయనకు విధేయత చూపుటకును, దేవునికి ప్రథమ స్థానం ఇచ్చుటకును మన హృదయంలో నిశ్చయించుకొనాలి. అపొస్తలుల బోధయందును, సహవాస మందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక ఉండాలని మన హృదయంలో నిశ్చయించుకొనాలి (అపో. కా. 2:42). "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు ఆదినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగుచేయుచు ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు

పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:25).

ప్రభువుసేవకు ఇచ్చుటలో పౌలు ఈలాగు చెప్పుచున్నాడు. "ప్రతివాడు తన హృదయంలో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరిం 9:7). మన బిడ్డలు నడువ వలసిన రీతిలో వారికి తర్ఫీదునిచ్చుటకు మనం మన హృదయంలో నిశ్చయించుకొనాలి. వాడు పెద్దవాడై నపుడు దానినుండి తొలగిపోడు (సామె 22:6). దేవుని వాక్యం అనుదినం చదువుటకు, ప్రార్ధన జీవితం కలిగి ఉండుటకు మనం మన హృదయంలో నిశ్చయించుకొనాలి. ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో (ఫిలి 4:8) వాటిని అనుసరించుటకు మనము సమర్పించుకొనిన యెడల దానియేలు అతని స్నేహితులవలె మనము కూడా దేవుని దృష్టిలో, పెద్దల దృష్టిలో ప్రియులంగా ఉంటాము (దాని 1:9). నపుంసకుల అధిపతియైన అష్పెనజు వారిని పది దినములు పరీక్షించిన తరువాత వారి భోజనమునకు శాకధాన్యాదులను, పానమునకు నీళ్లను తీసికొనుటకు అనుమతింపబడిరి. 3 సం॥ల అనంతరము దానియేలు, షద్రకు మేషాకు, అబెద్నగోల వంటి కళగల వారెవరు నెబుకద్నెజరు ఆస్థానంలో లేరు. "జ్ఞాన వివేకముల ప్రతి విషయములోను వీరు తన రాజ్యమందంతటనుండు శకునగాండ్ర కంటెను గారడీ విద్యగల వారందరి కంటెను పదియంతలు శ్రేష్టులని తెలియబడెను" (దాని 1:20). "అపవిత్రమైన ముసలమ్మ ముచ్చటను విసర్జించి, దేవభక్తి విషయములలో నీకునీవే సాధకము చేసికొనుము..... నీకు అనుగ్రహింపబడి నీలో ఉన్న వరమును అలక్ష్యము చేయకుము" ( తిమోతి 4:7,14) అని పౌలు యౌవనుడైన తిమోతికి చెబుతున్నాడు. దేవభక్తిని అనుసరించిన అనేకమంది దేవుని సేవకులలో దానియేలు ఒకడు. "ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తనయింటికి వెళ్లి యధాప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్లూని, తన యింటి పైగది కిటికీలు యెరుషలేము తట్టునకు తెరువబడియుండగా తన దేవునికి ప్రార్ధన చేయుచు ఆయనను స్తుతించుచు వచ్చెను" (దాని 6:10).

దానియేలు వలె, యౌవనుడైన తిమోతి వలె మనము కూడా దైవభక్తిని కలిగియుండవలెను. అది మన జీవిత విధానము కావలసి ఉంది. దేవుని ఆజ్ఞలను పాటించాలి అని మనం స్థిరమైన నిర్ణయం తీసికొనినపుడు మనము కూడా దేవునికి బహుప్రియుడైన (దాని 10:11) దానియేలువలె ఆశీర్వదింపబడుదుము.

# బెల్షస్సరు యొక్క పాపములు

## (The Sins of Bellshazzar)

బబులోను రాజైన బెల్షస్సరు నగరు గోడ మీద వ్రాయబడిన వ్రాతను ఆ దేశములోని యే జ్ఞానియు చదివి దాని భావమును రాజునకు తెలియపరచలేని అసమర్థులైనందు వలన దానియేలు రాజునొద్దకు తీసుకొని రాబడెను. తండ్రియైన నెబుకద్నెజరు ద్వారా యెరూషలేము లోని ఆలయములో నుండి తీసుకొని రాబడిన వెండి, బంగారు పాత్రలలో రాజైన బెల్షస్సరు ద్వారా విందుకు ఆహ్వానింపబడిన అధిపతులు, రాజులు, తన ఉపపత్నులు వెయ్యిమంది ద్రాక్షారసము పోసి త్రాగిరి. వారు బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము కఱ్ఱ, రాయి అను వాటితో చేసిన దేవతలను స్తుతించుచు త్రాగుచుండిరి (దాని 5:4).

ఈ విందు జరుగుచుండగా మానవ హస్తపు వ్రేళ్లు కనబడి దీపము దగ్గర "మెనే, మెనే, టేకేల్ ఉఫార్సీన్" అని వ్రాసెను. ఈ వ్రాతను చదివి దాని భావమును చెప్పగల సమర్థత దానియేలునకు మాత్రమే గలదు. ఆ వ్రాత భావమేమనగా "మెనే" అనగా దేవుడు నీ ప్రభుత్వ విషయంలో లెక్క చూచి ముగించెను. "టేకేల్" అనగా ఆయన నిన్ను త్రాసులో తూచగా నీవు తక్కువగా కనబడితివి. "ఉఫార్సీన్" అనగా నీ రాజ్యము నీయొద్దనుండి విభాగింపబడి మాదీయులకును, పారసీకులకును ఈయబడును (దాని 5:25-28). రాజు యొక్క జీవితమును పరమందున్న దేవుడు పరీక్షించిన తరువాత రాజ్యమును అతని యొద్ద నుండి తీసివేసెను.

బెల్షస్సరు యొక్క పాపములను గూర్చి దానియేలు 5:18-23 వచనములలో మనము చదువుదుము. పరమందున్న దేవుడు మహర్ధశయు, రాజ్యమును, ప్రభావమును, ఘనతను తన తండ్రియైన నెబుకద్నెజరుకు ఇచ్చెను. అయితే అతడు మనసున అతిశయించినందున దేవుడతని ప్రభుత్వమును అతని యొద్ద నుండి తీసివేసి అతని ఘనతను పోగొట్టెను. మహోన్నతుడైన దేవుని యొక్క సార్వభౌమత్వమును అతడు గ్రహించిన తరువాత దేవుని యెదుట దీన మనస్సు గలవాడు కాగా తన రాజ్యమునకు మరల వచ్చెను (దాని 4వ అధ్యాయము).

అతని కుమారుడైన బెల్షస్సరు ఈ విషయములన్నియు ఎరిగియుండియు కూడ అతడు తన మనస్సును అణచుకొనక మనసున గర్వించి పరలోకమందున్న

ప్రభువుపై తన్ను తానే హెచ్చించుకొని తానును, తన అధిపతులును, తన రాణులను, ఉపపత్నులును దేవుని ఆలయ సంబంధమగు ఉపకరణములలో ద్రాక్షారసముపోసి త్రాగవలెనని తెచ్చి, యుంచుకొని వాటిలో త్రాగుచు, చూడనైనను, విననైనను, గ్రహింపనైనను చేత గాని వెండి, బంగారు, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాయి అను వాటితో చేయబడిన దేవతలను స్తుతించిరి. కాని తన ప్రాణమును, తన సకల మార్గములును ఏ దేవుని వశమున నున్నవో ఆ దేవునిని ఘనపరచలేదు (దానియేలు 5:22,23). అతని తండ్రి పరలోకమందున్న దేవునికి విరుద్ధముగ ప్రవర్తించిన విధానమును బట్టి కలిగిన పరిణామమంతయు ఎరిగి యుండియు కూడ దేవుని యెదుట అతని ప్రవర్తన దేవునికి అంగీకారముగ లేకుండుటయే బెల్షస్సరు యొక్క మొదటి పొరబాటు. తన యజమానుని చిత్తమెరిగి యుండియు సిద్ధపడక, అతని చిత్తము చొప్పున జరిగింపక ఉండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును (లూకా 12:47) అని మన ప్రభువైనయేసు చెప్పుచున్నారు. మేలైనది చేయ నెరిగియుండియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును (యాకోబు 4:17).

**రాజైన బెల్షస్సరు చేసిన రెండవ పొరబాటు అతనిలో దీనమనస్సు లేకపోవుటయే.** అతడు మనసున గర్వించి పరలోకమందున్న దేవుని ఆలయములో ఉపయోగించు బంగారు పాత్రలను ద్రాక్షారసము త్రాగుట కొరకు తెప్పించుకొని త్రాగిరి. నాశనమునకు ముందు గర్వము నడచునని మనము ఎరుగుదుము (సామెతలు 16:18). రాజైన నెబుకద్నెజరు దేవుని యెదుట దీన మనస్సు గలవాడై దేవుని మహిమ పరచి, ఘనపరచినందున తిరిగి తన రాజ్యము తనకు అప్పగింపబడెను (దానియేలు 2:26–47; 3:1–29; 4:34–37). మన దేవుడు దీనమనస్సు గలవారిని ప్రేమించును. మన కొరకు ఆయన ఉచితముగ అనుగ్రహించుచున్న మేళ్లకొరకు, ఈవుల కొరకు ఆయన యెడల కృతజ్ఞత కలిగి మన జీవితములలో ఆయనను మహిమ పరచి, ఘనపరచు వారిని ఆయన ఎంతో ప్రేమించును.

**రాజగు బెల్షస్సరు చేసిన మూడవ పొరబాటు యేమనగా అతడు దేవుని మహిమ పరచక బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాయి అనువాటితో చేయబడిన దేవతలను స్తుతించుచు, ఘనత, ప్రభావములు యే దేవుని వశమున నున్నవో ఆ దేవుని ఘనపరచి మహిమ పరచలేదు** “యెహోవాను నేనే. ఇదే

నానామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చు వాడను కాను, నాకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనీయను" (యెష 42:8). దేవుడు విగ్రహారాధనను అసహ్యించుకొనును. ఐగుప్తునుండి తిరిగి వచ్చుచున్న ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన ఆజ్ఞలలో మొట్టమొదట ఆజ్ఞ యేమనగా, "నీదేవుడైన యెహోవాను నేనే, నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు". ప్రతి మతములోను వారి వారి యొక్క నమ్మకమును బట్టివారు పూజించే దేవునిని వారి అనుదిన జీవితములలో మహిమ పరచుచుందురు. గౌరవ పాత్రులైన నాయకులకు వీధులు, నగరములు, విమానాశ్రయములు మున్నగు వాటికి వారి పేర్లను పెట్టుట ద్వారా వారిని గౌరవించుచుందురు. ఘనులైన నాయకుల యొక్క గౌరవార్ధము వారి జన్మదినములకు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటింతురు. భార్యలు, బిడ్డలు వారి భర్తలు, తండ్రుల గౌరవార్ధము వారి పేర్లుపెట్టుకొందురు. "భూమి మీద నేను నిన్ను మహిమపరచితిని".

యేసు ప్రభువు ఆయన యొక్క జీవిత విధానము ద్వారా ఈ భూమిపై ఆయన చేసిన పనులను బట్టియు, ఆయన జీవించిన జీవితము ద్వారాను తండ్రియైన దేవుని మహిమ పరచెను. ఆయన ప్రార్థించెను (యోహాను 17:4). "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము". ఆయన పరిశుద్ధ నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట ద్వారా ఆయన పరిశుద్ధ నామమును మహిమ పరతుము. ఆయన మరణము నుండి లాజరును లేపకమునుపు ఆయన కన్నులు పైకెత్తి "తండ్రీ! నీవు నామనవి వినినందున నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నానని" తండ్రియైన దేవునికి ప్రార్థించెను (యోహాను 11:41). యేసు తన శిష్యులకు ప్రార్థించుట నేర్పెను "తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక, నీరాజ్యము వచ్చునుగాక, నీ చిత్తము పరలోక మందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరును గాక; మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మాఋణములను క్షమించుము, మమ్మును శోధనలోనికి తేకదుష్టుని నుండి మమ్మును తప్పించుము" (మత్త 6:9-13). స్తుతి, మహిమ, ఘనత, ప్రభావములు యెల్లప్పుడు దేవునికే కలుగును గాక. ఆమెన్ (మత్త 6:9-13). సెరాపులు సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండి

యున్నదని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి (యెషయా 6:3). ఈ నాలుగు జీవులలో ప్రతి జీవికి ఆరేసి రెక్కలుండెను. అవి భూత, వర్తమాన, భవిష్యత్కాలములతో నుండు సర్వాధికారియగు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక చెప్పుచుండిరి (ప్రకటన 4:8). ఇరువది నలుగురు పెద్దలు సింహాసనమందు ఆసీనుడగు వాని యెదుట సాగిలపడి, యుగయుగములు జీవించుచున్న వాని యెదుట నమస్కారములు చేయుచు ప్రభువా మాదేవా! నీవు సమస్తమును సృష్టించితివి. నీ చిత్తమును బట్టి అవి యుండెను. దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహిమ ఘనత, ప్రభావములు పొంద నర్హుడవని చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము యెదుట వేసిరి (ప్రకట 4:11). దేవదూతలందరు, నాలుగు జీవులు, ఇరువది నలుగురు పెద్దలు, పరలోక మందున్న నీతిమంతుల ఆత్మలు అన్నియు యెల్లప్పుడు దేవునికి స్తుతిగానములు చేయుచుండిరి. ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంత రిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచు చున్నది (కీర్తన 19:1). మనము దేవుని ఘనపరచి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించునపుడు ఆయన నామము మహిమ పరచబడును.

మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి యెల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు క్రీస్తు యేసు నందలి భయముతో ఒకని నొకడు లోబడి యుండుడి (ఎఫెసీ 5:20) అని అపోస్తలుడైన పౌలు క్రైస్తవులందరిని హెచ్చరించుచున్నాడు. యెహోవా ఏలుచుండు స్థలములన్నిటిలో నుండు ఆయన సర్వకార్యములారా ఆయనను స్తుతించుడి (కీర్తన 103:22). దేనిని గూర్చి చింతపడకుడి గాని, ప్రతి విషయములోను ప్రార్థన, విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగ మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి (ఫిలిప్పీ 4:6). మరియు మాటచేతగాని, క్రియ చేతగాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి (కొలస్స 3:17). కాబట్టి ఆయన ద్వారా దేవునికి యెల్లప్పుడు స్తుతియాగము చేయుదము అనగా ఆయన నామమమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము (హెబ్రీ 13:15). ఇది మన యెడల దేవుని చిత్తమైయున్నది. ప్రతి విషయములోను కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము

(1 థెస్స 5:16). యెహోవా నామమునకు తగిన మహిమ ఆయనకు చెల్లించుడి, నైవేద్యము తీసికొని ఆయన ఆవరణములలోనికి రండి (కీర్తన 96:8).

ప్రతి క్రైస్తవుని మంచి జీవితము ద్వారా దేవుడు మహిమ పరచబడును. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న దేవుని ఘనపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి (మత్త 5:16). మీరు బహుగా ఫలించుట వలన నాతండ్రి మహిమ పరచబడును. ఇందు వలన మీరు నా శిష్యులగుదురు (యోహాను 15:8).

దేవుని మహిమ పరచని వానిని ఆయన నిర్దోషిగా ఎంచడు. దేవుని యెదుట ఎంతో నమ్మకమైన వ్యక్తి మోషేవాగ్దాన దేశములో ప్రవేశించ లేక పోవుటకు కారణము ఆయన నీళ్లకొరకు బండతో మాట్లాడుమని చెప్పినపుడు మోషే తన చేతిలో యున్న కఱ్ఱతో ఆ బండను కొట్టి ఆ ప్రజల దాహము తీర్చుటకు నీళ్లను రప్పించెను. అప్పుడు దేవుడైన యెహోవా మోషే, అహరోనులతో మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్ముకొనక పోతిరి. కనుక ఈ సమాజమునకు నేను వారికిచ్చిన దేశమునకు వారిని మీరు తోడుకొని పోలేరు (సంఖ్యా 20:12). మరియు వారు దేవునిని ఎరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు. కృతజ్ఞతాస్తుతులను చెల్లింపను లేదు. కాని తమ వాదనల యందు వ్యర్థులైరి (రోమా 1:21). నియమింపబడిన దినమందు హేరోదు రాజు వస్త్రములు ధరించుకొని న్యాయ పీఠము మీద కూర్చుండి వారి యెదుట ఉపన్యాసము చేయగా జనులు యిది దైవ స్వరమేగాని, మానవస్వరము కాదని కేకలు వేసిరి. అతడు దేవుని మహిమ పరచనందున వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక పురుగులు పడి ప్రాణము విడిచెను (అపొ.కా. 12:21-23). దేవుని పరిశుద్ధ నామమును మనము మహిమ పరచనిచో మనలను దేవుడు వెంటనే మొత్తిన యెడల మన జీవితగతి యేమిటి? హేరోదు రాజు జీవితమును దేవుడు దృష్టించెను.

విశ్వాస వీరులందరివలె తమ జీవితములలో దేవునికి విధేయులగుచూ, ఆయన ఆజ్ఞలను గైకొనుచు అన్ని విషయములలో నీతిగా జీవించిన యెడల మనము ఆయనను మహిమ పరచిన వారమగుదుము. అన్ని విషయములలో ప్రధమ స్థానమును మనము దేవునికిచ్చిన యెడల ఆయనను మహిమ పరచిన వారముగయుందుము. కాబట్టి ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి

అప్పుడవన్నియు మీకు అనుగ్రహింప బడును (మత్తయి 6:33). మన మంచి క్రియల ద్వారా దేవుడు మహిమ పరచబడును. మరియు మాటచేతగాని, క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి (కొలస్స 3:17).

మన అను దినజీవితములలో ఆయన ఆజ్ఞలకు విధేయులగుట ద్వారా మనము దేవుని మహిమ పరచుదుము. మన అనుదిన జీవితములో ఆయన ద్వారా పొందుచున్న మేళ్లన్నిటి నిమిత్తము ఆయన కు యెల్లప్పుడు స్తుతిచెల్లించుట ద్వారా ఆయనను మహిమ పరచి, ఘన పరచుదము. మన జీవితములలో అన్ని విషయములందును ఆయనకు ప్రధము స్ధానము ఇచ్చి మంచి ఫలములు ఫలించెదము. అట్లు కానిచో ఆయన మనలను, మన జీవితములను ఆయన త్రాసులో తూచినపుడు మనము నిష్ఫలులముగ యుందుము. మాకు కాదు యెహోవా, మాకు కాదు, నీ కృపా సత్యములను బట్టి నీ నామమునకే మహిమ కలుగును గాక (కీర్తన 115:1).

# నాశనమునకు ముందు గర్వము నడచును

(Pride goeth before a fall)

"బబులోనను ఈ మహా విశాల పట్టణము నాబలాధికారమును నా ప్రభావఘనతను కనబరుచుటకై నా రాజధాని నగరమున నేను కట్టించినది కాదా"! అని రాజైన నెబుకద్నెజరు తనలో తానను కొనెను. రాజు నోట ఈ మాట యుండగా ఆకాశము నుండి యొక శబ్దము వచ్చెను. ఏదనగా రాజగు నెబుకద్నెజరూ, ఇదే నీకు ప్రకటన. నీ రాజ్యము నీయొద్ద నుండి తొలగి పోయెను. అదే సమయములో నెబుకద్నె జరు యెడల అది నెరవేరెను అది ఎట్లనగా తమ యొద్ద నుండి మనుష్యులు నిన్ను తరిమెదురు. నీవు అడవి జంతువుల మధ్య నివాసము చేయుచు పశువుల వలె గడ్డి మేసెదవు. ఆకాశపు మంచు అతని దేహమును తడపగా అతని తలవెంట్రుకలు పక్షిరాజు రెక్కల ఈకెల వంటివియు, అతని గోళ్ళు పక్షుల గోళ్ల వంటివియు ఆయెను (దానియేలు 4:30-33). ప్రవక్తయైన దానియేలు ప్రవచన ప్రకారము రాజైన నెబుకద్నెజరు తన యొక్క అహంకార ధోరణిని బట్టి ఏడు సంవత్సరములు అట్టిరీతిగా బాధపడెను. యెహోవా దృష్టికి అయిష్టమైన అహంకార స్వభావమును బట్టి అతడు హీన పరచబడెను (సామె 6:16). నిజముగ నాశనమునకు ముందు గర్వము నడుచును. ఆయన దూరము నుండి గర్విష్ఠులను బాగుగ ఎరుగును. ఆయన మహోన్నతుడైనను దీనులను లక్ష్య పెట్టును (కీర్త 138:6).

**అపవాది అహంకారము**

దేవదూతల యొక్క నాయకుని హృదయములో గర్వము ప్రవేశించినపుడు అతడు దేవుని సన్నిధిలో యుండే యోగ్యతను కోల్పోయి క్రిందికి త్రోసివేయబడినట్లు వాక్యము తెలియజేయుచున్నది. "తేజో నక్షత్రమా, వేకువచుక్కా నీవెట్లు ఆకాశము నుండి పడితివి? నేను ఆకాశమునకెక్కి పోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనము హెచ్చింతును ఉత్తర దిక్కుననున్న సభాపర్వతము మీద కూర్చుందును మేఘ మండలము మీది కెక్కుదును. మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీ మనస్సులో అనుకొంటివిగదా! నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే'' (యెషయా

14:12-15). దేవుని దృష్టిలో పాపము చేసిన దేవ దూతలను కూడ ఆయన విడిచిపెట్టలేదు. తమ ప్రధానత్వమును నిలుపు కొనక, తమ నివాస స్థలమును విడిచిన దేవదూతలను మహాదినమున జరుగు తీర్పు వరకు కటిక చీకటిలో నిత్య పాశములతో ఆయన బంధించి భద్రము చేసెను (1 పేతురు 2:4; యూదా: 6). నిజముగ నాశనమునకు ముందు గర్వమునడచును.

## ఉజ్జియా అహంకారము

యూదారాజైన ఉజ్జియా యొక్క విశాధ గాధను మనము 2 దినవృత్తాంతములు 26వ అధ్యాయములో చదువుదుము. తన శత్రువులపై అనేక విజయములను దేవుడతనికి అనుగ్రహించెను. మంచి బలమైన సైన్యము అతని కుండెను. అనేక పట్టణములను అతడు కట్టించెను. అతడు యెహోవాను ఆశ్రయించినంత కాలము దేవుడతని వర్ధిల్ల జేసెను. అతడు రాజరికములో చాల యెక్కువగ స్థిరపడి బలపడు వరకు ఎంతో ఆశ్చర్యకరమైన రీతిగ దేవుడతనికి తోడై యుండెను. అయితే అతడు స్థిరపడిన తరువాత అతడు మనసున గర్వించి చెడిపోయెను. అతడు దేవుని ఆజ్ఞకు విరుద్ధముగ ధూప పీఠము మీద ధూపము వేయుటకు దేవుని మందిరములో ప్రవేశించి దేవునికి ద్రోహము చేసెను (2 దినవృత్తాం 26:16). యాజకులును, అహరోను కుమారులు మాత్రమే ధూప పీఠము మీద ధూపము వేయవలెను. కాని రాజు హృదయమున గర్వించి దేవుని ఆజ్ఞను తిరస్కరించెను. ప్రధాన యాజకుడైన అజర్యాయును, యాజకులందరును అతని వైపు చూడగా అతడు నొసటను కుష్ఠ గల వాడయ్యెను కనుక వారు అచ్చటి నుండి అతనిని బయటకు వెళ్లగొట్టిరి. యోహోవా తన్ను మొత్తెనని యెరిగిన వాడై తానును బయటకు వెళ్లుటకు త్వరపడిన వాడయ్యెను. రాజైన ఉజ్జియా తన మరణ దినము వరకు కుష్ఠరోగియై యుండెను. అతడు ప్రత్యేకముగ ఒక యింటిలో నివసించు చుండెను. అతడు యెహోవా మందిరములో ప్రవేశించకుండ ప్రత్యేకింపబడెను (2 దినవృత్తాం 20:21). నిజముగ గర్వము నాశనమునకు నడుపును.

## దేవుడు కోరునది దీనమనస్సు

“మహా ఘనుడును, మహోన్నతుడును, పరిశుద్ధుడును, నిత్యనివాసియునైన వాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను. అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపచేయు

టకును, నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును. వినయము గలవారి యొద్దను దీన మనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాను" (యెషయా 57:15).

వేల కొలది పోట్టేళ్లను, వేలాది నదులంత విస్తారమైన తైలమును అతిక్రమము కొరకై జ్యేష్ఠపుత్రుని, పాప పరిహారము కొరకై గర్భఫలమును ఆయనకు బలులుగా, బహుమానముగ యిచ్చిన ఆయన సంతోషించరు, గాని దీన మనస్సు గలిగి దేవుని యెదుట ప్రవర్తించుటనే ఆయన కోరుచున్నారు (మీకా 6:6-8). దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును (యాకోబు 4:6,8).

దేవుని యందు వినయ, భక్తులు గలిగిన శక్తిమంతుడైననాయకుడు మోషేను గూర్చి యిట్లు దేవుడు చెప్పుచున్నారు: మోషే భూమి మీద నున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు (సంఖ్యాకాండము 12:3).

యూదారాజైన రెహబాము తన దేవునికి అవిధేయుడై ద్రోహము చేసెను. దేవుడైన యెహోవా అతనిని తృణీకరించి తన రాజ్యమును ఐగుప్తు రాజైన షీషకు చేతుల కప్పగించెను. అటు పిమ్మట ఇశ్రాయేలీయుల అధిపతులును, రాజైన రెహబామును తమ్మును తాము తగ్గించుకొని యెహోవా న్యాయస్థుడని ఒప్పుకొనిరి. వారు తమ్మును తాము తగ్గించు కొనుట యెహోవాచూచి వారిని నాశనము చేయక త్వరలోనే రక్షణ దయచేసెను. యూదా వారు కొంతమట్టుకు మంచితనమునను సరించుట చూచి వారికి రక్షణ నెమ్మది అనుగ్రహించెను (2 దినవృత్తాం 12:6-12).

## యేసు మాదిరి

మన రక్షకుడైన యేసు ప్రభువు దీనత్వమునకు మంచి దృష్టాంతము. అపొస్తలుడైన పౌలు ఈ విధంగ వ్రాయుచున్నాడు "క్రీస్తు యేసుకు కలిగియున్న ఈ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగ యుండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొన లేదు గాని, మనుష్యులు పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగ చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:5-9).

ఆయన ఈ లోకములో మానవునిగ జన్మించినపుడు మిక్కిలి దీనురాలైన

మరియ ఆయనను పొత్తిగుడ్డలతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టెను. ఆయన మానవునిగ జీవించిన కాలమంత దీనులైన ఆ తల్లిదండ్రులకు ఎంతో విధేయుడై యుండెను (లూకా 2:51). ఆయన శతాధిపతి యొక్క విశ్వాసమును బట్టి అతనిని అభినందించెను (మత్తయి 15:21,28). జక్కయ్య యొక్క దీనత్వమును బట్టి జక్కయ్య గృహమును దర్శించెను (లూకా 19:1-10). తన్నుతాను హెచ్చించుకొని ప్రార్థించిన పరిసయ్యుని ప్రార్ధన గాక దీన మనసుతో ప్రార్థించిన సుంకరి ప్రార్ధనను ఆయన అంగీకరించెను (లూకా 18:9,14). ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా. నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీన మనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును (మత్తయి 11:28,29) అని ఆయన చెప్పెను.

గర్వము నాశనమునకు నడుపును. ఎదుటి వాని యెడల దీనమనస్సను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి, దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి (1 పేతురు 5:6). రాజైన నెబుకద్నెజరు తన అహంకారము తరువాత గ్రహింపు కలిగి సర్వోన్నతుడైన దేవుని యెదుట తన్ను తాను తగ్గించుకొనెను. అతడు దేవుని మహిమపరచి, ఘనపరచెను. “ఆయన రాజ్యము శాశ్వత రాజ్యము ఆయన ఆధిపత్యము తరతరములు నిలుచునది. ఆయన పూజార్హుడు. నెబుకద్నెజరు అనునేను పరలోకమందున్న సైన్యాధిపతియైన దేవుని ఘనపరచుచున్నాను. రక్షించుటకు సమర్థుడగు దేవుడు ఈ దేవుడే. మరి ఏ దేవుడును లేడు. గర్వమున ప్రవర్తించు వానిని ఆయన క్రుంగజేయును” (దానియేలు 3:29 నుండి 4:3 వరకు).

# ఆయన వాడుక చొప్పున

## (As His Custom was)

లూకా 2:41-52 వరకు గల ఒక్క సందర్భమే యేసు ప్రభువు బాల్యం నుండి యౌవనం వరకు నమోదుచేయబడింది. దేవుని ఆజ్ఞ ఏమంటే ఇశ్రాయేలీయులలో ప్రతీ పురుషుడు సం॥నకు మూడు మార్లు యెరుషలేములోని దేవాలయంలో కనబడాలి "ఏటికి మూడుమార్లు అనగా పొంగని రొట్టెల పండుగలోను వారముల పండుగలోను పర్ణశాలల పండుగలోను నీదేవుడైన యెహోవా ఏర్పరచుకొను స్థలమున నీ మగవారందరు ఆయన సన్నిధిని కనబడవలెను. వారు వట్టి చేతులతో యెహోవా సన్నిధిని కనబడక నీదేవుడైన యెహోవా నీ కనుగ్రహించిన దీవెన చొప్పున ప్రతివాడును తన శక్తికొలది యియ్యవలెను". ద్వితి 16:16, నిర్గమ 23:15-17.

సంవత్సరమునకు మూడుసార్లు దేవుని ఎదుట కనబడవలెననేది అప్పటిలో ఇశ్రాయేలీయుల ఆచారము - అదే యోసేపు మరియల ఆచారము; ఎల్కానా పెనిన్నా, హన్నాల ఆచారము; జకర్యా, ఎలిజబెత్ వారి కుటుంబాలు దేవుని సన్నిధికి వెళ్లారు. దేవుని ఆజ్ఞ ప్రకారము యోసేపు, మరియలు దేవుని సన్నిధికి వెళ్లే ఆచారం కలిగి ఉన్నారు (లూకా 2:42). అదే పద్ధతి వారి పిల్లలది కూడా, బిడ్డలు మంచి అలవాట్లను తల్లిదండ్రులనుండే నేర్చుకుంటారు గదా!

"నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునపుడును త్రోవను నడుచునపుడును పండుకొనునపుడును లేచునపుడును వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా నీచేతికి వాటిని కట్టుకొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికము వలె ఉండవలెను. నీ యింటి ద్వారబంధములు మీదను నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను (ద్వితి 6:7-9). జ్ఞానియైన సొలొమోను "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనపుడు దానినుండి తొలగిపోడు" అన్నాడు.

యోసేపు - మరియలు దేవుని ఆజ్ఞచొప్పున వారి పిల్లలను పెంచారు. పస్కా పండుగ సమయమున వారు తమ బిడ్డలను యెరూషలేము దేవాలయమునకు తెచ్చి దేవునిని ఆరాధించడం నేర్పారు. అదేవిధంగా మనం మనబిడ్డలకు స్థానిక సంఘము యొక్క ప్రతికూడికను క్రమం తప్పకుండా

వారు హాజరగునట్లు తల్లిదండ్రులు వారిపై ఒత్తిడి తేవాలి. తల్లిదండ్రులే వారి బిడ్డలకు మాదిరికరమైన వారు. మన ఆచార అలవాట్లే బిడ్డల ఆచార అలవాట్లు కావాలి. ప్రతీ సబ్బాతు దినమున సమాజమందిరమునకు వెళ్లుట యేసు ప్రభువు, ఆయన శిష్యుల యొక్క ఆచారము. క్రైస్తవులమైన మనం కూడా ప్రతి ఆదివారమున ఆరాధన కార్యక్రమమునకు తప్పని సరిగా హాజరు కావాలి (హెబ్రీ 10:25).

యేసు ప్రభువు మంచి క్రమశిక్షణ గలవారు. దేవునికి క్రమముగా ప్రార్థించుట ఆయన వాడుక. ఆయన బాప్తిస్మము పొందియోర్దాను నదీతీరమున ప్రార్థిస్తూ ఉండగా ఆయన పరిశుద్ధాత్మను పొందారు (లూకా 3:21). “ఆయన పెందలకడ లేచి ఇంకను చాలా చీకటి యుండగానే బయలు దేరి, అరణ్య ప్రదేశమునకు వెళ్లి, అక్కడ ప్రార్ధన చేయుచుండెను” (మార్కు 1:35; లూకా 5:16). ప్రతీ ఉదయమునే మనం ఆయన ఆశీర్వాదము పొందుకోవాలి. ప్రాతఃకాలసమయము మనం దేవునికి ఇవ్వాలి (మత్తయి 6:33, కీర్త 5:3; 63:1). ఆయన శిష్యులను అద్దరినున్న బేత్సయిదాకు పంపివేసి ఒంటరిగా ప్రార్ధన చేయుటకు కొండకు వెళ్లారు (మార్కు 6:45,46). అదేవిధంగా మనం కూడా పరలోకమందున్న తండ్రితో వ్యక్తిగతమైన సంబంధం కలిగి ఉండాలి. అపొస్తులులను ఏర్పరచుకొనుటకు ముందు ఆయన ప్రార్థించారు. కొన్ని సందర్భాలలో ఆయన దినమంతా ప్రార్థించారు (మార్కు 6:45,46; మత్తయి 14:23). యోహాను సువార్త 17వ అధ్యాయం ఆయన తన శిష్యులకోసం, క్రైస్తవులందరికోసం చేసిన ప్రార్ధన. సిలువ వేయబడడానికి ముందు గెత్సెమనె వనములో ఆయన చేసిన ప్రార్ధన మనం చదువుతాం (లూకా 22:39). శ్రమకాలంలో మనం మన దేవునిని ఆశ్రయించాలి (కీర్త 50:15). ఆయన తన ప్రార్ధనలో దేవుని స్తుతించేవారు, ఆయనకు కృతజ్ఞతలు తెలిపేవారు. బలిపీఠం కట్టి దేవునికి కృతజ్ఞత తెలుపడం అబ్రాహాము యొక్క వాడుక. ఆదికాండము 24:63; 25:61లో ఇస్సాకు యొక్క ప్రార్ధన మనం చదువగలము. దావీదు దినమునకు 7 మార్లు ప్రార్థించేవాడు, దానియేలు దినమునకు మూడుమార్లు ప్రార్థించేవాడు. దైవజనులందరూ గొప్ప ప్రార్ధనా పరులు.

ఆదియందు వాక్యముండెను వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను అని I యోహాను 1:1 చెబుతుంది. ఈ వాక్యము యేసు ప్రభును సూచిస్తుందని మనకు తెలుసు. యేసుప్రభువు బాలుడుగా నున్నపుడు

తన తల్లియైన మరియ వద్ద లేఖనాలు నేర్చుకున్నారు (II తిమోతి 1:5). ఆమె కూడా లూ.కా 1:46 –55 వరకునున్న వచనాలలో కీర్తనలలోని 23 వచనాలను ఉటంకించింది. లేఖనాలను ఆమె బాగా నేర్చుకొనినది గనుక తన కుమారుడైన యేసు ప్రభువునకు వాటిని నేర్పించి ఉండవచ్చు. లేఖనాలలోని ఆయన జ్ఞానమునకు దేవాలయములోని బోధకులే ఆశ్చర్యపోయారు. "ఆయన మాటలు వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును ప్రత్యుత్తరములకును విస్మయమొందిరి". భూమి మీద ఉన్నపుడు ప్రతీ సబ్బాతు రోజున సమాజ మందిరమునకు హాజరై దేవుని ఆరాధించడం, వాక్యాన్ని వినడం, చదవడం, బోధించడం వాడుకగా యేసుప్రభువు కలిగిఉన్నారు.

"తరువాత ఆయన తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజ మందిరములోనికి వెళ్లి చదువుటకు నిలుచుండగా" (లూకా 4:16). లేఖనాలలోని వాక్యభాగాలను తీసికొని వాటిద్వారానే సాతాను శోధనను ఆయన జయించగలిగారు (మత్తయి 4:1–11).

"మీరు లేఖనములలో ఎన్నడును చదువలేదా....."? అంటూ ఆయన తన శ్రోతలను ప్రశ్నించారు (మత్తయి 21:42; 12:5; 21:16, 22:32; మార్కు 12:10; లూకా 6:3; 20:17). లేఖనాలు ప్రతిరోజు మనం చదవాలని ఆయన ఆశిస్తున్నారు. "క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" అని అపొస్తులుడైన పౌలు (కొలస్స 3:16) చెబుతున్నాడు. దేవుడైన యెహోవా యెహోషువాతో ఇలా అన్నారు - ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్త పడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు" (యెహోషువ 1:8). ధర్మశాస్త్ర గ్రంథము యొక్క ప్రతిని ప్రతి రాజు తన యొద్ద ఉంచుకొనవలెనని దేవుడు ఆజ్ఞాపించారు (ద్వితి 17:18).

"మోషే ఇశ్రాయేలీయులకు వ్రాసి ఇచ్చిన ధర్మశాస్త్ర గ్రంథమును ఒక ప్రతిని అతడు అక్కడ ఆరాళ్ల మీద వ్రాయించెను..... వారి పెద్దలును వారి నాయకులును..... ఆ మందసమునకు ఈవైపున ఆవైపున నిలిచిరి..... యెహోషువా ఆ ధర్మశాస్త్ర గ్రంథములో వ్రాయబడిన వాటన్నిటిని బట్టి..... చదివి వినిపించెను (యెహోషువ 8:32–34). యెహోవా ధర్మశాస్త్రమునందు

ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు (కీర్త 1:2; 119:11; 105:112) అని దావీదు పాడెను. యెహోవా ధర్మశాస్త్రమును బోధించుటకుగాను రాజైన యెహోషాపాతు లేవీయులను యాజకులను యూదా దేశమంతటికి పంపించాడు. "వారు యెహోవా ధర్మశాస్త్ర గ్రంథమును పట్టణము లన్నిటను సంచరించుచు జనులకు బోధించిరి" (II దిన 17:9). ఉదయము నుండి మధ్యాహ్నము వరకు శాస్త్రియైన ఎజ్రా ఇశ్రాయేలీయుల సమాజము ఎదుట ధర్మశాస్త్రమును చదివినట్టు మనం చదువగలము (నెహెమ్యా 8:3;II రాజులు 23:2). "నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుట యందును బోధించుటయందును జాగ్రత్తగా ఉండుము". (II తిమో 4:13) అని అపొస్తులుడైన పౌలు తిమోతిని హెచ్చరిస్తున్నాడు. మంచి మనస్సాక్షి కొరకు మనం అభ్యాసంచేసికోవాలి. అపొస్తులుడైన పౌలు రాజైన ఫేలిక్సు ఎదుట నిలబడి ఇలా అన్నాడు - "నేనును దేవుని యెడలను మనుష్యుల యెడలను ఎల్లప్పుడు నా మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసి కొనుచున్నాను" (అపొ.కా. 24:16). అదే చేయాలని తిమోతిని హెచ్చరిస్తున్నాడు. "అపవిత్రము లైన ముసలమ్మ ముచ్చటలను విసర్జించి దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము. శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకర మవును గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్నివిషయములలో ప్రయోజనకరమవును" (I తిమో 4:7-8). యేసుప్రభువు లాగానే పౌలుకు కూడా సబ్బాతురోజున సమాజమందిరమునకు వెళ్లి బోధించడం వాడుక కలిగియుండెను (అపొ. 17:2).

యేసు ప్రభువు, ఆయన తల్లిదండ్రులు దైవభక్తిని సాధకం చేసినవారు. మనం భూమి మీద జీవించినంతకాలం మంచి అలవాట్లు నేర్చుకొని రాబోవు జీవితంను సార్థకం చేసికోవాలి. మంచి అలవాట్లు మనలను నిర్మిస్తాయి చెడ్డ అలవాట్లు మనలను శిధిలంచేస్తాయి. మంచి అలవాట్లు వృద్ధి చేసికోవడానికి కొంత సమయం పడుతుందిగాని చెడ్డ అలవాట్లు ఊరికినే అలా వచ్చేస్తాయి. మంచి అలవాట్లు విడిచిపెట్టడం చాలా తేలిక గాని చెడ్డ అలవాట్ల నుండి బయటకు రావడం బహు కష్టం.

మన జీవిత సౌఖ్యం కోసం, రాబోవు జీవితక్షేమం కోసం యేసు ప్రభువలె మనందరం మంచి అలవాట్లను నేర్చుకొందాము.

## "నా కిష్టమే, నీవు శుద్ధుడవు కమ్ము"

("I will, be Thou Clean")

యేసు ప్రభువు కొండ మీద ప్రసంగమును ముగించి దిగి వచ్చినపుడు బహుజన సమూహము ఆయనను వెంబడించెను. వారిలో ఒక కుష్టరోగి తన్ను శుద్ధి చేయుమని ప్రభువును బ్రతిమలాడెను. అతడు తన ఘోర రోగముయొక్క తీవ్రపరిణామము నెరిగియుండెను. తన రోగము సమాజము నుండి అతని వెలివేసెను. దేవుడు మాత్రమే తన్ను శుద్ధిచేయగలుగునని అతడెరుగును. యేసుప్రభువు ప్రసంగము నతడు దూరమునుండి వినియుండవచ్చును. బహుశ యేసు చేయుచున్న మహత్కార్యముల నతడు వినియుండవచ్చును.

వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17). అతడు యేసు మాటలను విన్నాడు, ఆయన యందు విశ్వాసముంచాడు. తన రోగమును బాగుచేయగల దేవుని కుమారుడాయనే యని అతడు నమ్మాడు. ఆయన కృప నభ్యర్థిస్తు, "ప్రభువా, నీ కిష్టమైతే నన్ను శుద్ధుని చేయగలవనెను" (మత్తయి 8:2). తన్ను శుద్ధుని చేయగల శక్తి యేసులో యున్నదనే విశ్వాసమును, తాను శుద్ధుడు కాగోరుచున్నాననే తన సంసిద్ధతను అతడు వెలిబుచ్చాడు. యేసు యొక్క కృప కొరకు అతడు అభ్యర్థించాడు.

### శుద్ధుడవు కాగోరాలి

ఈ సంఘటనద్వారా మనం కొన్ని పాఠాలు నేర్చుకొనవచ్చును. మొదటిగా ఈ కుష్టరోగి శుద్ధుడు కాగోరాడు. తన విషయంలో అది సహజమే. కుష్ఠరోగియైన నయమానును గూర్చి మన మెరుగుదుము. అతడు కూడ మనస్ఫూర్తిగా శుద్ధుడు కాగోరాడు. ఒక చిన్న సేవకురాలి నుండి పొందిన సమాచారమునుబట్టి అతడు చాల దూరం ప్రయాణం చేసి సమరయకు వచ్చాడు. మరొక మనుష్యుడు బెతెస్ద కోనేటి వద్ద స్వస్థత పొందగోరుచు 38 సంవత్సరాలు గడిపాడు. "స్వస్థత పొందగోరుచున్నావా?" యని యేసు వాని నడిగారు (యోహాను 5:6). అతన్ని బాగుచేసారు. పండ్రెండు సంవత్సరములనుండి రక్తస్రావముగల స్త్రీ కూడ స్వస్థత పొందాలనే గొప్ప ఆశ కలిగి యుండెను. నేను ఆయన వస్త్రములు మాత్రమే ముట్టిన బాగుపడుదు ననుకొన్నదామె (మార్కు 5:28). బహు

జనసమూహము ఆయన చుట్టు నున్నను ఆమె వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె బాగుపడెను.

## ప్రభువుకు ఇష్టమే

యేసు చెయ్యి చాపి ఆ కుష్ఠరోగిని ముట్టి "నా కిష్టమే, నీవు శుద్ధుడవు కమ్ము' అని చెప్పెను (మత్త 8:3). పాపరోగముగల ప్రతివాడు ఆయన యొద్దకు వచ్చి శుద్ధుడు కావాలని యేసు కోరుచున్నారు. శరీరానికి కుష్ఠు ఏలాటిదో, ఆత్మకు పాపం ఆలాంటిది. ఆ కుష్ఠరోగివలె, పాపక్షమాపణ కొరకు మనం ఆయన యొద్దకు రావాలి. పాప రోగముతో మనం ఆయన యొద్దకు వెళ్లితే, ఆయన "నా కిష్టమే, శుద్ధుడవు, కమ్మని" చెబుతారు. అందుకే యాకోబు ఇట్లనుచున్నాడు: "దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:8).

ప్రభువు ఇట్లనుచున్నారు: "దుర్మార్గుడు మరణము నొందుట వలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతోషము కలుగును" (యెహెజ్కేలు 33:11). ఏఒక్క ఆత్మయు నశించుట దేవుని కిష్టము లేదు. "మనుష్యులందరును రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని ఆయన యిచ్ఛయించుచున్నాడు" (1 తిమో 2:4). దుష్టులు తమ సొంత యిచ్ఛను బట్టియే మరణింతురు. విశాల మార్గమున పయనించువాడు మరణించుట కిచ్ఛయించుకొన్నవాడు. దేవుని వాక్యానికి అవిధేయుడగుట వలన పాపి తన సొంత మరణాన్ని కోరుకొంటాడు. దుర్మార్గుడు మరణించాలని గాక రక్షింపబడాలని దేవుడు కోరుచున్నను దుర్మార్గులు తమ పాపంలోనే మరణించుచున్నారు. ప్రభువును సేవించాలనే బలమైన కోరిక యున్నందున సౌలును పౌలుగా ప్రభువు మార్చారు. ఐతియొపీయ నపుంసకుడు, దిట్టమైన సత్యాన్వేషి గనుకనే ఫిలిప్పును అతనియొద్దకు దేవుడు పంపారు. నీతి భక్తిగల జీవితాన్ని జీవించడానికి బలమైన కోరికగలవాడు గనుక కొర్నేలి యొద్దకు ఆయన పేతురును పంపారు.

## ప్రభువు చిత్తం వెల్లడి పరచబడింది

యిదే రీతిగ దేవుడు మనయెడల తన చిత్తాన్ని వెల్లబుచ్చారు. మన కొరకు ఆయన తన ఏకైక కుమారుని అప్పగించారు. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై

యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). తన పరిశుద్ధ వాక్యాన్ని మనకిచ్చుటద్వారా దేవుడు తన చిత్తాన్ని మన యెడల వెల్లడి పరచుచున్నారు. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కారమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16,17). మనలను రక్షించడానికి ఆయన కిష్టమే గనుక ఆయన తన సంఘాన్ని స్థాపించారు. దేవుని వాక్యాన్ని బోధకులద్వారా, రేడియో, కరపత్రములు, పుస్తకముల ద్వారా నీవు తెలుసుకొనే అవకాశాన్ని కల్పించి ఆయన నీ యెడల తన ఇష్టాన్ని వెలిబుచ్చుచున్నారు.

నిన్ను రక్షించి, శుద్ధునిగా చేయుటకు యేసు కోరుచున్నారు. నీవు శుద్ధుడవు కాగోరుచున్నావా? యెషయా యిట్లనుచున్నాడు : "యెహోవా మీకు దొరుకు కాలమందు ఆయనను వెదకుడి. ఆయన సమీపములో నుండగా ఆయనను వేడుకొనుడి" (యెషయా 55:6).

# వారు ఆయనను గుర్తించిరి

## (And They recognised Him)

ఈ ప్రపంచములోని మానవులనందరిని రక్షించుటకు గాను దేవుని కుమారుడు మానవునిగా భూలోకములో జన్మించెను. ఆయనను వెంబడించిన వారు ఆయనను సర్వోన్నతుడైన దేవుని కుమారునిగా గుర్తించిరి. కొంతమంది ఆయన యందు విశ్వాసముంచిరి. మరికొంతమంది ఆయనను నిరాకరించిరి. కన్యయైన మరియ గర్భమందు ఆయన జన్మించెను. యేసు ఈ భూలోకములో మానవునిగా జన్మించినది మొదలు యోసేపు మరియలు ఆయనను దేవుని కుమారునిగ గుర్తించిరి.

"భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు మీ కొరకు నేడు రక్షకుడు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" (లూకా 2: 10-13) అని పరలోకదూతలు గొల్లలకు క్రీస్తు జననమును గూర్చి తెలియపరచిరి. ఆ గొఱ్ఱెల కాపరులు బెత్లెహేముకు వెళ్లి తొట్టిలోపండుకొని యున్న శిశువును చూచిరి. ఆయన యొక్క ఏకైక కుమారుని ఈ లోకములోనికి పంపించినందుకు గాను దేవుని మహిమ పరచుచు, ఆయనను ఘనపరచుచువారు తిరిగి వెళ్లిరి (లూకా 2:20). జ్ఞానులు ఆకాశమందు తూర్పు దిక్కున నక్షత్రమును చూచి దానిని వెంబడించగా, ఆ నక్షత్రము వారి ముందు నడచుచూ ఆశిశువు ఉన్న చోటికి వచ్చి, అచ్చట నిలువగా వారు ఆ శిశువును చూచి, ఆ బిడ్డ దేవుడని గుర్తించి అత్యానంద భరితులై ఆయనను పూజించి ఆయనకు బంగారము, సాంబ్రాణి, బోళము కానుకలుగ అర్పించిరి.

యేసు బాప్తిస్మము కొరకు బాప్తిస్మమిచ్చు యోహాను దగ్గరకు వచ్చినపుడు, పరిశుద్ధాత్మ పావురమువలె ఆయన మీదికి దిగి వచ్చుట చూచి యోహాను ఆయనను గుర్తించెను. "నేను ఆయనను ఎరుగనైతిని. నీళ్లలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపిన వాడు నీవు ఎవరి మీదికి ఆత్మదిగి వచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చు వాడని చెప్పెను" అని యోహాను యేసును గూర్చి సాక్ష్యము చెప్పెను (యోహాను 1:33-34).

శిష్యులు వారి కుటుంబములను, వారి వృత్తిని విడిచిపెట్టి యేసును

వెంబడించిరి. పేతురు యేసుతో ఈ రీతిగ చెప్పెను. "ప్రభువా యెవని యొద్దకు మేము వెళ్లుదుము? నీవే నిత్య జీవపు మాటలు గల వాడవు. నీవే దేవుని పరిశు ద్ధుడు వని మేము విశ్వసించి ఎరిగియున్నామని ఆయనతో చెప్పెను". (యోహాను 6:68). జనసమూహములు రోగములనుండి విముక్తులుగా చేయబడుట ద్వారాను, అనేకములైన సూచకక్రియలు, అద్భుతకార్యములు చూచుట ద్వారాను, తృప్తికరముగ భోజనము చేయుట ద్వారాను ఆయనను దేవుని కుమారునిగ గుర్తించిరి. దయ్యములు కూడ ఆయనను దేవుని కుమారునిగ గుర్తించినవి. అపవిత్రాత్మ యేసును చూచి, "యేసూ! సర్వోన్నతుడైన దేవుని కుమారుడా, నాతో నీకేమి? నన్ను బాధపరచకుమని దేవుని పేరట నీకు ఆనబెట్టుచున్నానని చెప్పెను" (మార్కు 5:7; అ.కా. 19:13-18). నజరేతు వారు ఆయనను మరియ, యోసేపుల కుమారునిగ గుర్తించి వారి హృదయములను కఠిన పరచుకొనిరి (మత్తయి 13:54-58).

బాప్తిస్మమిచ్చు యోహాను తన శిష్యులలో ఇద్దరికి యేసును చూపించి, ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల అని వారికి యేసును పరిచయము చేసెను (యోహాను 1:36). ఆ శిష్యులిరువురును ఆయన యుండు స్థలము వరకు ఆయనను వెంబడించి ఆయనతో వెళ్లిరి. ఆ దినము వారు ఆయనతో అచ్చట గడిపిరి. వారిలో ఒకడు అంద్రెయ. ఇతడు తన సహోదరుడైన సీమోనును చూచి, మేము మెస్సీయను కనుగొంటిమి అని అతనితో చెప్పి అతనిని యేసు నొద్దకు తోడుకొని వచ్చెను (యోహాను 1:41-42). మరునాడు ఆయన ఫిలిప్పును కనుగొని, నన్ను వెంబడించుమని చెప్పెను. ఫిలిప్పు నతనియేలును కనుగొని ధర్మశాస్త్రములో మోషేయు, ప్రవక్తలును యెవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని చెప్పెను (యోహాను 1:43-45). ఫిలిప్పు నతనియేలును యేసు నొద్దకు తీసికొని వచ్చెను.

యోహాను సువార్త 4వ అధ్యాయములో యాకోబు బావి యొద్దకు నీళ్లు చేదుకొనుటకు వచ్చిన సమరయస్త్రీ మెస్సీయ ఈ లోకమునకు వచ్చునని తెలిసికొనినది. నీతో మాట్లాడుచున్న నేనే ఆయనని యేసు తన్ను ఆమెకు తెలియపరచుకొనెను (యోహాను 4:36). ఆ స్త్రీ ఆమె కుండను బావిదగ్గరనే విడిచిపెట్టి, ఊరిలోనికి వెళ్లి, మీరు వచ్చి నేను చేసిన వన్నియు నాతో చెప్పిన వానిని చూడుడి. ఆయన క్రీస్తు కాదా? అని ఆ ఊరివారితో చెప్పెను. అప్పుడు

ఆ ఊరివారు ఆయన దగ్గరకు వచ్చి నేను చేసినవన్నియు నాతో చెప్పెనని సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్క మాటను బట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి (యోహాను 4:28-30;39-42).

ఐదు రొట్టెలు, రెండు చేపలతో జన సమూహమునకు భోజనము పెట్టిన తరువాత యేసు ప్రార్థనచేయుటకు కొండకు వెళ్లెను. శిష్యులు దోనెయెక్కి ముందుగా వెళ్లిరి. రాత్రి నాలుగవజామున యేసు సముద్రము మీద నడుచుచు వారి యొద్దకు వచ్చెను. గాలి ఎదురై సముద్రము మీద అలలు లేచుచున్నందున నావకు ఎంతో తొందరకలుగుచుండెను. యేసు ఆ దోనె దగ్గరకు రాగానే దోనెలో యున్నవారు వచ్చి, నీవు నిజముగ దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి. వారు అద్దరికి వెళ్లి గెన్నెసరతు దేశమునకు వచ్చిరి. అచ్చటి జనులు ఆయనను గుర్తుపట్టి, చుట్టుపట్లనున్న ప్రదేశములకంతటికి వర్తమానము పంపి, రోగులనందరిని ఆయన యొద్దకు తెప్పించిరి. ఆయన వారి నందరిని స్వస్థపరచెను (మత్తయి 14:22-36). వారు దోనె దిగగానే జనులు ఆయనను గుర్తుపట్టి ఆ ప్రదేశమందంతట పరుగెత్తికొనిపోయి, ఆయన యుండిన స్థలమునకు రోగులను మంచముల మీద మోసికొని వచ్చుటకు మొదలు పెట్టిరి (మార్కు 6:53). గెన్నెసరతు ప్రజలు మన ప్రభువైన యేసును గుర్తించినపుడు ఆయనను గూర్చిన మంచివార్త అందరికి తెలియపరచుట కొరకు వారు పరుగులెత్తిరి (మార్కు 6:55).

ఆదినములలో వార్తా పత్రికలు గాని, రేడియోలు, టెలివిజన్‌లు, టెలిఫోన్లుగాని వార్తలు తెలియబరచుటకు లేవు. నోటి మాట ద్వారానే వార్తలు వెల్లడించబడేవి. యేసును ఎరిగినవారందరు ఇతరులను యేసు నొద్దకు తీసుకువచ్చేవారు, గొఱ్ఱెల కాపరులు యేసును కనుగొనిన తరువాత ఆయనను పూజించిరి. జ్ఞానులు వచ్చి యేసును చూచిన తరువాత వారు సాగిలపడి నమస్కరించి విలువైన కానుకలను ఆయనకు సమర్పించిరి. వారి ద్వారానే సువార్త ప్రపంచ మంతటికిని వ్యాప్తిచెందెను. అంద్రెయ సీమోను పేతురును యేసు నొద్దకు నడిపించెను. అతడు యేసు కొరకు గొప్పయోధుడయ్యెను.

ఫిలిప్పు నతనియేలును యేసు నొద్దకు తీసికొని వచ్చెను. తాను యేసు కొరకు గొప్ప అపొస్తలుడయ్యెను. సమరయస్త్రీ ద్వారా సుకారు అను గ్రామములోని అనేకమంది యేసునందు విశ్వాసముంచిరి. గెన్నెసరతు ప్రజలు ఆయనను గుర్తించి, వారు పరుగెత్తి అనేక గ్రామములకు వెళ్లి రోగుల నెల్లను ఆయన

యొద్దకు తీసుకువచ్చిరి. ఆయన వారినందరిని స్వస్థపరచెను. వారందరు ఆయన దేవుని కుమారుడని గుర్తించిరి.

నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి మరణింతురు అని యేసు చెప్పెను (యోహాను 8:24). ఆయన దేవుని కుమారుడని మనము విశ్వసించని యెడల మనము మన పాపములలోనే యుండి చనిపోవు దుము. యింకను అనేకమంది ఆయన దేవుని కుమారుడని గుర్తించిరి. వారు యేసు నొద్దకు అనేకులను తీసుకొనివచ్చిరి. యేసు దేవుని కుమారుడని నీవు గుర్తించిన యెడల యెప్పుడైనా, ఎవరికైనా ఆయన దేవుని కుమారుడని నీవు చెప్పితివా? ఎవరినైనా ఆయన యొద్దకు తీసికొని వచ్చితివా? ఆయన సంఘములోఎవరినైనా చేర్చితివా?

నీవు నిజముగా యేసు దేవుని కుమారుడని గ్రహించి, నీవు ఆయనను గుర్తించితివా? ఆయన పరిశుద్ధ సహవాసము లోనికి ఎవరినైనా చేర్చితివా?

# వెలుగు సంబంధులు

## (Children of Light)

నేరస్థులు తప్ప చీకటిని ప్రేమించే వారుండరు. చీకటిలో మనం యేమీ చేయలేము. కడు నేరస్థులను అధికారులు కటిక చీకటికొట్లులో బంధిస్తారు. దేవునిపై తిరుగుబాటు చేసిన దేవదూతలను ఆయన కటిక చీకటిలో బంధించి భద్రము చేసారు (యూదా:6). మాట వినవొల్లని ఫరోకు బుద్ధి చెప్పుటకై దేవుడు ఐగుప్తునంతటిని మూడు దినముల మట్టుకు చీకటిమయంచేసెను (నిర్గమ10:22). అంధకార సంబంధులగు లోకనాధులతో పోరాడు నిమిత్తము మనము దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనాలని అపొ.పౌలు హెచ్చరించాడు (ఎఫెసీ 6:12). దుష్టత్వానికి, పాపానికీ, దుఃఖానికి, మరణానికి చీకటి సాదృశ్యము.

దేవుడు సృష్టి జరిగింపకముందు "భూమి నిరాకారముగాను, శూన్యము గాను ఉండెను; చీకటి అగాధ జలము పైన కమ్మియుండెను". "దేవుడు వెలుగు కమ్మని పలుకగా వెలుగుకలిగెను" (ఆది.కా. 1:2-3). భూమిపై దేవుడు ప్రాణకోటిని సృష్టించకమునుపు ఆయన వెలుగును చేసెను. ఏలయనగా వెలుగు లేనియెడల భూమిపై జీవరాసుల మనుగడ ఆసాధ్యము. జంతువులన్నియు పచ్చికపై ఆధారపడి జీవిస్తాయి. పచ్చిక కొరకు సూర్యరశ్మి వెలుగు అత్యవసరం.

**ఈ లోకము ఆత్మీయాంధకారములో యున్నది.** "దేవుడు వెలుగైయున్నారు. ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు" (1 యోహాను 1:5). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు" (1తిమోతి 6:16). 'యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు, నేను ఎవరికి భయపడుదును?" అని కీర్తనకారుడు వ్రాసాడు (కీర్త 27:1).

"యేసు - నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని చెప్పెను" (యోహాను 8:12). "ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగుచీకటిలో ప్రకాశించుచుండెను గాని చీకటి దాని గ్రహింపకుండెను" అని చెప్పబడి యున్నది (యోహాను 1:4-5). యేసే నిజమైన వెలుగు. ఆయన

లేకుండా వెలుగైయున్న దేవుని మనం చేరలేము. ఆయన ఈ లోకములో తన పరిచర్యను ప్రారంభించినప్పుడు "చీకటిలో కూర్చుండి యున్న ప్రజలు గొప్ప వెలుగు చూచిరి. మరణ ప్రదేశములోను మరణచ్ఛాయలోను కూర్చుండి యున్నవారికి వెలుగు ఉదయించెను" (మత్త 4:16). దేవుని వాక్యము మనపాదములకు దీపమును, మన త్రోవకు వెలుగునైయున్నది (కీర్త 119:105).

"మీరు లోకమునకు వెలుగైయున్నారని" యేసు తన శిష్యులకు ఉద్బోధించెను (మత్త 5:14). క్రీస్తులో యుండి ఆయన పిల్లలతో సహవాసము గలవారు ఈ లోకములో జ్యోతులవలె యుందురు. వెలుగును మరుగు పరచలేము. వెలుగుబయలు పరచును. మనం ఈ లోకమునకు వెలుగై యున్నామని ఎట్లెరుగుదుము? అపొ.పౌలు ఇట్లు జవాబిచ్చుచున్నాడు: "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువు నందు వెలుగైయున్నారు. వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము నీతి సత్యమను వాటిలో కనబడుచున్నది" (ఎఫెసీ 5:8-9). మన జీతంలో వెలుగు ఫలముంటే, మనం ఈ లోకానికి వెలుగైయున్నాము.

**మన దేవుడు మంచివాడు.** యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికొనుడి. ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు (కీర్తన 34:8). "ఆయన నీతిని న్యాయమును ప్రేమించుచున్నాడు. లోకము యెహోవా కృపతోనిండియున్నది" (కీర్తన 33:5). ఆయన మంచితనాన్ని మనం ఈ లోకములో పంచాలి. ఆయన కృపగలవాడు. దయాదాక్షిణ్యపూర్ణుడు. శ్రేష్టమైన ప్రతి యీవిని, సంపూర్ణమైన ప్రతివరమును ఆయన మనకనుగ్రహించియున్నారు. ఆయన మేలు చేయుచు సంచరించెను (అపొ.కా. 10:38). మనం మంచి తండ్రియైన దేవుని బిడ్డలుగా యుండాలంటే ఆయనకు లోబడుచు జీవించాలి. ఏలయనగా "దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింప బడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము" (ఎఫె 2:10). "వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు తన సహోదరుని ద్వేషించువాడు ఇప్పటివరకును చీకటిలోనే యున్నాడు. తన సహోదరుని ప్రేమించువాడు వెలుగులో ఉన్నవాడు; అతనియందు అభ్యంతర కారణమేదియు లేదు." (1 యోహా 2:9-10).

**మన దేవుడు నీతిమంతుడు** (కీర్త 119:137). ఆయన వాక్యమును బట్టి నడుచుకొనువారాయన దృష్టిలో నీతిమంతులు. నీతిమంతులకొరకు ఆయన

కనుదృష్టి లోకమంతటా సంచరించుచున్నది. నోవహు కాలము నాటి దుష్టజనాంగమును ఆయన నాశనము చేసెను. గాని నీతిమంతుడైన నోవహును అతని కుటుంబమును ఆయన రక్షించెను.

దేవునివాక్యము నీతియైయున్నది. ఆయన ఆజ్ఞలన్నియు న్యాయములు (కీర్తన 119:172). దేవుని వెంబడించువారు ఆయన దృష్టిలో నీతిమంతులు.

"మీరు లోకమునకు వెలుగైయున్నారు... మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి"యని యేసు తన శిష్యులకు చెప్పెను (మత్తయి 5:14-16). కుంచము క్రింద పెట్టబడిన దీపము ఆక్సిజన్ లేనందున త్వరలో ఆరిపోవును. మంచితనము, నీతియును వాటిని మరుగుచేయలేము. "ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగే గదా" (ఎఫెసీ 5:13).

మనం సత్యములో యుండి, నీతి గలిగి జీవిస్తే ఈ లోకమునకు వెలుగైయుందుము. సూర్యుడు పలువిధములైన వాయువులను మండించుట ద్వారా వెలుగిచ్చును. ఇంకోమాటలో శక్తిని మండించుట ద్వారా వెలుగు పుట్టును. మనం దేవుని వాక్యము ప్రార్థన సహవాసము ఆరాధనల ద్వారా శక్తిని పొందుదుము.

మనం ఈ లోకమునకు వెలుగైయుండకపోతే, తేజస్సులో నివసించు దేవుని సమీపింపలేము. "అందుచేత నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలో నుండి లెమ్ము, క్రీస్తు నీ మీద ప్రకాశించుచున్నానని ఆయన చెప్పుచున్నాడు" (ఎఫెసీ 5:14).

"నీకు వెలుగు వచ్చియున్నది. లెమ్ము తేజరిల్లుము. యెహోవా మహిమ నీ మీద ఉదయించెను" (యెష 60:1).

# దేవుని దొడ్డిలోనికి మానవుని తిరిగి చేర్చుట

## (Returning Man into God's Fold)

దేవుడు ఆకాశమును భూమిని, దానిలోని సమస్తమును ఆరుదినములలో చేసెను. దేవుడు నేల మంటి నుండి నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది. 2:7). దేవుడైన యెహోవా ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి దానితో స్త్రీని నిర్మించి ఆస్థానమును మాంసముతో పూడ్చివేసెను. ఆస్త్రీని ఆతనికి ఒక సాటియైన సహాయంగా చేసెను. ఆయన సృష్టికార్యమంతటిని ముగించి ఏడవదినమున విశ్రమించి దానిని పరిశుద్ధపరచెను. దేవుడైన యెహోవా ఒక తోటను వేసి చూపునకు రమ్యమైనదియు, ఆహారమునకు మంచిదియునైన వృక్షములను జీవ వృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షములను మొలిపించెను. ఆయన మానవుని ఏదెనువనమును సేద్యపరచుటకు కాపుకాయుటకు అందుంచెను. దేవుడైన యెహోవా ఈతోటలోనున్న ప్రతి వృక్షఫలమును నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు, నీవు వాటిని తినుదినమున నిశ్చయముగా చచ్చెదవు (ఆది2:16,17) అని చెప్పెను. "దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా మీరుఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచు కొనుడి" (ఆది 1:28).

దేవుడు నేలమంటినుండి నరుని నిర్మించారు. అందువల్ల భూమిలో ఉన్నటువంటి రసాయనాలే మానవుడు తన శరీరంలో కలిగి ఉన్నాడు. గాని ఆతని ప్రాణాత్మలు మాత్రం జీవముగల దేవుడు సృష్టించారు. అతని మనుగడకు అన్నికరాల మంచి ఆహారమును మొలి పించారు. అతడు చేయుటకు పనిని జీవముగల ప్రతి దానిని ఏలుటకు ఈ భూమి మీద అధికారమును ఇచ్చారు. లోబడుటకు ఆజ్ఞను ఇచ్చి దానిని జవదాటితే వచ్చే పర్యవసానము గురించి ఆయన అతనిని హెచ్చరించారు.

మానవుడు దేవుని ఆజ్ఞను మీరి తినవద్దు అనిన పండును తినినట్లు మనం లేఖనముల ద్వారా తెలిసి కొనగలం. దేవుడు సర్పమును, ఆదాము, హవ్వలను, భూమిని శపించారు. ఆయన చర్మపు చొక్కాయిలను చేయించి వారికి ధరింపచేసారు. "అప్పుడాయన ఆదామును వెళ్లగొట్టి ఏదెను తోటకు తూర్పుదిక్కున కెరూబులను, జీవవృక్షమునకు పోవు మార్గమును కాయుటకు ఇటు ఆటు తిరుగుచున్న

ఖడ్గజ్వాలలను నిలువబెట్టెను "(ఆది 3:24). మానవుని యొక్క ఆజ్ఞాతి క్రమము వల్ల లోకంలో పాపం ప్రవేశించింది. ఆదాముయొక్క పాపమువల్ల ఆధ్యాత్మిక మరణము భౌతిక మరణము ఈ లోకంలోకి ప్రవేశించాయి. ప్రేమగల దేవుడు మానవుడు నిత్యము తనతో సంతోషంగా జీవించాలని మానవుని నిర్మించారు గాని పాపము మానవుని ఆతని ప్రేమగల తండ్రినుండి వేరుపరచింది. ఆయన పిల్లలను ఆయన కౌగిటిలోకి తిరిగి చేర్చుకోడానికి, మానవజాతిని రక్షించ డానికి ఆయన ఒక పథకం తయారు చేసారు. మనం నశింపక నిత్యజీవము పొందునట్లుగా దేవుడు ఆయన అద్వితీయ కుమారుని ఈ లోకంలోనికి పంపారు (యోహాను 3:16). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనష్య కుమారుడు వచ్చెను" (లూకా 19:10). "అయితే కాలము పరిపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రముకు లోబడియున్న వారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను. మరియు మీరు కుమారులై యున్నందున నాయనా, తండ్రీ అని మొరపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయములోనికి పంపెను. కాబట్టి నీవిక దాసుడవు కావు కుమారుడవే. కుమారుడవైతే దేవుని ద్వారా వారసుడవు" (గలతీ 4:4-7).

ఆయన కుమారుడైయుండియు తానుపొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకు డాయెను". (హెబ్రీ 5:8,9; 1 పేతురు 3:18; 1:25). ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మనప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23).

ఆదాముయొక్క ఆజ్ఞాతిక్రమము వల్ల మరణము ఈలోకంలో ప్రవేశించింది. మొదటి మనష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మానవుడు పరలోకమునుండి వచ్చిన వాడు (1 కొరిం 15:47). ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందుఅందరు బ్రతికింపబడుదురు (1కొరింథీ 15:22). "మరియు మనము మంటినుండి పుట్టిన వాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము (1కొరింథి 15:49). మానవుడు పాపము చేసి ఆపోలికను పోగొట్టు కొనెను. మనము తిరిగి ఆయన పోలికను పొందునట్లు యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకంలోకి వచ్చారు. గలతీ సంఘానికి అపొ॥ పౌలు ఇలారాస్తున్నాడు "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీ యందేర్పడు వరకు మీ విషయమై మరల

నాకు ప్రసవ వేదన కలుగుచున్నది" (గలతీ 4:10). ఫిలిప్పీలో నున్న క్రైస్తవులకు అతను ఈలాగు చెప్పాడు: "మన పౌరస్థితి పరలోకమందున్నది, అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అనురక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తము తనకు లోపరుచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గల దానిగా మార్చును" (ఫిలిప్పీ 3:20,21). "మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింప జేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3:18).

బాప్తిస్మము ద్వారా యేసుప్రభువుకు విధేయత చూపినవారు క్రీస్తును ధరించు కున్నారు. వారు ఆయనరక్తము ద్వారా శుద్ధిచేయబడి క్రీస్తుసంఘమునకు చేర్చ బడుచున్నారు. అట్టివారు ఆయన కుటుంబములోనివారు. వారు దినదినము ఆయన పోలికలోనికి మార్చబడుచున్నారు (2 కొరింథీ 3:18; గలతీ 4:19).

"సమస్తమును దేవుని వలననైనవి, ఆయన మనలను క్రీస్తుద్వారా తనతో సమాధానపరచుకొని ఆ సమాధాన పరిచర్యను మాకు అనుగ్రహించెను (2 కొరిం 5:18). మనము ఆయన రక్తములో కడుగబడి ఆయనతో సమాధానపడి మరల తిరిగి ఆయన పిల్లలమైనాము. "ప్రియులారా, యిపుడు మనము దేవుని పిల్లలమై యున్నాము మనమిక ఏమవుదుమో అది ఇంకా ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" ( 1 యోహాను 3:2)

మన ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు ఆయన వధువుతో నిత్యము ఉండునట్లు ఆయన తన సంఘమునకు తిరిగి వచ్చుచున్నారు "మన మందరము నిద్రించముగాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మన మందరము మార్పు పొందుదుము" (1 కొరిం 15:52). "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును, క్రీస్తునందుండి మృతులైన వారు మొదటలేతురు ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశముండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము (1థెస్స 4:16, 17). "చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (కీర్త 23:6). మనము నిత్యము ఆయనతో నుండవలెననేది దేవుని పథకము. ఎప్పటికి ఆయనతోనే నివసించాలనే ఉద్దేశ్యం నీకేమైనా ఉందా? సిద్ధపడు.

# జక్కయ్య నుండి ఒక పాఠం

## (A Lesson from Zaccheus)

బైబిలునందు బహుగా ప్రాచుర్యము నొందిన వారిలో జక్కయ్యను కూడా మనం చూడగలం. యేసు సంచరించుచు యెరికో పట్టణము గుండా జన సమూహ ములలోనుండి యెరూషలేమునకు చివరి సారిగా సాగిపోతున్నప్పుడు సుంకపు గుత్త దారుడును ధనవంతుడునైన జక్కయ్యను యేసు చూచెను. యేసు ఎవరోయని మనసునందు కోరిక గల్గి ఆయనను అతడు చూడగోరెను గాని అతడు పొట్టివాడైనందున జనులు గుమిగూడి యున్నందున చూడలేకపోయెను. అప్పుడు యేసు ఆ త్రోవను రానైయుండెనని తెలిసికొని అతడు ముందుగా పరుగెత్తి, ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టెక్కెను. "యేసు ఆ చోటుకు వచ్చినప్పుడు, కన్నులెత్తి చూచి – జక్కయ్యా త్వరగా దిగుము, నేడు నేను నీ యింట నుండవలసియున్నదని అతనితో చెప్పగా అతడు త్వరగా దిగి సంతోషముతో ఆయనను చేర్చుకొనెను. అందరూ అది చూచి – ఈయన పాపియైన మనుష్యునియొద్ద బసచేయ వెళ్ళెనని చాలా సణుగుకొనిరి. జక్కయ్య నిలువబడి – ఇదిగో ప్రభువా, నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను; నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసుకొనినయెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు – ఇతడునూ అబ్రాహాము కుమారుడే : ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను" (లూకా 19:5–10).

### రక్షణ అందరికి

ఇక్కడ, యేసును చూడగోరి జక్కయ్య ఏవిధంగా వెదికెనో భక్తుడైన లూకా వివరించెను. అదే విధంగా యేసుకూడా జక్కయ్యను చూడగోరి వెదికెనా? అవును. "ఎందుకనగా నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను (లూకా 19:10). జక్కయ్య నశించినవాడై యుండెను. యేసుకూడా అతనిని వెదకెను. యెరికో పట్టణమందు జక్కయ్య తప్ప మరి యెవరును రక్షణ నొందుటకు గాను నశించినవారు లేరా? లేఖనములు ఈ విధంగా చెప్పుచున్నవి: "ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది.

ఆయన మనుష్యులందరూ రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:3–4).

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. ఏలయనగా ఆయన తన అద్వితీయ కుమారుని ద్వారా లోక రక్షణార్థమై ఆయన సిలువ మరణము నొందునంతగా ప్రేమించెను. యేసు ఈలాగు పలికెను: "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతిని కలుగజేతును" (మత్తయి 11:28). మరియు "తన యెడల యదార్థ మృదయముగల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది" (2 దినవృ 16:9).

## రక్షింపబడేవారు కొందరే

అందరూ పిలువబడినవారే కాని కొందరు మాత్రం ఏర్పరచుకొనబడిన వారు. వారిలో జక్కయ్య ఒకడు. ఎందు కనగా అతడు దేవుని గూర్చి వినినప్పుడు ఆయనను చూడగోరి వెదకెను. "దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:8). యేసుద్వారా స్వస్థతనొందిన రోజులలో అనేకులు మొదట ఆయన యొద్దకు వచ్చిరి. అప్పుడాయన వారితో "మీ విశ్వాసమే మిమ్ములను శుద్ధులను చేసెను" అని చెప్పెను. మరియు "ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టు చున్నాను. ఎవడైననూ నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతనియొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడా అతడును భోజనము చేయుదుము" (ప్రకటన 3:20). సమస్త జనులను ఆయన ప్రేమించి రక్షింపనుద్దేశించి వెదకుచూ ప్రతి హృదయము నొద్ద నిలుచుండి పిలుచుచు తట్టుచున్నారు. ఆయన స్వరము గుర్తించి తలుపు తెరచిన ఆయన వానితో కలసి భోజనము చేయును.

## వెదకాలి

తరువాత, జక్కయ్య పొట్టివాడు. ఈ లేమి వలన జనసమూహములో నుండి యేసును చూడలేకపోయెను. అయిననూ నిరాశ చెందక యేసును గాంచవలెనన్న యిచ్ఛతో పరుగెత్తి మేడిచెట్టెక్కెను.

యేసుద్వారా గ్రుడ్డివాడు స్వస్థత నొంది చూపు పొందుటకు ముందు "ఒక ధనికుడైన అధికారి పరిగెత్తుకొని వచ్చి ఆయన యెదుట మోకాళ్ళూని – సద్బోధ కుడా, నిత్యజీవమునకు వారసుడ నగుటకు నేనేమి చేయుదునని ఆయనను

అడిగెను" (మార్కు 10:17). అందుకు యేసు ఆజ్ఞలకు లోబడి యుండవలెనని నీకు తెలియును కదా! అని అతనితో చెప్పెను. అందుకతడు – బోధకుడా, బాల్యమునుండి ఇవి అన్నియు అనుసరించుచునే యుంటినని చెప్పెను. యేసు అతని చూచి అతని ప్రేమించి – నీకు ఒకటి కొదువగా నున్నది; నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము. పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడిపుమని చెప్పెను. అతడు మిగుల ఆస్థిగలవాడు గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దు:ఖపడుచు వెళ్ళిపోయెను" (మార్కు 10:20–22). ఈ ధనవంతుడైన అధికారి నిత్యజీవమునకు వారసుడగుటకు తృష్ణగొని యుండెను గాని తనకు కొదువయై యున్నదానిని యేసు ద్వారా గ్రహించినవాడైనను దానిని విడువలేక విచారముగా తనదారిని తాను వెళ్ళిపోయెను.

### జయించాలి

ఎవరునూ సత్ప్రవర్తన కల్గియుండ లేరు. ప్రతివానికి వాని వాని సమస్యలు కలవు. ఇవి మనిషి మనిషికి వేరువేరుగా నున్నవి. ఇహ సంబంధ జీవితమునకు నీతి విషయంలో విశ్వాసము కల్గిన క్రైస్తవ జీవితమునకు మధ్య ఎల్లప్పుడునూ ఆటంకములున్నవి. వాటినుండి విముక్తులమై మనకాడి మనమెత్తుకొని ఆయనను వెంబడించుటను యేసు కోరుచున్నారు. "నేను జయించి నా తండ్రి సింహాసనము నందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతోకూడా నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను" (ప్రకటన 3:21).

యేసు మన జీవితంలో ప్రవేశించిన నాడు, జక్కయ్య జీవితంలో కల్గిన మార్పు వంటిది మన జీవితంలోను కల్గును. "ఇదిగో ప్రభువా నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను; నేనెవనియొద్దనైననూ అన్యాయముగా దేనినైననూ తీసుకొనినయెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను" (లూకా 19:8).

యేసు మనలను ఆయన యొద్దకు చేర్చుకొనుటకై వెదుకుచూ పిలుచు చున్నారు. మనము ఆటంకము లన్నిటిని జయించి ఆయనను వెదకిన యెడల నిత్యజీవమునకు వారసులము కాగలము.

# నిశ్చలమైన రాజ్యము

## (The unshakeable Kingdom)

కదల్చబడని, నిశ్చలమైన రాజ్యమును గూర్చి హెబ్రీ పత్రిక రచయిత మనకు చెబుతున్నాడు. ఆ రాజు ఎవరు? ఎవరిని గురించి అతడు మాట్లాడుచున్నాడు? రోమీయుల యొక్క బానిసత్వమునుండి తమను విడిపించగల రాజు కొరకు రోమా సామ్రాజ్యంలోని యూదులు ఎదురుచూస్తున్నారు (అపో. కా. 1:6). "ఇదిగో నీవు గర్భము ధరించి కుమారునికని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు. ఆయన తన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును".

ఆయన రాజ్యము అంతము లేనిదని దూత మరియతో చెప్పింది (లూకా 1:31-33; దానియేలు 7:13-14).

తూర్పుదేశపు జ్ఞానులు తూర్పు దిక్కున నక్షత్రమును చూచారు. వారి లేఖనాలు యూదుల రాజును గూర్చి వారికి తెలిపాయి. వారు హేరోదురాజు నొద్దకు వచ్చి "యూదుల రాజుగా పుట్టినవాడెక్కడనున్నాడు? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి" (మత్తయి 2:2).

గలిలయ సముద్ర తీరంలో యేసుప్రభువు 5,000 మంది పురుషులు అసంఖ్యాకమైన స్త్రీలు, పిల్లలకు ఐదు రొట్టెలు రెండు చిన్న చేపలతో ఆహారం పెట్టారు. అది చూసిన యూదులు కొందరు ఆశ్చర్యపడి ఆయనను రాజుగా చేయుటకు ప్రయత్నించారు. గాని, ఆయన రాజ్యము భూలోక సంబంధ మైనది కాదు గనుక ఆయన ఒంటరిగా కొండప్రాంతాలకు తప్పించుకొని వెళ్ళిపోయారు (యోహాను 6:15; 18:36).

ఆయన శిష్యులలో ఒకని ద్వారా యేసుప్రభువు మోసగింపబడి పిలాతు ఎదుట నిలువబడినపుడు గవర్నరు ఆయనను అడిగాడు -"యూదుల రాజువు నీవేనా?" అని; "యేసు అతని చూచి - నీవన్నట్టే అనెను" (మత్తయి 27:11; మార్కు 15: 2-5; యోహాను 18:37). సైనికులు ఆయన సిలువకు పైగా

“యూదులరాజైన యేసు” (మత్త 27:37, యోహా 18:37) అని వ్రాసి పెట్టారు. అపొస్తులుడైన పౌలు కూడా యూదులు, అన్యజనుల మధ్య రాజైన యేసుక్రీస్తును గూర్చి బోధించాడు (అపొ.కా. 17:7). తిమోతికి కూడ ఆయన ఇలా చెబుతున్నారు. “శ్రీమంతుడును, అద్వితీయుడునగు సర్వాధిపతి... రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునైయున్నాడు” (1 తిమోతి 6:15), “ఆయన భూపతులకు అధిపతి” (ప్రకటన 1:5) అని చెప్పబడ్డారు. “వీరు గొఱ్ఱెపిల్లతో యుద్ధము చేతురుగాని... ఆయన ప్రభువులకు ప్రభువును, రాజులకు రాజునైయున్నారు” (ప్రకటన 17:14).

రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు అయిన ఆయన ఇపుడు సింహాసనాసీనుడై ఏలుచున్నారు. హెబ్రీ గ్రంధకర్త ఇలా అంటున్నాడు: “ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తి మంతము నైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు పాపముల విషయములో శుద్ధీకరణము తానేచేసి దేవదూతల కంటే ఎంత శ్రేష్టమైన నామము పొందెనో వారికంటే అంత శ్రేష్టుడై ఉన్నత లోకమందు మహామహు డగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను” (హెబ్రీ 1:1–3; 10:12). “నేను జయించి నాత్రండితోకూడ ఆయన సింహాసనము నందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతో కూడా నా సింహాసనమునందు కూర్చుండ నిచ్చెదను” అని తనకు కలిగిన దర్శనంలో యోహానుతో యేసు ప్రభువు చెప్పారు (ప్రకటన 3:21). “ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి ...... పరలోకమునందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు” (ఎఫెసి 1:20) అని పౌలు తన పత్రికలో చెబుతున్నాడు. కొలస్సయులకు ఇలా చెబుతున్నాడు: “మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తుదేవుని కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు” (కొలస్స 3:1; హెబ్రీ 12:2; 1 పేతురు 3:22). అపొ.కా. 7వ అధ్యాయంలో స్తెఫను హతసాక్షి కావడం మనం చూస్తాం. యూదుల అధికారులు స్తెఫను మాటలు వినినపుడు అతడు ఆత్మతో నిండు కొనినవాడై ఆకాశమువైపు తేరి చూచి, దేవుని మహిమను, యేసుదేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుటను చూచెను” (అపొ.కా. 7:54,55). ఆయన కొరకు నిలువబడి, మృతి చెందిన హతసాక్షికోసం యేసుక్రీస్తు నిలుచుండి ఆహ్వానించారు.

రాజులకు రాజు, ప్రభువులకు ఈ భూమిపై ఆయన రాజ్యం స్థాపించారు. దాని నిమిత్తమే క్రీ॥పూ 600లో దానియేలు ప్రవక్త ప్రవచించాడు. "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగయుగముల వరకు నిలుచును" (దాని 2:44). మొట్టమొదటి సంఘము పెంతుకోస్తుదినమున ఏర్పడినప్పటినుండి క్రైస్తవయుగము ప్రారంభమైంది (అపొ.కా. 2వ అధ్యా).

యేసుక్రీస్తు యొక్క దూత అయిన బాప్తిస్మమిచ్చు యోహాను "పరలోక రాజ్యము సమీపించి యున్నది. మారు మనస్సు పొందుడి" (మత్త 3:1) అని ప్రకటించాడు. యేసుప్రభువు పరలోక రాజ్యమును గూర్చి ప్రకటించారు. "అప్పటినుండి యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది. గనుక మారు మనస్సు పొందుడి అని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను" (మత్త 4:17, 23; లూకా 8:1). యేసు ప్రభువు పన్నెండుగురు శిష్యులను ఏర్పరచుకొని వారిని ఇశ్రాయేలీయులలో నశించిన గొర్రెల యొద్దకు పంపుతూ పరలోక రాజ్యము సమీపించియున్నది అని ప్రకటించుడి అని తెలిపారు (మత్త 10:7). విత్తువాని ఉపమానములో ఆయన తన శిష్యులకు చెబుతూ "ఎవడైనను రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపక యుండగా" (మత్త 13:19) అంటూ మత్తయి 13వ అధ్యాయంలో దేవుని రాజ్యమును గురించి వివరించుటకు అనేక ఉదాహరణలు ఇచ్చారు. పునరుత్థానము తరువాత భూమి మీద నలుబది దినాలు ఆయన దేవుని రాజ్యమును గూర్చి బోధించారు. "ఆయన శ్రమపడిన తరువాత నలువది దినముల వరకు వారికగపడుచు, దేవుని రాజ్య విషయము లను గూర్చి బోధించుచు, అనేక ప్రమాణ ములను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచు కొనెను" (అపొ.కా. 1:3).

"దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు ఆయననడిగినపుడు ఆయన దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు, ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక ఇదిగో ఇక్కడ నని, అదిగో అక్కడనని చెప్పవీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను" (లూకా 17: 20–21). మీరైతే ఆయన రాజ్యమును మొదట వెదకుడి, దానితో కూడ ఇవి మీకనుగ్ర హింపబడును, చిన్నమందా భయపడ కుడి, మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీతండ్రికి ఇష్టమైయున్నది"

(లూకా 12:31, 32 అని ఆయన శిష్యులకు చెప్పారు.

బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి యేసు ప్రభువు ఇలా చెప్పారు "స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోకరాజ్యములో అల్పుడైనవాడు అతని కంటె గొప్పవాడు" (మత్త 11:11). పరలోక రాజ్యములో నున్న క్రైస్తవుడు బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు ఎందుకనగా బాప్తిస్మమిచ్చు యోహాను పరలోకరాజ్యము (సంఘము) స్థాపించక పూర్వమే జన్మించడం మరణిం చడం జరిగిపోయినవి.

యేసు ప్రభువువారు రూపాంతరం చెందక ముందు "ఇక్కడ నిలచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుటచూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" (మార్కు 9:1). పెంతెకోస్తు దినమున దేవుని రాజ్యము శక్తితో స్థాపింపబడినపుడు ఆయన శిష్యులు ఇంకా బ్రతికే ఉన్నారు (అపో. కా. 2). జనసమూహమునకు యేసు ప్రభువు కొండమీద నుండి ఇలాగు చెప్పారు "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" (మత్త 6:33). నూతన యెరూషలేము దేవుని రాజ్యము, దేవుని ఇల్లు. కీర్తనాకారుడంటాడు "నీ మందిరమునందు నివసించువారు ధన్యులు" (కీర్తన 84:4). నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది (కీర్తన 69:9). "యెహోవా మందిరమునకు వెళ్లుదు మని జనులు నాతో అనినపుడు నేను సంతోషించితిని" (కీర్తన 122:1). ప్రభువు ప్రార్థన తన శిష్యులకు ఎలాప్రార్థించాలో యేసుప్రభువు వారికి నేర్పిన ప్రార్థన. అందులో ప్రభువు "నీ రాజ్యము వచ్చు గాక" అని నేర్పారు (మత్త 6:9). ఎందుకనగా అప్పటికింకా రాజ్యము స్థాపింపబడలేదు. గనుక "రాజ్యము కొరకు ప్రార్థించడానికి యేసుప్రభువు వారికి నేర్పారు. రాజ్యము రావాలని మనం ప్రార్థన చేయనవుసరంలేదు ఎందుకనగా పెంతుకోస్తుదినాన క్రీస్తుశకము 33లో యెరూషలేములో దాని స్థాపన జరిగిపోయింది. గనుక "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని పౌలు అంటున్నాడు (కొలస్స 1:13). యేసుక్రీస్తు రక్తము ద్వారా కడుగబడిన వారందరు ఆయనలోనికి బాప్తిస్మము పొంది ఆయన రాజ్యములోనికి లేదా సంఘములోనికి మార్చబడు

చున్నారు. "ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అపొ. కా. 2:47). ఒకడు యేసు ప్రభువు నామములో బాప్తిస్మము పొందిన యెడల అతడు రక్షింపబడును (మత్త 28:19, మార్కు 16:16).

అపొస్తలుడైన యోహాను తనను గురించి ఇలా చెబుతున్నాడు "మీ సహోదరుడు యేసును బట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను సహనములోను పాలివాడనైన యోహాను అను నేను" (ప్రకటన 1:9). బాప్తిస్మము ద్వారా ఆయన శరీరములో చేరి ఆయన రాజ్యములో భాగముకావడానికి మనమంచి దేవుడు మనకు గొప్పఅవకాశం ఇచ్చారు. గనుక హెబ్రీగ్రంధకర్త ఇలారాస్తున్నాడు "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృపకలిగియుందము. ఆకృప కలిగి వినయభయ భక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:27).

# సంఘములో స్త్రీ పాత్ర

## (The Role of Woman in the Church)

ప్రభువైన దేవుడు సృష్టిలోని ప్రతి దానిని ఆరు దినాలలో సృజించారు. ఆరవ దిమున ఆయన స్త్రీని, పురుషుని ఆయన పోలికలో సృజించారు. దేవుడు ప్రతిదానిని సృజించి అది మంచిదైనట్టుగా చెప్పారు. అయితే నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు, వానికి సాటియైన సహాయమును వాని కొరకు చేయుదుననుకొనెను. దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును, ప్రతి ఆకాశపక్షిని నేలనుండి నిర్మించి, ఆదాము వాటికి ఏపేరు పెట్టునో చూచుటకు వాటిని అతని యొద్దకు రప్పించెను. జీవముగల ప్రతిదానికిని ఆదాము ఏ పేరుపెట్టెనో ఆ పేరు దానికి కలిగెను. అప్పుడు ఆదాము సమస్త పశువులకును, ఆకాశపక్షులకు, సమస్త భూజంతు వులకును పేరులు పెట్టెను. అయినను ఆదాముకు సాటియైన సహాయము అతనికి లేకపోయెను. అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగ జేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటె ముకలలో ఒకదానిని తీసి ఆచోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను" (ఆది.కా. 2:18-22).

ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యముతో ప్రత్యేకమైన అవసరంతో స్త్రీ నిర్మింప బడింది. స్త్రీ - భార్యగా, తల్లిగా, కుమార్తెగా, సోదరిగా ఇంకా అలా ఎన్నో పాత్రలు కలిగి ఉన్నది. స్త్రీ తన బాధ్యతలను సరియైన రీతిలో నిర్వర్తించినపుడు ఆమె కుటుంబము దీవింపబడుతుంది. అలాకానిచో ఆ కుటుంబము ఇబ్బందులు పాలవుతుంది. కుటుంబానికి పెద్ద భర్తే అయినప్పటికీ స్త్రీ లేకుండా ఆ కుటుంబం పరిపూర్ణంకాదు. పురుషులు ఇంటిలోను, సంఘంలోను నాయకులు గాని స్త్రీలు మాత్రం ఇంటిలోను సంఘంలోను బాధ్యతలు కలిగి ఉన్నారు. తన కుటుంబం యోగక్షేమాలు చూచుకొనే ఒక అద్భుత మైన సహచరి స్త్రీ.

దేవుడు భూమిపై స్థాపించిన మొదటి వ్యవస్థ కుటుంబము. ఆయన సృష్టించిన ప్రతిదానికి కొన్ని నియమాలు ఏర్పరచారు. ఆ నియమాలు అనుసరించి నంతకాలం మనం శాంతి, సంతోషాలతో కూడిన జీవనం సాగిస్తాం. దేవుడు

మానవుని తన పోలికలో సృజించారు. "పురుషుడైతే దేవుని యొక్క పోలికయు మహిమయునై యున్నాడు" (1 కొరింధి 11:7). "నీ ముఖము చెమటకార్చి ఆహారము తిందువు" (ఆది. కా 3:19, 1తిమోతి 5:8). దేవుడు ఇప్పటివరకు ఈ చట్టాన్ని మార్చలేదు. హవ్వ నాయకత్వం కోసం నిర్ణయం తీసికొని సాతాను యొక్క ఉచ్చులో పడింది. దేవుడు మొదటిగా పురుషుని సృజించి ఆ తరువాత అతనికి సహకారిగా స్త్రీని సృజించారు (1 కొరింధి 11:8). స్త్రీని బలహీనఘటము అని పేతురు అభివర్ణిస్తున్నాడు (1పేతురు 3:7). ఆమె ఉద్రేకపరంగా బలహీను రాలు అనగా దయ, ప్రేమతో నిండినది. గనుక త్వరగా తేలికగా ఇతరుల వల్ల ప్రభావితం కాగలదు. భౌతికంగా చూస్తే పురుషుని కంటె ఆమె బలహీనురాలు. ఒక తీగవలె ఇతరులపై ఆధారపడు లాగున స్త్రీలు సృజింపబడ్డారు. బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో బిడ్డలు ఆమెను గూర్చి జాగ్రత్త తీసు కుంటారు. యౌవన స్త్రీలకు బోధించవల సిందిగా పౌలు వృద్ధస్త్రీలను ప్రోత్సహి స్తున్నాడు.

"వృద్ధ స్త్రీలు ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు దేవుని వాక్యము దూషింపబడకుంటునట్లు, యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడియుండి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును స్వస్థబుద్ధి గలవారును పవిత్రులును ఇంటనుండి పనిచేసికొనువారును మంచి వారునై యుండవలెననియు బోధించుము (తీతు 2:3-5).

పురుషుడు కుటుంబానికి శిరస్సు, నాయకుడు. స్త్రీ లారా! ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడి యుండుడి (ఎఫెసి 5:22; కొలస్స 3:18; 1 పేతురు 3:1). భర్తలు తమ భార్యలను ప్రేమించినపుడు, భార్యలు తమ భర్తలకు లోబడియుండినపుడు ఆ యిల్లు ఆనందంతో ఆశీర్వాదంతో నిండినదౌతుంది (కొలస్స 3:19). "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట ఆదామును తరువాత హవ్వయును నిర్మింపబడిరికారా? మరియు ఆదాము మోసపరచబడలేదు గాని స్త్రీ అపరాధములో పడెను" (1తిమో 2:11-14). మొదటిగా పురుషుడు సృజింపబడినను అతడు మోసపరచబడలేదు. స్త్రీ మొదటిగా మోసగింపబడి మొదటిగా దేవుని ఆజ్ఞకు అవిధేయురాలైంది.

పరిశుద్ధ గ్రంథం స్త్రీకి ఎట్టి ప్రాధాన్యతనిస్తుంది? పురుషుడు దేవుని పోలికలో సృజింపబడ్డాడు. పురుషుడు మోసగింపబడలేదు. పురుషునికి ప్రథమ స్థానం ఇయ్యబడింది. స్త్రీలు అలాకాదు ఆమె బాగా మంచిది లేదా చాలా చెడ్డది అయి ఉంటే తప్ప సాధారణంగా స్త్రీల పేర్లు బైబిలులో చెప్పబడలేదు. స్త్రీల యొక్క సంఖ్యగాని వారిపేర్లుగాని జనన పట్టికలో చెప్పబడలేదు. బైబిలులోని ఏ పుస్తకమును స్త్రీలు వ్రాయలేదు.

యాకోబునకు పండ్రెండుగురు కుమారులున్నారు. వారి పండ్రెండు గోత్రాలను దేవుడు దీవించారు గాని యాకోబు కుమార్తె దీనా పేరుతో ఒక గోత్రం కూడా లేదు. దేవాలయములోని సేవలో స్త్రీయాజకురాలుగా ఉండాలని దేవుడు ఎక్కడా చెప్పలేదు. న్యాయాధి పతులు గ్రంథం 4వ అ॥లో మనము దెబోరా అనే ఒక ప్రవక్త్రి గురించి చదువుతాము. అప్పటిలో ఇశ్రాయేలీ యులలో సమర్థులైన పురుషులు లేరు. గనుకనే దెబోరా, యెషయా ప్రవక్త భార్యలాంటివారున్నారు (యెషయా : 8:3). తన తరపున ప్రజలతో మాట్లాడు టకు గాను పురుషులనే దేవుడు నియమించారు గాని యూదాలోగాని ఇశ్రాయేలులోగాని ఏలికలుగా రాణులు లేరు.

యేసుప్రభువుయొక్క పండ్రెండుగురు అపొస్తలులు పురుషులే స్త్రీలు లేరు. సంఘ కార్యక్రమాలలో తమకు సహాయపడుటకు గాను అపొస్తులులు ఏడుగురు పెద్దలను ఏర్పరచుకున్నారు. వారిలో స్త్రీలు ఎవరులేరు (అపొ. కా. 6:5). పెద్దలయొక్క అధ్యక్షులయొక్క అర్హతలను గూర్చి పౌలు ఇలా వ్రాస్తున్నాడు "ఎవడైనను అధ్యక్షపదవి నాశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించు చున్నాడనుమాట నమ్మదగినది. అధ్యక్షుడ గువాడు నిందారహితుడు, ఏకపత్నీ పురుషుడును తన ఇంటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను" (I తిమో 3:1-3, తీతు 1:5-9). పెద్దలుగా, అధ్యక్షులుగా ఉండవలసిన స్త్రీల యొక్క అర్హతలు పరిశుద్ధ గ్రంథంలో ఎక్కడా చూడము. తనతోపాటు మంచి పరిచర్య చేసిన స్త్రీలయిన కెంక్రేయలోని ఫీబె అను సహోదరిని గురించి, ఫిలిప్పీ సంఘంలో యువోదియ, సుంటుకె అనువారిని గురించి పౌలువ్రాసాడు (రోమా 16:1, ఫిలిప్పీ 4:2-3).

లూకా 8వ అధ్యాయంలో కొందరు స్త్రీల పేర్లను వ్రాసాడు. ఏడు దయ్యాలను నుండి విడుదల పొందిన మగ్ధలేనె మరియ, హేరోదు గృహ నిర్వాహకుడకు

కూజా భార్యఅయిన యోహన్నా, సూసన్నా ఇంకా అనేకమంది స్త్రీలు తమకు కలిగిన దానితో సేవచేసిన వారిపేర్లు. ఈ స్త్రీలు యేసుప్రభువును సిలువ పునరుత్థానముల వరకు వెంబడించారు (మత్తయి 27:55; 28:1; మార్కు 16:1). క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్త లను గాను, కొందరిని సువార్తికులను గాను, కొందరిని కాపరులను గాను ఉపదేశకులను గాను నియమించెను (ఎఫెసీ 4:11).

**గనుక సంఘములో స్త్రీ పాత్ర ఏమిటి?**

"స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను, వారు లోబడి ఉండ వలసినదేగాని మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది. వారు ఏమైన నేర్చుకొన గోరిన యెడల ఇంట తమతమ భర్తలను అడుగవలెను. సంఘములో స్త్రీ మాట లాడుట అవమానము (1కొరింథీ 14:34,35). యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగిన అపొల్లో సమాజ మందిరంలో మాట్లాడడం అకుల, ప్రిస్కిల్ల విన్నారు. వారు అతని చేర్చుకుని దేవుని మార్గము మరిపూర్తిగా అతనికి విశద పరిచిరి. ఇది వారు బాహాటంగా చేయలేదు. (అపొ.కా. 18:25,26). క్రైస్తవురాలుగా ఆమె దేవునిని క్రమంగా ఆరాధించాలి. స్త్రీలు దేవుని కుటుంబములోని భాగము, ఆయన శరీరములోని సభ్యులు, ఆత్మతోను, సత్యముతోను ఆమె దేవుని ఆరాధించవలెను. దేవుని సేవకొరకు ద్రవ్యాన్ని ఇవ్వాలి (లూకా 8:1–3; నిర్గ 35:25–26). తమ పిల్లలకు ఇతర యౌవనులకు బోధించాలి (తీతు 2:3–5). సువార్త విస్తరణలో కష్టపడువారికి స్త్రీలు సహాయపడాలి, ఫీబె, యవోదియ, సుంటుకెల వలె.

ఆదిమ సంఘములోని స్త్రీలు మనకు మాదిరి. పేతురుకొరకు ప్రార్థించు లాగున మార్కు తల్లియైన మరియ తన గృహాన్ని పరిశుద్ధులకు తెరచింది (లూకా 12:12). గృహయజమానురాలు తన ఇంటిలో స్థలాన్ని ప్రార్థన కొరకు, కూడికల కొరకు ఇవ్వాలి. యొప్పేలోని క్రైస్తవ స్త్రీ తబిత లేదా దొర్కా అనేక సత్కార్యాలు, ధర్మ కార్యాలు చేసింది. సంఘములోని బీదలైన ఇతర స్త్రీలకు ఆమె సహాయం చేసింది. బీద విధవ రాండ్రకోసం వస్త్రాలు, అంగీలు కుట్టింది (అపొ.కా. 9:36–43). ఈ విధంగా అనేక రీతులు స్త్రీలు ఇతరులకు సహాయపడాలి. అపొ.కా 16:11–15 వరకు ఉన్న భాగంలో మనము లూదియ అను ఒక

సహోదరి మార్పుచెందడం గురించి చూస్తాం. ఆమె, ఆమె ఇంటివారు బాప్తిస్మము పొందిన వెంటనే ఆమె దైవసేవకుల వర్గానికి ఆతిథ్యమిచ్చింది. తద్వారా దేవుని వాక్యం ఆసియా అంతట వ్యాప్తిచెందింది. ఆతిథ్యము చేయ మరువకుడి, దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి (హెబ్రి 13:2). సణుగుకొనకుండా ఒకనికొకడు ఆతిథ్యం చేయుడి (1పేతురు 4:9, రోమా 12:13). ప్రిస్కిల్లా వలె వాక్యము ఎరుగని వారికి స్త్రీలు వాక్యాన్ని బోధించవచ్చు.

మంచిదేవుడు స్త్రీలకు పురుషులకు వివిధపాత్రలు కేటాయించారు. గాని దేవుని ఆజ్ఞలు మాత్రము అందరికి ఒక్కటే. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారందరు క్రీస్తును ధరించుకొని యున్నారు. ఇందులో యూదుడని, గ్రీసు దేశస్థుడనిలేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు. మీరు క్రీస్తు సంబంధు లైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు" (గలతీ 3:27-29).

మనకు నిర్ణయించబడిన పాత్రలో నిలిచియుండి ఆయన ఆజ్ఞలకు విధేయులమగుచు ఆశీర్వదింపబడిన వారంగా ఆనందముతో ఇపుడును ఎల్లపుడును ఉందుముగాక.

# దేవుడు మనలను మన కుటుంబములను ఆశీర్వదించును

## (The Lord will Bless us and our Families)

మానవ జీవిత వ్యవస్థలో కుటుంబము ప్రముఖ పాత్ర వహించు చున్నది. దేవుడు ప్రతివస్తువును నరుని సుఖసంతోషములకొరకు వాని క్షేమా భివృద్ధికొరకు సృజించెను. దేవుడైన యెహోవా ఆదాము మరియు హవ్వలను సృజించి, వారిని ఆశీర్వాదించెను. మీరు ఫలించి, అభివృద్ధి పొంది, విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచు కొనుడి (ఆది 1:28). "సుబుద్ధిగల భార్య యెహోవా యొక్క దానము". భార్య దొరికిన వానికి మేలు దొరికెను. అట్టివాడు యెహోవా వలన అను గ్రహము పొందినవాడు (సామె 18:22). యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము; సిగ్గు తెచ్చునది వాని ఎముకలకు కుళ్ళు (సామె 12:4; సామె 17:14; సామె 31:10–31). కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే, యౌవ్వన కాలమందు పుట్టిన కుమారులు బల వంతుని చేతిలోని బాణములవంటివారు. వారితో తన అంబులపొది నింపుకొనిన వాడు ధన్యుడు (కీర్త 127:3–5) ధనిక, పేద భేదము లేకుండా ప్రతిఒక్కరికి ఆనందముతో కూడిన గృహము అవసరము. ఎంత ధనవంతుని కైనను సంతోషములేనట్లయితే అతడు ఒంటరిగానే మిగిలిపోతాడు. మనమందరము సంతోష ముగా ఉండినయెడల కుటుంబమంతా సంతోషముగా ఉంటుంది. ఇంటిలో ఏ ఒక్కరికైనను అనారోగ్యంగా ఉంటే అందరూ బాధాకరంగానే ఉంటారు. కుటుంబ వ్యవస్థ లేనిదే మానవాళిలేదు.

దేవుడైన యెహోవా నోవహును అతని కుటుంబమును జల ప్రళయము నుండి కాపాడినారు (ఆది 6:18; 7:1). నోవహు అతని ఇంటివారి కొరకు ఒక ఓడను నిర్మించాడు. తన కుటుంబమును కాపాడినాడు. దేవుడు అబ్రహామును అతని ఇంటివారిని 'కానాను' వెళ్ళమన్నారు. దేవుడు భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడునని అబ్రాహాముతో అనెను (ఆది 12:3). దేవుడు వారి యెడల గొప్ప ప్రణాళిక కల్గియున్నారు.

ఆది 19:14 నందు లోతు మరియు వాని కుటుంబము అనగా భార్య, ఇద్దరి కుమార్తెలును, పెండ్లాడ నైయున్న అల్లుళ్ళను సోదొమ–గొమొఱ్ఱా పట్టణము విడిచిపెట్టిరి. దేవుడు ఈ పట్టణములను నాశనము చేయబోవుచున్నాడని వారికి చెప్పెను. గాని వారి

అవిధేయతవల్ల వారు నాశన మైరి. అతని భార్య వెనుకకు చూచి, ఉప్పుస్థంభ మైనది. లోతు తన ఇద్దరికుమార్తెలు మాత్రమే బయట పడిరి.

ఇస్సాకు యొక్క కుటుంబము నందు ఇస్సాకు తన పెద్దకుమారుడైన ఏశావును ప్రేమించెను. రిబ్కా చిన్నవాడైన యాకోబును ప్రేమించెను. యాకోబు కుటుంబము చాలపెద్దది. అతనికి 4గురు భార్యలు 12 మంది కుమారులు మరియు ఒక కుమార్తెను కల్గియుండెను. యాకోబు వారినందరిని వారి యావదాస్తిని బేతేలుకు తీసుకొని పోయి, అక్కడ యెహోవాకు బలిపీఠము కట్టి దేవుని స్తుతించెను (ఆది 35:1–6).

అమ్రాము, యాకెబెతునకు ముగ్గురు సంతానము మిరియాము, అహరోను మరియు మోషే. వారందరు దేవుడైన యెహోవాను సేవించిరి. యెహోషువ దేవుడైన యెహోవా సేవకుడు మీరు ఎవరిని సేవింప కోరినను "నేనును – నా ఇంటివారును యెహోవానే సేవించెదము" అనెను (యెహోషువ 24:15).

యెరికో పట్టణం నాశనమైనపుడు రాహోబు, ఆమె కుటుంబము మాత్రమే రక్షింపబడిరి. యెరికో పట్టణమునకు వచ్చిన వేగులవారిని దాచి, వారిని కాపాడిన కారణముగా వేగులవారైన ఆ మనుష్యులు పోయి, రాహోబును, ఆమె తండ్రిని, తల్లిని, ఆమె సహోదరులను, ఆమెకు కల్గినవారినందరిని వెలుపలికి తోడుకుని వచ్చి, ఇశ్రాయేలు పాళెము వెలుపట వారిని నివసింపజేసిరి (యెహోషువా 6:23).

ఎల్కానా యెహోవాకు మ్రొక్కుబడి చెల్లించుటకును, బలి అర్పించుటకును ఏటేట తాను, తన ఇద్దరి భార్యలు హన్నా, పెనిన్నాలు, ఆమె ఇద్దరి కుమారులు వచ్చెడివారు (1 సమూ 1:4).

దావీదు రాజుయొక్క కుటుంబ వ్యవస్థ చాలాపెద్దది. దావీదునకు 8 మంది భార్యలు, 18మంది కుమారులు, మరియు కుమార్తెలు కలరు. ఆయన ఎల్లప్పుడు దేవుని స్తుతించెడివాడు. "ఇప్పుడు నీదాసుని సంతతి నిత్యము నీ సన్నిధిని ఉండునట్లుగా దానిని ఆశీర్వదించి అనుగ్రహించియున్నావు"; "యెహోవా నీవు ఆశీర్వదించిన యెడల, అది ఎన్నటికినీ ఆశీర్వదింపబడి యుండును" (1 దినవృత్తా 17:27).

ఇశ్రాయేలీయుల దేశమందు మరియు యొర్దానునందు కరువు సంభవించినపుడు ఒక సారెపతు విధవరాలిచే ఏలీయా పోషింపబడెను. అది దేవుని ప్రణాళిక. ఆమె ఏలియా మాట చొప్పున చేయగా అతడు ఆమెయు, ఆమె ఇంటివారును తిరిగి భూమిమీద వర్షము కురియువరకు అనేక దినములు భోజనము చేయుచు వచ్చిరి (1రాజు 17:16).

ఒక కుటుంబము సర్వనాశనమగుటకు గల కారణం వారు దేవుని ఆజ్ఞకు అవిధేయులగుటయే యని బైబిలు తెలియపరచుచున్నది. అవిధేయత వల్లనే మహా జలప్రళయం మూలంగా అనేక కుటుంబములు నాశనమైనవి. అదే విధంగా సొదొమ, గొమొఱ్ఱ పట్టణములు నాశనమైనట్లుగా చూడగలము. తిరుగుబాటుదారులైన కోరహు, దోతాను, అబీరాములు వారి కుటుంబములు దేవుని ఉగ్రతకుపాలైరి. భూమి తన నోరు తెరచి వారిని, వారి కుటుంబములను కోరహు సంబంధులందరిని వారి సమస్త సంపాద్యమును మ్రింగివేసెను (సంఖ్యా 16:1-31).

యెరికో పట్టణము కట్టబడినపుడు ఆకాను దేవుని ఆజ్ఞను అతిక్రమించి పాపం చేసాడు. దోపుడు సొమ్ములో ఒక మంచి షీనారు పై వస్త్రమును, రెండువందల తులముల వెండిని, 50 తులముల ఎత్తుగల ఒక బంగారు కమ్మిని, తీసికొనగా, దేవుని ఆజ్ఞ చొప్పున అతనిని ఆతని కుటుంబము నంతటిని రాళ్ళతో చావగొట్టి, వారిని వారికి కల్గిన సమస్త సంపాద్యమును అగ్నితో కాల్చివేసిరి (యెహోషు 7:21-26).

అవిధేయుడైన రాజైన సౌలు మరియు అతని కుమారులు ఫిలిష్తీయులతో జరిగిన యుద్ధంలో చంపబడిరి (1 సమూ 31:1,2).

దైవ జనుడైన ఎలీషాకు సేవకుడైన గేహజీ సిరియనుడైన నయమాను తీసుకొని వచ్చిన బహుమానములను ఆశించి, తీసికొనినందున గెహజీని అతని కుటుంబమును శపించబడెను. నయమానుకు కలిగిన కుష్టు నీకును నీ సంతతికిని సర్వకాలము అంటియుండును అని చెప్పగా వాడు మంచువలె తెల్లనైన కుష్టము కల్గి ఎలిషా ఎదుటనుండి బయటకు వెళ్ళెను (2 రాజులు 5:27).

దేవుడు దానియేలును సింహముల నోటినుండి కాపాడెను. అయితే రాజు ఆజ్ఞ ఇయ్యగా దానియేలుపై నింద మోపిన మనుష్యులను వారు తోడుకొని వచ్చి సింహపు గుహలో పడద్రోసిరి. వారిని, వారి కుమారులను వారి భార్యలను పడద్రోసిరి. వారా గుహ అడుగునకు రాకమునుపే సింహముల పాలైరి. సింహములు వారి ఎముకలను సహితము పగులకొరికి పొడిచేసెను (దానియేలు 6:24).

ముఖ్యమైన ప్రతి వ్యవస్థ దేవునిచేతనే స్థాపించబడును. భూమిమీద మనం ఆనందముతోను బలవంతులముగాను ఉండుటకు దేవుడే కారణం. జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టును. మూఢురాలు తన చేతులలో తనయిల్లు ఊడబెరుకును. అపోస్తలుడైన పౌలు ఈ విధముగా చెప్పుచున్నాడు. స్త్రీలారా! ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి (ఎఫెస్సీ 5:22, కొలస్స 3:18, 1 తిమోతి 2:9-14, తీతు 2:4, మరియు 1 పేతురు 3:5).

దేవుడైన యెహోవా స్త్రీకి బిడ్డల విషయములో గొప్ప బాధ్యతను అప్పగించి యున్నారు. బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు (సామె 22:6). ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి (మత్త 6:33). వారు ఆదివారపు బడికి, స్తుతి ఆరాధన మరియు ఇంటివద్ద జరిగే గృహకూడికలయందు పాలుపంచు కొనులాగున చూడవలెను. వారికి మాదిరి చూపవలెను. మంచి అలవాట్లను నేర్పింపవలెను. మంచి తల్లి తన ఇంటివారి నడతలను బాగుగా కనిపెట్టును (సామె 31:27). దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును (1 కొరింధీ 15:33). యాకెబెతు, హన్నా, మరియ (యేసుతల్లి), ఎలీసబెతు, లోయి, యునీకే మొదలైన వారిని ఆత్మీయంగా నడిపించిన తల్లులుగా పరిశుద్ధ గ్రంథములో చూడగలం.

ఒకమంచి సమాజం కావాలి అంటే అది మంచి కుటుంబముల కలయికగా ఉండాలి. మంచి కుటుంబముగా చేయ గల శక్తి మంచి తల్లులకు మాత్రమే ఉన్నది. ఒకమంచి సమాజం అభివృద్ధి చెందాలంటే మంచి కుటుంబము ఉండాలి.

అపొస్తలుల కార్యములయందు మంచి కుటుంబములు గలవు. వారు క్రైస్తవ కుటుంబములుగా మారినట్లు చూడగలం. కైసరయలోనున్న కొర్నెలీ ఇంటివారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడైయుండి, ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడు దేవునికి ప్రార్థన చేయువాడు. పేతురు ద్వారా సువార్త విని అతడును, అతని ఇంటివారును బాప్తిస్మము పొందిరి (అ.కా. 10:1). చెరసాల యజమాని మరియు అతని ఇంటివారును (అకా. 16:31-33) క్రిస్పు మరియు అతని ఇంటి వారును బాప్తిస్మము పొంది, రక్షింపబడిరి (అ.కా. 18:8).

అదేవిధంగా మనం మన కుటుంబములతో కలసి దేవుని స్తుతించి, ఆరాధించవలెను (ఆది 35:1-6). దేవుడైన యెహోవా మిమ్మును ఆశీర్వదించి, మీకు కలుగజేసిన మీ కుటుంబములను మీ దేవుడైన యెహోవా సన్నిధిని భోజనము చేసి, మీ చేతి పనులన్నింటి యందు సంతోషింపవలెను (ద్వితీయో 12:7).

## లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి (లూకా 17:32)

(Remember Lot's Wife)

అబ్రాహాము శారాను, అతని తమ్ముని కుమారుడైన లోతును వెంటబెట్టు కొని కల్దీయుల ఊరను పట్టణము నుండి కనానులో నివసించుటకు బయలుదేరెను. యోర్దాను మైదానమందలి సొదొమ ప్రాంతమును లోతు యేర్పాటు చేసికొని అచ్చట తన గుడారమును వేసి కొనెను. సొదొమ మనుష్యులు దుష్టులును, యెహోవా దృష్టికి బహుపాపులునై యుండిరి (ఆది.కా. 13:13). లోతు భార్య బహుశ ఊరు పట్టణస్థురాలై యుండవచ్చు. అందుచేతనే అబ్రాహాము తన కుటుంబముతో ఊరు పట్టణమును విడిచిపెట్టినపుడు వారిని వెంబడించలేదు.

సొదొమ గొమొఱ్ఱాల యొక్క పాపము దేవుని దృష్టిలో బహు ఘోరమైనదిగా యున్నందున దేవుడు వాటిని నాశనము చేయనిశ్చయించెను. ఆనాశనము నుండి లోతును, అతని కుటుంబమును రక్షించుట కొరకై యిద్దరు దేవదూతలను దేవుడు పంపెను. ఆ దూతలు లోతును త్వరపెట్టి, ఈ ఊరి దోషశిక్షలో నశించిపోకుండ నీ భార్యను, నీ యిద్దరు కుమార్తెలను తీసికొనిరమ్మని చెప్పిరి. అతడు ఆలస్యము చేసెను. అప్పుడు అతని మీద యెహోవా కనికరపడుటవలన ఆ మనుష్యులు అతని చేతిని, అతని భార్యచేతిని, అతని యిద్దరు కుమార్తెల చేతులను పట్టుకొని వెలుపలికి తీసికొని వచ్చి ఆ ఊరి బయటనుంచిరి. వారు ఊరి బయటకు వచ్చిన తరువాత ఆయన నీ ప్రాణమును దక్కించుకొనునట్లు పారిపొమ్ము. నీ వెనుకకు చూడకుము అని ఆయన చెప్పిన తరువాత, లోతు భార్య వెనుకనుండి తిరిగి చూచి ఉప్పు స్తంభ మాయెను (ఆది.కా. 19:15-17, 26).

### అవిధేయత యొక్క ఫలితము :

లోతును అతని యిద్దరు కుమార్తె లును దేవుని ఆజ్ఞలకు విధేయులగుటచే సొదొమగొమొఱ్ఱాల యొక్క నాశనము నుండి తప్పింపబడిరి. లోతు భార్యయొక్క అవిధేయత వలన ఆమె ఉప్పుసంతభ మయ్యెను.

దేవుని ఆజ్ఞలలో జీవముగలదు. ఆహరోను కుమారులైన నాదాబు, అబీహులు యెహోవా తమకు ఆజ్ఞాపింపని అన్యాగ్నిని ఆయన సన్నిధికి తీసుకురాగా, యెహోవా సన్నిధినుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను

(లేవీ 10:1-2). యెరికోపట్టణములోని శపితమైన వస్తువులను ఆశించి వాటిని తీసికొనుట ద్వారా దేవుని ఆజ్ఞకు అవిధేయులగుచే యెహోవా ఆకానును అతని యింటి వారందరిని నాశనము చేసెను (యెహోషువ 7వ అధ్యాయము). ఇశ్రాయేలీయులకు మొదటి రాజైన సౌలు అమాలేకీయులను సర్వనాశనము చేయుమనిన దేవుని ఆజ్ఞకు అవిధేయు డయ్యెను (1సమూయేలు 15 అధ్యాయము). దేవుని ఆజ్ఞకు అవిధేయులైన వారి యొక్క నాశనమును గూర్చి మనము చాల ఉదాహరణలు చూడగలము. దేవుని ఆజ్ఞలకు అవిధేయులమగునపుడు మనము పాపము చేసిన వారమగుదుము (1 యోహాను 3:4).

**పాపము జీవము, మరణము :**

దేవుని యొక్క ఆజ్ఞలో జీవమున్నది. దేవుడు యిట్లు చెప్పుచున్నారు. నా జీవము తోడు దుర్మార్గుడు మరణము నొందుట వలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రతుకుట వలన నాకు సంతోషము కలుగును (యెహెజ్కేలు 33:11). మనము బ్రతుకు నిమిత్తము ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసును ఈ లోకములోనికి పంపెను. యేసు తన శిష్యులను ఈవిధంగా ఆజ్ఞాపించెను: “మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించి తినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతోకూడా ఉన్నానని వారితో చెప్పెను” (మత్తయి 28: 19,20). క్రొత్తనిబంధన గ్రంధములో వ్రాయబడిన యేసు ప్రభువుయొక్క ఆజ్ఞలన్నిటిని మనము గైకొననిచో మనము నాశనమగుదుము.

నోవహు కాలములోని లోక మంతయు నీటివలన మునిగి నశించెను అయితే యిప్పుడున్న భూమియు, ఆకాశ మును భక్తిహీనుల తీర్పును, నాశనము జరుగు దినము వరకు అగ్ని కొరకు నిలువచేయబడినవై, అదే వాక్యమువలన భద్రము చేయబడి యున్నవి (2 పేతురు 3:6-7). దేవుని ఆజ్ఞకు మనము విధేయులమైనపుడు నాశనము నుండి తప్పింపబడుదుము. లోతును అతని యిద్దరు కుమార్తెలును వెనుకకు తిరిగి చూడకుండినందున సొదొమ, గొమొఱ్ఱాలయొక్క నాశనమునుండి రక్షింపబడిరి. ఈ లోక భోగములనుండి మనము పారిపోవలెనుగాని వెనుకకు తిరిగి చూడకూడదు.

దేవుడైన యెహోవా అబ్రాహామును తన దేశమునుండియు, బంధువులయొద్ద నుండియు, తన తండ్రి యింటినుండియు పిలిచి కనాను దేశమును యిచ్చెను. అతడు యెప్పుడును వెనుక తిరిగి చూడలేదు. "వారు యేదేశమునుండి వచ్చిరో ఆ దేశమును జ్ఞాపకమందుంచు కొనిన యెడల మరల వెళ్లుటకు వీలు కలిగి యుండునని హెబ్రీగంధకర్త అను చున్నాడు (హెబ్రీ 11:15).

అబ్రాహాము యింటి పెద్దదాసుడైన ఎలీయెజరు, "ఈ దేశమునకు నా వెంట వచ్చుటకు ఆస్త్రీ యిష్టపడని యెడల నీవు బయలుదేరి వచ్చిన ఆదేశమునకు నీకుమారుని తీసికొని పోవలెనా" అని అబ్రాహామును అడిగెను. అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకునకు భార్యను తీసికొని వచ్చు విషయములో తన దాసునితో నాకుమారుని అచ్చటికి తీసికొని పోకూడదు అని చెప్పెను (ఆది. కా. 24:5-6).

మోషే నాయకత్వము ద్వారా యెహోవా దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాసత్వమునుండి విడిపించెను. వారి అవిధేయత వలనను, సణుగుల వలనను నలుబది సంవత్సరములు ఇశ్రాయేలీయులను అరణ్యములో నడిపిరి. వీరు ఐగుప్తులో మేము ఉచితముగా తినిన చేపలును, కీరకాయలును, దోసకాయలును, కూరాకులును, ఉల్లిపాయలును, తెల్లగడ్డలను జ్ఞాపకమునకు వచ్చుచున్నవి (సంఖ్యా 11:5; నిర్గమ 16:3; సంఖ్యా 14:4). ఆరు లక్షల మందిలో యెహోషువ, కాలేబు మాత్రమే వాగ్ధాన దేశములో ప్రవేశించగల్గిరి. మిగిలినవారంతా వారి అవిధేయతను బట్టి వెనుతిరిగి చూచుటను బట్టి అరణ్యములో నశింపజేయబడిరి.

**వెనుకతట్టు తిరిగి చూడవద్దు :**

నాగటిమీద చెయ్యిపెట్టి వెనుకతట్టు చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడని యేసు చెప్పెను (లూకా 9:62). అపొస్తలుడైన పౌలు ఫిలిప్పయిలో నున్న క్రైస్తవులకు ఈ విధంగా చెప్పుచున్నాడు: "సహోదరులారా ! నేనిది వరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను అయితే ఒకటి చేయుచున్నాను. వెనుక ఉన్నది మరచి ముందున్న వాటి కొరకై వేగిరపడుచు, క్రీస్తు యేసునందున్న దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను (ఫిలిప్పి 3:13). వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవజ్ఞానముచేత ఈ లోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి, వాటిచేత జయింపబడిన యెడల, వారి

కడవరి స్థితి మొదటిస్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతి మార్గమును అనుభవపూర్వకముగ తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుటకంటె, ఆమార్గము అనుభవపూర్వకముగా వారికి తెలియక యుండుటయే వారికి మేలు, కుక్క తన వాంతికి తిరిగినట్లును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్లును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను (2 పేతురు 2:20–22). దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలోనికకు వెళ్లెను (2 తిమోతి 4:10).

లోతు, అతని కుటుంబమునకీయ బడిన షరతుల మీదనే మన రక్షణ కూడా ఆధారపడియున్నది. కనుక మనము యే సమయమములోనైనను వాటి నుండి తప్పిపోకుండునట్లు మనము వినిన విషయములన్నిటిని హృదయపూర్వక ముగా ఆచరింప బద్ధులమైయున్నాము. వాటినుండి ఎన్నడును మనము జారి పోకుండునట్లు జాగ్రత్త వహింపవలెను. దేవదూతల ద్వారా చెప్పబడిన మాటల న్నియు ధృఢమైన యెడల ప్రతి పొరబాటు నకు, అవిధేయతకు తగిన బహుమానము పొందవలసి వచ్చును. మన ప్రభువు ద్వారా చెప్పబడిన మాటలన్నియు వినిన వారు చెప్పిన మాటలను నిర్లక్ష్యము చేసిన యెడల ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసిన యెడల మనమెట్లు తప్పించుకొనగలము? మనము రక్షింపబడవలెనన్న దేవుని యొక్క ఆజ్ఞలకు మనము నిరంతరము విధేయులమగుచు లోతు భార్యవలె వెనుకను తిరిగి చూడకూడదు. నాయెదుట నీతివంతుడైనవాడు విశ్వాస మూలముగా జీవించును గాని అతడు వెనుకతీసిన యెడల అతనియందు నా ఆత్మకు సంతోషముండదు. అయితే మనము నశించుటకు వెనుక తీయు వారము కాము గాని ఆత్మను రక్షించుకొనుటకు విశ్వాసము కలిగినవారమైయున్నాము (హెబ్రీ 10:38–39).

# ధన్యురాలైన వేశ్య

## (The Blessed Harlot)

అసామాన్యులయితేనే తప్ప స్త్రీల పేర్లు పరిశుద్ధ గ్రంథంలో వ్రాయబడ లేదు. నోవహు భార్యపేరుగాని వాని కోడండ్ర పేర్లు గాని చెప్పబడలేదు. కొన్ని సందర్భాలలో స్త్రీల సంఖ్య కూడా లెక్కింప బడలేదు. ఐగుప్తు దాసత్వము నుండి ఆరులక్షలమంది పురుషులు బయటకు రావడం జరిగింది. గాని స్త్రీలు, పిల్లలు లెక్కింపబడలేదు. యేసుప్రభువు 5 రొట్టెలు రెండు చిన్న చేపలతో 5,000 మందికి ఆహారం పెట్టినపుడు ఆసంఖ్య పురుషులదేగాని స్త్రీలు, పిల్లలు లెక్కింపబడలేదు. ఇద్దరు మహిళల పేర్లతో పరిశుద్ధగ్రంథంలో రెండు పుస్తకములు – రూతు, ఎస్తేరు గ్రంథాలు వ్రాయబడినవి.

యేసుప్రభువు వంశావళిలో ముగ్గురు మహిళల పేర్లు చూస్తాము. అన్యులైన ఈ ముగ్గురు స్త్రీలు ఎవరనగా తామారు, రాహాబు, రూతు (మత్తయి 1:3–6). కనానీయురాలైన తామారు భక్తిగలది (ఆది 38:26). మోయాబీయు రాలైన రూతు ఇశ్రాయేలు దేశములో తన అత్తతో ఉండులాగున తన స్వదేశాన్ని విడిచిపెట్టింది. రాహాబు యెరికో పట్టణానికి చెందిన వేశ్య. యెహొషువా గ్రంథంలో 2,6 అధ్యాయా లలో మనము ఆమెను గురించి చదువగలము.

యెహోవా దేవుని బలమైన హస్తము ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వము నుండి బయటకు తీసికొని వచ్చింది. వారి అవిధేయత, అవిశ్వాస ములవల్ల 40 సం॥లు వారు అరణ్యంలో తిరుగులాడారు. మోషే మరణం తరువాత యెహొషువ వారి నాయకుడయ్యాడు. యెరికోనుండి 12 మైళ్ల దూరంలోనున్న షిత్తీము అను ప్రాంతమునుండి వేగు చూచుటకు అతడు ఇద్దరు వేగులవారిని పంపించాడు.

ఆమనుష్యులు రాహాబు అను వేశ్య ఇంట దిగారు. రాజు ఆ ఇద్దరి మనుష్యుల కొరకు తన సేవకులను ఆమె యొద్దకు పంపినపుడు , ఆమె వారిని తన మిద్దెపైన దాచి వారు వెళ్లిపోయినట్లు రాజు సేవ కులతో అబద్ధం చెప్పింది (యెహొషువ 2:1–24).

వేగులవారిని దాచిపెట్టి తన స్వంత దేశ రాజుతో అబద్ధం చెబుటకు కారణమేమి? అది ఆమెకు ఆమె కుటుంబానికి ప్రాణాపాయం తెచ్చేటంత

ప్రమాదకరమయింది. ఆమె యెరికో రాజుకంటే ఇశ్రాయేలీయుల దేవునికి అధికంగా భయపడింది. ఆమె వినిన దానిని ఆమె విశ్వసించింది. ఆమె వారితో "యెహోవా ఈ దేశమును మీకిచ్చు చున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈదేశ నివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీరు ఐగుప్తు దేశములో నుండి వచ్చినపుడు మీ యెదుట యెహోవా యెఱ్ఱసముద్రపు నీరును ఏలాగు ఆరిపో జేసెనో, యోర్దాను తీరమున నున్న ఆమోరీయుల ఇద్దరు రాజులైన సీహోనుకును ఓగుకును మీరేమి చేసితిరో అనగా మీరు వారిని ఏలాగు నిర్మూలము చేసితిరో ఆసంగతి మేము వింటిమి. మేము వినినపుడు మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీ యెదుట ఎట్టి మనుష్యులకైనను ధైర్యమేమాత్రము ఉండదు" (యెహోషు 2:9-11). యెరికో పౌరులుకూడా ఈ విషయాలను గురించి విన్నారు గాని విశ్వసించలేదు (హెబ్రీ 11:31). నోవహు దినములలోను, లోతుదినములలోను ప్రజలు ఇట్టి హెచ్చరికలను లక్ష్యం చేయక నశించి పోయారు (ఆది 7:23; 19:25; 1 పేతురు 2:6).

ఇశ్రాయేలీయుల జీవితంలో దేవుడు చేసిన గొప్ప కార్యములను గురించి రాహాబు విని ఆయనకు భయపడింది. యెహోవాయందలి భయము జ్ఞానమునకు మూలము (సామె 1:3). ఇస్సాకును బలి ఇచ్చుటకు అబ్రాహాము సిద్ధపరచిన బలిపీఠమువద్ద ప్రభువు అబ్రాహాముతో "నీవు దేవునికి భయపడువాడవని యిందువలన నాకు కనబడుచున్నదనెను". (ఆది 22:12). యోసేపు దేవునికి భయపడి పోతీఫరు భార్యయొక్క కోరికనుండి పారిపోయాడు (ఆది 39:9). యోబు యదార్థవంతుడు న్యాయవంతుడు. దేవునియందు భయ భక్తులు కలిగినవాడు (యోబు 1:8) అని పరిశుద్ధ గ్రంథం చెబుతుంది. యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట చెడుతనమునసహ్యించుకొనుటయే. గర్వము, అహంకారము, దుర్మార్గత కుటిలమైన మాటల నసహ్యించుకొనుటయే. 128వ కీర్తనలో కీర్తనాకారుడు దేవుని యెడల భయభక్తులు గలవారికి కలుగు దీవెనలు వివరిస్తున్నాడు. "యెహోవా యందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలయందు నడుచువారందరు ధన్యులు. నీ జీవితకాల మంతయు యెరూషలేముకు క్షేమముకలుగుట చూచెదవు. నీ పిల్లల పిల్లలను నీవు చూచెదవు.

ఇశ్రాయేలు మీద సమాధానముండునుగాక" (కీర్తన 128:1-6). జ్ఞానియైన సొలొమోను అంటున్నాడు యెహోవాయందు భయ భక్తులు గల స్త్రీ కొనియాడబడును (సామె 31:30). రాహాబు దేవునికి భయపడి నందువల్ల ఆమె కొనియాడబడింది.

యెఱ్ఱసముద్రం రెండు పాయలు అయినప్పటికి యెరికోగోడలు కూలినప్పటికి మధ్యకాలం 40 సం॥లు. ఈ సంఘటన యెరికో ప్రజలకు సుస్పష్టం. దేవుని కార్యాలు ఆయన మాటలు నిత్యమైనవి. దేవుడు నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా నుండువాడు. గత సం॥ లేదా గతనెల లేదా గత వారంలో మనం వినిన దేవుని వాక్యాన్ని బట్టి మనము ఇంకా దేవునికి భయపడుచున్నామా? ప్రతిదినం దేవుని వాక్యాన్ని మనం వింటున్నపుడు దాని ప్రభావం మన పైన ఎంతకాలం ఉంటుంది? "నేను యజమానుడనైతే నాకు భయపడు వాడెక్కడ ఉన్నాడు అని సైన్యముల కధిపతియగు యెహోవా అడుగుచున్నాడు" (మలాకి 1:6). "భయముతోను వణకుతోను మీ స్వంత రక్షణను కొనసాగించుకొనుడని" పౌలు మనలను హెచ్చరిస్తున్నాడు (ఫిలి 2:12).

క్రియలు లేని విశ్వాసము మృతము. దయ్యములు కూడా నమ్మి వణుకుచున్నవి (యాకోబు 2:19). ఆమె చర్యలవల్ల రాహాబు కూడా నీతిమంతురాలుగా ఎంచబడింది. "రాహాబు అను వేశ్యకూడా తూతలను చేర్చుకొని వేరొక మార్గమున వారిని వెలుపలికి పంపివేసినపుడు క్రియల మూలముగా నీతిమంతురాలని యెంచబడెనుగదా!" (యాకోబు 2:25). "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజపస్వరూపమును, అదృశ్యమై నవి యున్నవనుటకు ఋజువునై యున్నది" (హెబ్రీ 11:1). యెరికో పట్టణమును రోజుకు ఒకసారి చొప్పున ఆరుదినములు చుట్టి ఏడవ దినమున ఏడుపర్యాయాలు చుట్టి తిరగాలని ప్రభువు యెహోషువకు ఆజ్ఞాపించారు. బూరల ధ్వనివల్ల, జనులందరు ఆర్భాటముగా కేకలు వేయుట వల్ల యెరికో కోట గోడలు కూలెను. పట్టణములోనున్నదంతయు వారు సంహరించిరి. రాహాబు అను వేశ్య యెరికోను వేగుచూచుటకు యెహోషువ పంపిన దూతలను దాచి పెట్టియుండెను. గనుక అతడు ఆమెను ఆమెతండ్రియింటి వారిని ఆమెకు కలిగిన వారినందరిని బ్రతుకనిచ్చెను (యెహోషువ 6:25).

విశ్వాస వీరుల జాబితాలో హెబ్రీ గ్రంధకర్త ఇద్దరు స్త్రీలను మాత్రమే

పేర్కొ నడం జరిగింది. "విశ్వాసమును బట్టి రాహాబను వేశ్యవేగుల వారిని సమాధాన ముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపక పోయెను" (హెబ్రీ 11:31). అన్యురాలైన రాహాబు నాశనకరమైన పట్టణమునకు చెందిన దయినప్పటికి భూమ్యాకాశములను కలుగచేసిన ప్రభువుకు భయపడింది. "యెహోవా మహాత్మ్యముగలవాడు, ఆయన అధిక స్తోత్రము నొందతగినవాడు. సమస్త దేవతల కంటెను ఆయన పూజనీయుడు" (కీర్తన 96:4). "వారు ఆదేశము మీద బ్రతుకు దినములన్నియు నాకు భయపడ నేర్చుకొని తమ పిల్లలకు నేర్పునట్లు వారికి నా మాటలు వినిపించెదను". (ద్వితి 4:10). ఆత్మావేశ లేఖకులు లిఖించిన ఆయన మాటల ద్వారా మనము ఆయన స్వరము వినునట్లు ఆయన చేయు చున్నారు. ఆయనకు మనం భయపడు చున్నామా?

వాగ్దాన దేశంలోకి ప్రవేశించక పూర్వం ప్రభువు మోషేకు ఇలా ఆజ్ఞాపించారు: "నీవు వారితో నిబంధన చేసి కొనకూడదు, వారిని కరుణింప కూడదు, నీవు వారితో వియ్యమందకూడదు. వాని కుమారునికి నీకుమార్తె నియ్యకూడదు. నీ కుమారునికి వాని కుమార్తెను పుచ్చుకొన కూడదు". (ద్వితి 7:2-3). అన్యులైన వారితో వైవాహిక సంబంధాలు పెట్టుకొన కూడదని ప్రభువు ఇశ్రాయేలీయులను పదే పదే హెచ్చరించారు. గాని రాహాబు వేశ్య అయి ఉండి కూడా యూదా గోత్రానికి "నేటివరకు ఇశ్రాయేలీయుల మధ్య నివసించుచున్నది" (యెహోషువ 6:25).

రాహాబు దేవునికి భయపడి, యెహోషువ పెట్టిన షరతులకు లోబడి ధన్యురాలైంది. యేసుప్రభువు వారి వంశావళిలో స్థానం పొందింది. మనం కూడా ఆయనకు నిరంతరము భయపడుతూ దేవుని వాక్యానికి లోబడుతూ ఉంటే మన జీవితాలు కూడా ధన్యమైనవగును.

"భూమికంటే ఆకాశము ఎంత ఉన్నతముగానున్నదో ఆయన యందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగానున్నది." (కీర్తన 103:11) అని కీర్తని కారుడు చెబుతున్నాడు.

"దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి" అని జ్ఞానియైన సొలొమోను కూడా తన ప్రబోధాలను ముగించాడు. గనుక దేవునియందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలలో నడుచు ధన్యతను ఆయనే మనకనుగ్రహించుగాక.

# కొనియాడదగిన హన్నా

## (Hannah, Worthy of Praise)

ఎఫ్రాయిము మన్యమందు రామతయిమ్సోఫీము పట్టణమునకు చెందిన ఎల్కానా అను లేవీయుడు ఒకడుండెను. అతడు కహాతువంశానికి చెందిన వాడు (1 దినవృ 6:22–27; 1 సమూ 1:1–2).అతనికి ఇద్దరు భార్యలు. వారిపేర్లు హన్నా, పెనిన్నా. అనగా భావం, దయ, ముత్యము. పెనిన్నాకు పిల్లలున్నారు గాని హన్నా గొడ్రాలు. ప్రతి యేటా కుటుంబమంతా షిలోహునందలి దేవుని ఆలయమునకు వెళ్లి అక్కడ బలి అర్పించి ఆరాధించేవారు. ఎల్కానా హన్నాను ప్రేమించేవాడు. "యెహోవా ఆమెకు సంతులేకుండా చేసి యున్న హేతువును బట్టి ఆమె వైరియగు పెనిన్నా వల్ల ఆమె హృదయం దు:ఖపడెను.ఆమె విసికి కలత చెంది బహుగా ఏడ్చి దేవుని సన్నిధి ని ప్రార్థించెను. ఆమె దేవుని సన్నిధిలో ఒక మ్రొక్కుబడి చేసికొంది. "సైన్యముల కధిపతియగు యెహోవా, నీ సేవకు రాలినైన నాకు కలిగిన శ్రమను చూచి నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాలనైన నాకు మగ పిల్లను దయ చేసినయెడల, వాని తల మీదికి క్షౌరపు కత్తి యెన్నటికి రానియ్యక,వాడు బ్రదుకు దినములన్నిటను నేను వానిని యెహోవా వగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసికొనెను. ఆమె యెహోవా సన్నిధిని ప్రార్థన చేయుచుండగా ఏలి ఆమె నోరు కనిపెట్టచుండెను" (1సమూ 1:10–11).

దు:ఖితురాలైన హన్నా తన ఆత్మను దేవుని సన్నిధిలో క్రుమ్మరించుకొనినపుడు దేవుడు ఆమె ప్రార్థన ఆలకించారు. ఆమె గర్భవతియై కుమారుని కన్నది. "నేను యెహోవాకు మ్రొక్కుకొని వీనినడిగితినని ఆతనికి సమూయేలు అని పేరు పెట్టింది" (20 వ). ఆమె ఆతనికి పాలు మానిపించి ఆతనిని దేవుని సన్నిధికి తీసికొని వచ్చి యాజకుడైన ఏలీతో ఇలా అన్నది: "ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవినిబట్టి ఆయన నాకనుగ్రహించెను. కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను. తాను బ్రతుకు దినములన్నియు వాడు యెహోవాకు ప్రతిష్ఠతుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను. హన్నాలోని గొప్ప కలవరము, దు:ఖము ఆమెను దేవునికి దగ్గరగా తీసుకు వచ్చింది. యాకోబు 4:8లో యాకోబు అంటాడు "దేవుని యొద్దకు

రండి అపుడాయన మీా యొద్దకు వచ్చును". మనం ఎదుర్కొనే శ్రమలు, బాధలు మన విశ్వాసానికి పరీక్ష. నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచ బడునదిగదా! దానికంటే అమూల్యమైన మీావిశ్వాసము ఈ శోధన చేత పరీక్షకు నిలిచినదై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీా మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణ మగును (1పేతురు 1:7). కీర్తనలు 50:15లో ఇలా చెప్పబడింది "ఆపత్కాలమున నీవునన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్న విడిపించెదను, నీవు నన్ను మహిమ పరచెదవు." ఇశ్రాయేలు రాజైన దావీదు ఇలా పాడుచున్నాడు: ప్రభువా నేను నీకు మొరపెట్టగా నీవు ఉత్తరమిచ్చితివి. "ప్రభువు కన్నులు నీతి మంతులు మీాదను, ఆయన చెవులు వారి ప్రార్ధనలు వైపునను ఉన్నవి. గాని ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా ఉన్నది (1పేతురు 3:12). దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము: ఎవడైనను దేవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును (యోహాను 9:31).

నాజీరు చేయుబడినవాడై దేవుని భయముతో ఆబిడ్డనుపెంచుటకు, వాని జీవితకాలమంతా దేవుని సేవించినట్లు వానిని పెంచుటకు హన్నా మ్రొక్కు కొన్నది. బాలుడైన వానికి దేవునికి మ్రొక్కడం తెలిసింది (28వ). "బాలుడు నడువలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు. (సామె 22:6). యాకెబెదు మోషేను దేవుని భయంతో పెంచింది. తన స్వంత తల్లి ద్వారా ఫరోకుమార్తె యొక్క కుమారుడుగా మోషే పెంచబడ్డాడు (నిర్గ 2:5-10). తిమోతిని ఆతని అవ్వ అయిన లోయి, తల్లి అయిన యునికేలు దేవుని భయంతో పెంచారు (2తిమో 2:5). "తండ్రులారా,ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" అని పౌలు ఎఫెసీ 6:4లో వ్రాస్తున్నాడు.

హన్నా ఒక మగబిడ్డను అడిగింది, దేవుడు ఆమెకు మగ బిడ్డను ఇచ్చారు. ఆమె అతనికి సమూయేలు అని పేరు పెట్టింది. ఆమె బాలుడైన సమూయేలు ను ఏలీ యొద్దకు తీసికొనివచ్చి దేవుడు నేను చేసిన మనవిని బట్టి ఆయన నాకనుగ్రహించెను. కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను. తాను బ్రతుకు దినములన్నింటను వాడు యెహోవాకు ప్రతిష్ఠుతుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను (1సమూ 1: 27-28). తన బిడ్డనుండి దూరంగా ఉండడం ఒక తల్లికి కష్టమైనప్పటకి వాడు బ్రతుకు

దినములన్నియు దేవునికి సేవ చేయాలనే ఉద్దేశంతో హన్నా తన కుమారుని దేవుని మందిరమునకు తీసుకు వచ్చింది. "నీవు నీ దేవుడైన యెహోవాకు మ్రొక్కుకొనిన తరువాత ఆ మ్రొక్కుబడిని చెల్లించుటకు తడవు చేయకూడదు. నీదేవుడైన యెహోవా తప్పక నీ వలన దానిని రాబట్టుకొనును. అది నీకు పాపమగును" (ద్వితి 22:21-22).

న్యాయధిపతులలో ఒకడైన యెఫ్తా యెహోవాకు మ్రొక్కుకొన్నాడు ఎట్లనగా - నీవు నాచేతికి అమ్మోనీయులను నిశ్చయముగా అప్పగించిన యెడల నేను అమ్మోనీయుల యొద్దనుండి క్షేమముగా తిరిగి వచ్చునప్పుడు నన్ను ఎదుర్కొనుటకు నా యింటి ద్వారమునుండి బయలుదేరి వచ్చున దేదో అది యెహోవాకు ప్రతిష్ఠితమగును. మరియు దహనబలిగా దానినర్పించెదననెను (న్యాయాధి 11:29-40). అతని కుమార్తె ఆతని మ్రొక్కుబడి చొప్పున ఆతడు తన కుమార్తెను దేవునికి బలిగా అర్పించాడు. "నీవు దేవునికి మ్రొక్కుబడి చేసికొనిన యెడల దానిని చెల్లించుటకు ఆలస్యము చేయకుము, బుద్ధిహీనులయందు ఆయనకు ఇష్టము లేదు" (ప్రసంగి 5:4,5).

ఏశావు నుండి పారిపోతూ యాకోబు కూడా ఒక మ్రొక్కుబడిచేసుకున్నాడు "నేను తిరిగి నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి తినుటకు ఆహారమును ధరించుకొనుటకు వస్త్రములను దయచేసిన యెడల యెహోవా నాకు దేవుడై యుండును. మరియు స్థంభముగా నేను నిలిపిన ఈ రాయి దేవుని మందిరమగును. మరియు నీవు నాకిచ్చు యావత్తులో పదియవవంతు నిశ్చయము గా నీకు చెల్లించెదని మ్రొక్కుకొనెను" (ఆది.కా. 28:20-22).

హన్నా కొనియాడదగినది ఎందుకనగా తనకు కలిగిన అతివిలువైన దానిని దేవునికి ఇచ్చివేసింది. స్వాస్థ్యము, గర్భఫలము దేవుడనుగ్రహించు బహుమానము (కీర్త 127:3). విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము తనకు ఒక్కడైయున్న కుమారుని దేవునికిచ్చుటకు సంకోచించ లేదు (ఆది 22 అధ్యా). "అబ్రాహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనో ఆ అబ్రాహాము మృతులను సయితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని అర్పించి ఉపమానముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రి 11:17-19).

తన జీవితమంతా దేవునికి ఇచ్చిన పేదవిధవరాలిని యేసు ప్రభువు మెచ్చుకున్నారు (లూకా 21:4). "మీరు ప్రతి విషయములో అనగా విశ్వాసమందును ఉపదేశమందును జ్ఞానమందును సమస్త జాగ్రత్తయందును మీకు మాయెడలనున్న ప్రేమయందును, ఏలాగు అభివృద్ధిపొందుచున్నారో అలాగే మీరు ఈ కృపయందు కూడ అభివృద్ధి పొందునట్లుచూచుకొనుడి" (2 కొరింధీ 7:9-7).

హన్నా తన కష్టసమయంలో దేవుని కృపా సింహాసనాన్ని ఆశ్రయించింది. బాలుడైన సమూయేలును దైవ భయంతో పెంచింది. వాడు బ్రతుకు దినములన్నియు యెహోవాకు సేవ చేయునట్లు వానిని దేవుని మందిరమందు విడిచి తన మ్రొక్కుబడినిలుపుకొన్నది. ఆయన మనకు అనుగ్రహించిన అనేక విధములైన ఆశీర్వాదముల కొరకై మనము కూడా హన్నావలె ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞత గలవారంగా ఉండాలి.

# మగ్దలేనే మరియ

## (Mary, Magdalene)

క్రొత్త నిబంధన గ్రంధమందు మనం ముగ్గురు మరియలను గూర్చి చదువు కొందుము. 1. యేసుతల్లియైన మరియ, 2. మార్త, లాజరుల సహోదరి మరియ, 2. మగ్దలేనే మరియ. మగ్దలేనే మరియ 'మగ్దలేనే' అనే పట్టణము నుండి వచ్చినది. అది గలిల యకు నైరుతి దిశలో ఉంది. క్రొత్త నిబంధన గ్రంధమందు ఆమె పేరు 14 సార్లు ఉచ్చరింపబడినది. ఆయన దేవుని రాజ్య సువార్తను తెలుపుచు ప్రకటించుచు, ప్రతి పట్టణములోను, ప్రతి గ్రామములోను సంచారము చేయుచుండగా, పండ్రెండు మంది శిష్యులను, అపవిత్రాత్మలును, వ్యాధులను పోగొట్టబడిన కొందరు స్త్రీలు, అనగా ఏడు దయ్యములు వదలిపోయిన 'మగ్దలేనే' అనబడిన మరియము హేరోదుయొక్క గృహ నిర్వాహకుడగు కూజా భార్యయగు యోహన్నయు, సూసన్నయు, ఆయనతో కూడా ఉండిరి. వీరును ఇతరు లనేకులును తమకు కల్గిన ఆస్తితో వారికి ఉపచారము చేయుచు వచ్చిరి. ఏడు దయ్యములు వదలిపోయి స్వస్థత పొందిన మగ్దలేనే మరియ తన జీవితమును యేసుక్రీస్తు పరిచర్య కొరకు సమర్పించుకొనినది. 12 మంది అపొస్తలులును కూడ ఈ స్త్రీలును ప్రతి గ్రామములోను, పట్టణములోను యేసుతోకూడ పరిచర్యలో పాల్గొనిరి. వారికి కలిగిన ఆస్థితో ఉపచారము చేసిరని వ్రాయబడినది.

దేవుడైన యెహోవా ఇశ్రాయేలీ యులకు ఆజ్ఞాపించున దేమనగా "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మ తోను, నీ పూర్ణ శక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. (ద్వితీ 6:5; మత్తయి 22:37). యేసు - ఎవడైనను నా యొద్దకువచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్క, చెల్లెండ్రను, తన ప్రాణమును సహా ద్వేషించకుంటే వాడు నా శిష్యుడు కానేరదు అని చెప్పెను (లూకా 14:26).

యేసుగలిలయ సముద్ర తీరమున నడుచుచుండగా పేతురనబడిన సీమోను అతని సహోదరుడైన అంద్రెయ అను ఇద్దరు సహోదరులు సముద్రములో వలలు వేయుట చూచెను. వారు జాలరులు. ఆయన - నా వెంబడి రండి - నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను. వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి (మత్త 4:18-20).

యేసు – జెబెదయ కుమారుడైన యకోబును, అతని సహోదరుడైన యోహానును చూచి వారిని పిలువగా వెంటనే వారు తమ దోనెలను తమ తండ్రిని విడిచిపెట్టి, ఆయనను వెంబడించిరి. (లూకా 4:21, 22). సుంకపు గుత్తదారుడైన లేవీయుడు తన వృత్తిని వదలి, యేసును, వెంబడించాడు. ఆనాడు విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికిని వారివారి అక్కరకొలది పంచిపెట్టిరి (అ.కా. 2:44). వారిలో బర్నాబా ఒకడు (అ.కా. 4:37).

అపొస్తలులు అన్నింటిని విడిచిపెట్టి యేసును వెంబడించిరి. ఆదిమ క్రైస్తవు రాలైన మగ్దలేనే మరియ తన యావదాస్తి నిచ్చి పరిచర్యచేసెను. దేవుడు మనలను అత్యధికంగా ఆశీర్వదించారు. దానికి ప్రతిగా మనమేమి ఇస్తున్నాము? మగ్దలేనే మరియ తన జీవితాంతం – యేసు మరణ, భూస్థాపన, పునరుత్థానముల వరకు ఆయనను వెంబడించింది. ఆయనను విడిచిపెట్టలేదు. గెత్సెమనే తోటలో యూదా – యేసును అప్పగించు టకు ప్రధాన యాజకులతోను, పెద్దలతో వచ్చినపుడు – శిష్యులందరు విడిచి పారి పోయిరి (మత్త 26:56). సిలువకు ఎదురుగా నిలిచియున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి – నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే అని చెప్పెను. కొందరు స్త్రీలు దూరమునుండి చూచుచుండిరి. వారిలో మగ్దలేనే మరియయు, చిన్న యాకోబు, యోసే అను వారి తల్లియైన మరియయు, సలోమియు ఉండిరి. ఆయన గలిలయలో ఉన్నప్పుడు వీరాయనను వెంబడించి ఆయనకు పరిచారము చేసినవారు. వీరు కాక ఆయనతో యెరుషలేమునకు వచ్చిన ఇతర స్త్రీలనేకులును వారిలో ఉండిరి (మార్కు 15:37-41).

సాయంకాలమైనపుడు అరిమితయి యోసేపు, తెగించి పిలాతు నొద్దకు వెళ్ళి, యేసు దేహము తనకిమ్మని యడిగెను. మరియు అతడు నారబట్ట కొని, ఆయనను దించి, ఆ బట్టతో చుట్టి, బండలో తొలపించిన సమాధియందు ఆయనను పెట్టి, ఆ సమాధి ద్వారమునకు రాయి పొర్లించి వెళ్ళిపోయెను. మగ్దలేనే మరియయు, వేరొక మరియయు అక్కడనే సమాధికి ఎదురుగా కూర్చొనియుండిరి (మత్తయి 27:61).

లూకా సువార్తలో వ్రాయబడిన ప్రకారం గలిలయనుండి ఆయనతో కూడ వచ్చిన స్త్రీలు వెంట వెళ్ళి, ఆ సమాధిని ఆయన దేహము ఏలాగుంచబడెనో

చూచి తిరిగివెళ్ళి, సుగంధ ద్రవ్యములను , పరిమళ తైలములను సిద్ధపరచి, ఆజ్ఞ చొప్పున, విశ్రాంతి దినమున తీరికగా నుండిరి (లూకా 23:55, 56). పునరుత్థానమును గూర్చి 4 సువార్తలలో వ్రాయబడిన సమాచారం ప్రకారం మొదటి దినము, ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధియొద్దకు వచ్చి, సమాధి మీద ఉండిన రాయి తీయబడి యుండుట చూచెను. గనుక ఆమె పరుగెత్తుకొని, సీమోను పేతురు నొద్దకును, యేసు ప్రేమించిన మరియొక శిష్యుని యొద్దకు వచ్చి, ప్రభువును సమాధిలోనుండి ఎవరో యెత్తికొనిపోయిరి. ఆయనను ఎక్కడ ఉంచిరో ఎరుగమని చెప్పెను (యోహా 20:1,2). కాబట్టి పేతురు మరియు యోహాను సమాధి యొద్దకు వచ్చి, యేసును కనుగొనక, తిరిగి ఇంటికి వెళ్ళిరి. అయితే శిష్యులు సమాధి ప్రాంగణమును విడిచి వెళ్ళి నప్పటికీ మగ్ధలేనే మరియ సమాధి బయట నిలిచి యేడ్చుచుండెను. యేసు ఆమెకు ప్రత్యక్షమై మరియా! అని పిలిచెను. ఆమె ఆయన వైపు తిరిగి ఆయనను హెబ్రీ భాషలో 'రబ్బూనీ' అని పిలిచెను. ఆ మాటకు 'బోధకుడని' అర్థము. మగ్దలేనే మరియ వచ్చి, నేను ప్రభువును చూచితిని. ఆయన నాతో ఈ మాటలు చెప్పెనని శిష్యులకు తెలియజేసెను (యోహా 20:16-18). ఆదివారమున తెల్లవారి నప్పుడు యేసు లేచి, తాను ఏడు దయ్యములను వెళ్ళగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను (మార్కు 16:9).

మగ్దలేనే మరియ ఏడు దయ్యము లను వెళ్ళగొట్టిన దినమునుండి పునరుత్థానము వరకు యేసును వెంబడించుచు, పరిచారము చేయుచు వచ్చెను. ఒక సమయంలో ఆయనను శిష్యులు వదిలి నను ఈమె మాత్రం చివరివరకు అక్కడనే ఉన్నది. ఆమె ఆదివారం తెల్లవారు జామున సమాధి యొద్దనున్నది. యేసు మృతులలోనుండి లేచియున్నాడని తెలిపి నను ఆయన శిష్యులు తమ ఇంటికి వెళ్ళిరి. కాని మగ్దలేనే మరియ మాత్రం సమాధి యొద్ద నిలువబడి యేడ్చు చుండెను. ఎందుచేత ననగా, ఆమెకు ప్రభువుపైనున్న నమ్మకమునుబట్టి. ఆమె పునరుత్థానుడైన యేసును మొదటిగా చూచెను (మార్కు 16:9).

యేసు పరలోకమునకు ఆరోహణ మగుటకు ముందు తన శిష్యులకు ఈలాగు ఆజ్ఞాపించెను. మీరు సర్వలోక మునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును (మార్కు 16: 15-16).

# బేతనియ సోదరీమణులు

## (Sisters of Bethany)

ఇది పదే పదే చెప్పబడుతున్న కథ. మార్త, మరియ వారి సోదరుడు లాజరును యేసు ప్రభువు ప్రేమించారు. “అంతట వారు ప్రయాణమై పోవుచుండగా, ఆయన యొక గ్రామములో ప్రవేశించెను. మార్త అను ఒక స్త్రీ ఆయనను తన యింట చేర్చుకొనెను. ఆమెకు మరియ అను సహోదరి ఉండెను. ఈమె యేసు పాదముల యొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను. మార్త విస్తారమైన పని పెట్టుకొనుట చేత తొందరపడి ఆయన యొద్దకు వచ్చి – ప్రభువా నేను ఒంటరిగా పనిచేయుటకు నా సహోదరి నన్ను విడిచి పెట్టినందున నీకు చింత లేదా? నాకు సహాయము చేయుమని ఆమెతో చెప్పుమనెను. అందుకు ప్రభువు మార్తా, మార్తా నీవు అనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందర పడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే, మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను (లూకా 10:38–42). యేసు ప్రభువు, ఆయన శిష్యులు తమ తమ ఇండ్లకు ఆహ్వానింప బడినపుడు సీమోను, లేవి అయిన మత్తయి, జక్కయ్య మున్నగు వారిలో మరి కొన్ని ఉదాహరణలు చూస్తాం. యేసు ప్రభువు ఆయన తల్లి మరియ కానాలోని ఒక వివాహానికి ఆహ్వానింపబడ్డారు.

ఒకరిని మన ఇంటికి ఆహ్వానించి నపుడు ఆ అతిధికి ఆతిధ్యమిచ్చు లాగున మన ఇంటిని సిద్ధపరుచుకుంటాము. ఇంటిని శుభ్రపరచి వారికొరకు మంచి భోజనము తయారు చేస్తాము. ఇవన్నీ బాహ్యంగా జరిగే సిద్ధపాటు గాని నీ కుటుంబజీవితము ఎలా ఉంది?

a) భార్య భర్తల మధ్య ప్రేమ ఉందా? పౌలు అంటున్నాడు “భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి. ఇది ప్రభువును బట్టి యుక్తమైనది. భర్తలారా, మీ భార్యలను ప్రేమించుడి, వారిని నిష్ఠూర పెట్టకుడి” (కొలస్స 3:18,19). మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తనను వలె తన భార్యను ప్రేమింపవలెను. భార్యయైతే తన భర్త యందు భయము కలిగి యుండు నట్లు చూచుకొన వలెను(ఎఫెసి 5:33).

b) మన బిడ్డలు మనకు విధేయులా? పిల్లలారా, అన్ని విషయములలో

మీ తల్లి దండ్రుల మాట వినుడి. ఇది ప్రభువును బట్టి మెచ్చుకొన దగినది (కొలస్స 3:20). "పిల్లలారా ప్రభువునందు మీ తల్లి దండ్రులకు విధేయులై యుండుడి, ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడ వగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది"(ఎఫెసి 6:1,2).

c) మన పెద్దలను మనము గౌరవిస్తున్నామా?

d) మన బోధకులను మనము గౌరవిస్తున్నామా?

e) మన ప్రధమ స్థానమును యేసు ప్రభునకు, ఆయన సంఘమునకు ఇస్తున్నామా?

f) మన కుటుంబంలో కుటుంబ ప్రార్ధన కలిగి ఉన్నామా?

g) మన బిడ్డలతో కలసి క్రమంగా సంఘ కార్యక్రమములకు హాజరవుతు న్నామా?

h) ఇతర క్రైస్తవులతో మనం సహవాసం కలిగి ఉన్నామా?

i) సిగ్గుపడ దగినది ఏదైనా మనం మన గృహంలో కలిగి ఉన్నామా?

యేసు ప్రభువు నీ హృదయంలోనికి నీ ఇంటిలోనికి రావడానికి ఇష్టపడు తున్నారు. ఆయన ఎట్టిపరిస్థితిలోను బలవంతగా ప్రవేశించరు. గాని సాతానుడు ఆహ్వానం లేకుండానే వచ్చేస్తాడు. వాడు మన జీవితాలపై మన కుటుంబాలపై దాడి చేస్తాడు. మన జీవితాలు కుటుంబాలు ఛిద్రం చేస్తాడు.

రోమాలోని క్రైస్తవులతో పౌలు అంటున్నాడు "పరిశుద్ధుల అవుసరములలో పాలుపొందుచు శ్రద్ధగా ఆతిధ్యము ఇచ్చుచుండుడి" (రోమా 12:13). సణుగుకొనకుండ ఒకనికి ఒకడు ఆతిధ్యము చేయుడి" (I పేతురు 4:9). "ఆతిథ్యము చేయ మరువకుడి". మనము అబ్రాహాము, లోతు ఇచ్చిన ఆతిథ్యమును గూర్చి చదువుతాము (ఆది 18:1;19:1). షూనేమియురాలు ఎలిషా ఎపుడు ఆ గ్రామమునకు వచ్చినా ఆతనికి ఆతిధ్యమిచ్చేది. ఆమె గోడమీద ఆతనికి ఒక గది కట్టించి అందు మంచము, బల్ల పీట, దీప స్థంభము ఆతనికొరకు ఏర్పరచింది (II రాజు 4:7-8).

క్రొత్త నిబంధనలో యేసు ప్రభువు అనేక గృహాలను దర్శించినట్టు చూస్తాం. ఆయన పేతురు ఇంటికి వెళ్లి ఆతని అత్తను స్వస్థపరిచారు. సమాజ మందిర

అధికారి అయిన యాయీరు ఇంటికి వెళ్లి ఆతని కుమార్తెను మరణం నుండి లేపారు. ఆయన జక్కయ్య ఇంటికి వెళ్లి నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది, ఎందుకనగా ఇతడును అబ్రాహాము కుమారుడే అని తెలిపారు. యొప్పేలో చర్మకారుడైన సీమోను ఇంటిలో పేతురు అతిధిగా ఉన్నప్పుడు తాను వెళ్లి అన్యులకు బోధించాలని ఒక దర్శనం చూసాడు (అ॥పొ॥9:43). పౌలు దమస్కులోని యూదా ఇంటిలో ఉన్నప్పుడు అననీయ ఆతని కొరకు వచ్చాడు (అ॥పొ॥ 9:10-18). సహోదరి లూదియ ఫిలిప్పీ పట్టణంలో అపొస్తులనకు ఆతని బృందానికి ఆతిధ్యమిచ్చి ఆ పరిసరాలలో సువార్త ప్రకటించుటకు సాయపడింది. కొరింథులో నున్నపుడు అకుల, ప్రిస్కిల్ల లతో ఆతను నివసించాడు (అ॥పొ॥ 18:32). మనము యేసు ప్రభుని మన జీవితంలోకి, హృదయంలోకి మన గృహంలోకి ఆహ్వానించినపుడు మనం ఆశీర్వదింపబడుదుము.

మార్త సోదరి మరియ ప్రభువు పాదాల వద్ద కూర్చుంది. దేవుని వాక్యం కొరకు ఆమెకు దాహం ఉంది."దుప్పి నీటి వాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీకొరకు నా ప్రాణము ఆశపడు చున్నది...." (కీర్త 42:1). "మార్త విస్తారమైన పని పెట్టుకొనుట చేత తొందర పడుతుంది"(లూకా 10:40). మరియ ప్రభువు నోటి నుండి వచ్చే తీయని మాటలతో తృప్తి పొందుతూ ఉంటే మార్త శారీరక ఆహారం గురించి హైరాన పడుతుంది. యేసు ప్రభువన్నారు నీకు ఒకటి అవుసరంగా ఉన్నది అని. రాజైన దావీదు కూడ ఒకటి కోరుతున్నాడు. "యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని దానిని వెదుకు చున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నాజీవిత కాల మంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్తన 27:4).

మరియ "ఉత్తమమైన దానిని" ఎంపిక చేసికొనినందువల్ల యేసు ప్రభువు ఆమెను ప్రశంసించారు. భౌతిక ఆహారం కంటే ఆమె ఆధ్యాత్మిక ఆహారం ఎన్నుకొంది. మనజీవితంలో మనం తీసికొనే నిర్ణయాల వల్ల మన జీవితం, దాని పరిణామాలు, ప్రతిఫలాలు ఆధారపడి ఉంటాయి. అబ్రాహాము, లోతులు కలసి నివసించలేక పోయినందువల్ల ఒకరి నుండి ఒకరు విడిపోవాలనుకున్నారు. "లోతు కన్ను లెత్తి యొర్దాను ప్రాంతమంతటిని చూచెను. యెహోవా సొదొమ, గొమొఱ్ఱా అను పట్టణములను నాశనము చేయక మునుపు సోయరుకు వచ్చు వరకు అదంతయు యెహోవా తోటవలెను ఐగుప్తు దేశము వలెను నీళ్లు పారు

దేశమై యుండెను. అందుచేత యోర్దాను ప్రాంతమంతటిని ఏర్పరచుకొనెను. లోతు ఆమైదాన మందున్న పట్టణముల ప్రదేశములలో కాపురముండి సొదొమ దగ్గర తన గుడారమును వేసికొనెను. సొదొమ మనుష్యులు దుష్టులును యెహోవా దృష్టికి బహు పాపులునై యుండిరి (ఆది 13:10–13). లోతు దుష్టుల మధ్య నివసించుటకు ఎన్నుకొన్నాడు. పర్యవసానం మన మెరుగుదుము. మోషే రాజకుమారుని జీవితం జీవించ అవకాశమున్నప్పటికి దేవుని ప్రజలతో ఉండుటకు ఎన్ను కున్నాడు. మోషే పెద్దవాడైనపుడు విశ్వాసమును బట్టి ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు. అల్పకాలము పాప భోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుటకు ఎన్ను కున్నాడు (హెబ్రీ 11:24). యెహోషువ, అతని ఇంటివారు నిజ దేవుడైన యెహోవాను సేవించుటకు ఎన్నుకొని ఆయనను మాత్రమే వెంబడించారు.

అవుసరమైనది అదే !!

## తబిత

## (Tabitha)

తబిత యొప్పేలోని సంఘ సభ్యురాలు. ఆమె పేరు హెబ్రీ భాష లోను గ్రీకు భాషలోను దొర్కా అని కూడ పిలువబడును. ఈమె చేసిన సత్కార్యములు, ధర్మ కార్యములు పరిశుద్ధ గ్రంథములో బహుగా పొగడ బడినవి. ఈమె యొక్క శరీరాకృతిని గూర్చి యెక్కువ తెలియదుగాని, ఆమె పరిశుద్ధత యను అలంకారమును కలిగి యుండెను. తబిత వ్యాధి గ్రస్థురాలై చనిపోయెను. యొప్పేలోని క్రైస్తవులు అపొస్తలుడైన పేతురు లుద్దలో యున్నాడని తెలుసుకొని యొప్పేకు రమ్మని కబురు చేసిరి (అపొకా. 9:36-42). తబిత యింటి దగ్గర విధవరాండ్రందరును చేరి యేడ్చుచు ఆమె తమతో యున్నపుడు కుట్టిన అంగీలను, వస్త్రములను చూపుచు పేతురు యెదుట నిలిచిరి. పేతురు అందరిని వెలుపలకు పంపి, మోకాళ్లూని ప్రార్ధన చేసి శవము వైపుతిరిగి తబితా లెమ్మనగానే ఆమె కన్నులు తెరచి పేతురును చూసి లేచి కూర్చుండెను. పేతురు విధవరాండ్రను, పరిశుద్ధులను పిలిచి ఆమెను సజీవు రాలినిగా వారికి అప్పగించెను.

### సత్క్రియలు

మంచి పనులు అనగా మనము ఇతరుల కొరకు చేయు సహాయము. కైసరయలోని కొర్నేలి దేవుని యందు భయభక్తులు కలిగి యుండి ప్రజలకు చేయు ధర్మకార్యములు దేవుని సన్నిధిలోనికి వెళ్లినట్లు వైద్యుడైన లూకా వ్రాసెను (అపొ.కా 10:1-4). మన పరలోక తండ్రి యైన యెహోవా అందరికి ఉపకారి (కీర్తనలు 145:9). ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను వర్షము కురిపించు చున్నారు (మత్తయి 5:45). కయీను తన తమ్ముడైన హేబెలును పంపినపుడు నీవు సత్క్రియ చేసిన యెడల తల నెత్తుకొనవా ? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచి యుండును. నీ యెడల దానికి వాంఛకలుగును నీవు దానిని ఏలుదువని దేవుడైన యెహోవా చెప్పెను (ఆది.కా. 4:7). సత్క్రియ చేయవలెనని మొదటి నుండియు మనకు దేవుడు చెప్పుచున్నారు. దేవుడాయనకు తోడై యుండెను గనుక ఆయన మేలు చేయుచు, అపవాది చేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను (అది. కా. 10:38). తీర్పుదిన మందు మంచి కార్యములు చేసిన వారిని చూచి,

నాతండ్రి చేత ఆశీర్వదింపడబడినవాలారా, రండి, లోకము పుట్టినది మొదలు కొని మీ కొరకు సిద్ధపరచబడి రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని యేసు చెప్పును. మంచి కార్యములు చేయని వారితో శపింపబడినవారలారా, నన్నువిడచి అపవాదికిని, వాని దూతలకును సిద్దపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి అని చెప్పును (మత్తయి 25:31-46).

## విలువ గల పరిచర్య

సత్‌క్రియ చేయు ప్రతి వానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ మహిమయు, ఘనతయు, సమాధానము కలుగును. అపోస్తలుడైన పౌలు గలతీ సంఘముకిట్లు వ్రాయుచున్నాడు "మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకుచేరిన వారి యెడలను మేలుచేయుదము" (గలతీ 6:10). తబిత యొప్పేలోని విశ్వాస గృహమునకు చెందిన విధవరాండ్రకు ఈ విధమైన మంచి కార్యములు చేయు చుండెను. మనము వాటి యందు నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధ పరచిన సత్‌క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసి పనియైయున్నాము (ఎఫెసీ 2:10).

మనము చేయు మంచి కార్యములు మనోహరమైన సువాసనను, దేవునికి ప్రీతి కరమును, ఇష్టమైన యాగమునైయున్నవి (ఫిలిప్పీ 4:9). మేము మీనిమిత్తము ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణజ్ఞానమును, ఆత్మసంబంధమైన వివివేకము గలవారునై, ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమునందు అభివృద్ధి చెందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టునట్లుగా నడుచు కొనవలెననియు, ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును, దీర్ఘశాంతమును కనుబరచునట్లు ఆయన మహిమశక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలె ననియు, పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివార మగునట్లు మనలను పాత్రులనుగా చేసెను..... (కొలస్స 1:10-12).

మంచి పనులు చేయుటకు యెన్నడును విసుకవద్దు మీరు ఒకని యెడల ఒకడును, మనుష్య లందరి యెడలను యెల్లప్పుడును మేలైన దానిని అనుసరించి నడుచుకొనుడి (1థెస్స 5:15). మేలు చేయుటలో విసుకవద్దు (2థెస్స3:13). తబిత తన మంచి కార్యములు ద్వారా తన్నుతాను అలంకరించుకొనినది. పరలోక మందున్న తండ్రి యైన దేవుని యొద్ద ధనమును ప్రోగుచేయు ప్రతి సత్కార్యమునకు

పూర్ణముగ సిద్ధపడియుండు నట్లు, దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును. ఖండించుటకును, తప్పుదిద్దుటకు, నీతి యందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది (2తిమోతి3:17). మేలు చేయు వాడు దేవుని సంబంధి. కీడు చేయువాడు దేవునిని చూచిన వాడు కాడు (3 యోహాను:11).

## ప్రాముఖ్యత

క్రొత్త నిబంధన గ్రంథములో మంచి పనుల యొక్క ప్రాముఖ్యతను గూర్చి వాటి విలువను గూర్చి మనము చదువుదుము. మంచి కార్యములు ఆత్మీయ ఫలములలో ఒకటిగను దేవునికిష్టమైన సువాసనగల యాగమును, ఒక ఆభరణముగను దేవుని మహిమార్థమైయుండి మనకు పరలోకములో ధనముగ యుండును. తబిత పరలోకమందు యెక్కువ ధనమును సమకూర్చుకొనినది (మత్తయి 6:19-20). పేదలను కనికరించుట ద్వారా తబిత దేవునికి అప్పు యిచ్చినది (సామెతలు 19:17).

యదార్ధహృదయులు అవసరతలలో యున్నవారికి సహాయము చేయుదురు. అట్టివారు కరుణా కటాక్షములను కిరీటముగ ధరింతురు (కీర్తనలు 63:3). ఆయనను వెంబడించు వారి యెడల ఆయన ఎంతో కనికరము గలవాడు. క్రైస్తవులమైన మనము మన పరలోకపు తండ్రి యొక్క ప్రేమ, దయలను రుచిచూచి యున్నాము (1 పేతురు 2:3). ఆయన ప్రేమ, కనికరము గల దేవుడైనందున అనేకులను స్వస్థపరచుచుండెను (మత్తయి 9:36), వారికి బోధించుచుండెను (మత్తయి 20:34). ఆహారము పెట్టుచుండెను (మార్కు 1:41; లూకా 9:12). ఆయన నాయీను విధవరాలి యెడల ఎంతోకనికరము గలవాడై ఆమె కుమారుని బ్రతికించెను (లూకా 7:11-18). యెరూషలేము నుండి యెరికోపోవుచున్న వ్యక్తి దొంగల చేతిలో చిక్కిగాయ పరచబడినపుడు అతనిని ఎక్కించుకొని అతని విషయమై జాగ్రత్త వహించెను (లూకా 10:30-37). కనికరములేనిదే కష్టములలో యున్నవారికి, అవసరతలలో, ఆపదలలో యున్న వారికి మనము సహాయము చేయలేము. మీ తండ్రి కనికరము గల వాడైయున్నట్లు, మీరును కనికరము గలవారై యుండుడి (లూకా 6:36).

తబిత తన మంచి కార్యముల ద్వారా మహిమను, ఘనతను, అక్షయతను, నిత్యజీవమును సంపాదించుకొనినది (రోమా 2:7). దీనికి ఆశ్చర్యపడకుడి,

సమాధులలో యున్నవారందరు ఆయన శబ్దము వినిమేలు చేసిన వారు జీవపునరుత్థానమునకు, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటకు వచ్చెదరు  (యెహాను 5:28-29).

మనము మరణము చెందినపుడు మనలను గూర్చి ప్రజలు యేమి చెప్పుదురు?  ఈలోకమును మనము విడిచి పెట్టునపుడు మనవెంట యెటువంటి క్రియలు వచ్చును?  (ప్రకటన 14:13).  తబిత యొక్క జీవితముతో మన జీవితములను సరిపోల్చుకొనిన మనస్థాన మెచ్చట యుండును?.



**Joshua and Kabita Gootam**

This book is a compilation of articles
sister Kabita Gootam wrote in English
for Satya Wakku in Telugu and Satya Bani
in Oriya magazines from time to time.



Kabita Gootam